ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
వరంగల్ : fb.com/vaartha Digital
Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
28-4-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 87 పేజీలు: 8+16 వెల: 6.50

బెంగాల్‌లో ముగిసిన ఎన్నికల ప్రచారం
హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తాం: ఇరాన్
5

# ఒట్టేసి చెప్తావా!



## బిజెపితో పొత్తుఉండదని హామీ ఇవ్వగలవా?

బిఆర్ఎస్‌కు భవిష్యత్తులేదు..
కెసిఆర్ శత్రువు కాదు.. రాజకీయ ప్రత్యర్థి
ఆయన ఆరోగ్యంగా ఉండడమే మంచిది
మీడియాతో సిఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్27:** తెలంగాణ రాజకీయాల్లో అధికార,ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదిరింది. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు. ఇప్పటికే బిఆర్ఎస్,బిజెపి లోపాయికారీ ఒప్పందంతో ముందుకు వెళ్తున్నాయని,కెసిఆర్‌కు దమ్ముంటే తాను నమ్మే దేవుడి మీద ఒట్టేసి వచ్చే ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకోబోమని ప్రకటించాలని సవాల్ విసిరారు. భవిష్యత్తులో ఒకవైపు కాంగ్రెస్,లెఫ్ట్ పార్టీలు,కోదండరాం కూటమి ఉంటాయని,మరోవైపు బిఆర్ఎస్, బిజెపి ఒకే జట్టుగా మారి ఎన్నికల బరిలోకి దిగుతాయని ఆయన జోస్యం చెప్పారు. సోమవారం శాసనమండలి కమిటీ హాల్‌లో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. కాంగ్రెస్ ఎంపీలను ఉద్దేశించి కెసిఆర్ చేసిన పరుష పదజాల వ్యాఖ్యలను రేవంత్ తీవ్రంగా తప్పుపట్టారు. పార్లమెంట్‌లో బిజెపి ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడినప్పుడు కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య,మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వెంటనే స్పందించి తిప్పికొట్టారని, ఆ విషయం బిఆర్ఎస్ నేతలకు వినిపించలేదా? అని ప్రశ్నించారు. వెదవలకు అందరూ వెదవల్లాగే కనిపిస్తారు అంటూ కెసిఆర్ వ్యాఖ్యలకు ధీటుగా కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ ఆరోగ్యంపై తాను ఎప్పుడూ నెగటివ్‌గా ఆలోచించలేదని, కేసీఆర్ తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, శత్రువు కాదని అన్నారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండటం తనకే మంచిదని, రాజకీయంగా ఎదుర్కోవడం సులభమవుతుందని వ్యాఖ్యానిం చారు. విశ్రాంతి తీసుకుంటున్న ప్రజా ప్రతినిధి గురించి చెడు కోరుకోవడం తన స్వభావం కాదని తెలిపారు. కేసీఆర్‌కు గాయమైనప్పుడు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించానని, అసెంబ్లీకి వచ్చినప్పుడు కూడా ఆయన్ను కలిసి యోగక్షేమాలు అడిగానని రేవంత్ రెడ్డి తెలిపారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ బతికిఉంటే తమకు అధికారం రాదని ఆయన కుటుంబ సభ్యులే భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేటీఆర్ ముఖ్యమంత్రి కావాలని మంత్రులతో ప్రకటనలు చేయించారని, అధికార పంపకాల విషయంలో తేడాలు రావడంతో కుటుంబంలో విభేదాలు వచ్చాయని అన్నారు. కేసీఆర్‌ను ఇప్పటికే రెండు సార్లు ఓడించానని, కేసీఆర్‌కు ఓటమి కొత్త విషయం కాదని, అలాగే గెలుపు కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని అన్నారు. మహేష్ గౌడ్ వర్సెస్ కేసీఆర్‌గా జరిగిన స్థానిక సంస్థల పోరులో >>2

## కాళేశ్వరంపై సిబిఐ విచారణకు ఒత్తిడి చేద్దాం

మంత్రులకు సూచించిన ముఖ్యమంత్రి రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్27:** కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు ఒత్తిడి పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది న్యాయ నిపుణుల సూచనల మేరకు ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై తక్షణమే విచారణ చేపట్టాలని కోరుతూ సీబీఐకి లేఖ రాయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను అదేశించారు. అవసరమైతే సీబీఐ డైరెక్టర్ అపాయింట్‌మెంట్ తీసుకుని, నేరుగా కలిసి >>2

# ఏమిటా చిల్లర కూతలు!


సోమవారం తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సమావేశంలో కెసిఆర్

## ప్రభుత్వ పనితీరు ఇలాగేనా?

ధాన్యం కొనడం కూడా చేతకావట్లేదు ..
తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఎవరూ అడ్డుకోలేదు
మా ఎంపీలు ఉంటే రణరంగమే..
ప్రజా సమస్యలపై పోరాడేవారికే టిక్కెట్లు
బిఆర్ఎస్ ప్రతినిధుల సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్27:** బీఆర్ఎస్ ప్రతినిధుల సమావేశంలో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో బీఆర్ఎస్ సభ్యులు లేనిలోటు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో పార్టీ ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఏపీ విభజనపై ఇటీవల లోక్‌సభలో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలపై కేసీఆర్ మండిపడ్డారు.డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బ్రిటిషర్లు భారత్,పాకిస్తాన్‌ను వేరు చేసినట్టు అత్యంత చెత్త విధానంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరు చేశారంటూ తేజస్వీ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.సభలోనే ఉన్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ 16 మంది ఎంపీలు ఎవరూ దానిపై కనీసం అభ్యంతరం తెలుపకుండా మౌనంగా ఉన్నారని, అదే పార్లమెంట్‌లో బిఆర్ఎస్ ఎంపీలు ఉండుంటే తేజస్వీ సూర్య మాటలకు రణరంగం సృష్టించేవాళ్లు అని పార్టీ అంతర్గత సమావేశంలో అభిప్రాయపడ్డారు.ఈ 16 మంది కాంగ్రెస్,బిజెపి ఎంపీలు తెలంగాణలో పుట్టలేదా? వాళ్లకు తెలంగాణ పౌరుషం లేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ పట్ల బీఆర్ఎస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఎవరికీ లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై రాజ్యసభలో సిఆర్ పాటిల్ మాట్లాడితే బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కెఆర్ సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారని గుర్తు చేశారు. చంద్రబాబుతో జై తెలంగాణ అనిపించేందుకే 2009లో టీడీపీతో తాము పొత్తు పెట్టుకున్నామని వివరించారు. రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్ విషయంలో రాజీ పడాలని సోనియాగాంధీ ఎన్నోసార్లు చెప్పారు కానీ నేను ఎప్పుడూ రాజీపడలేదు. అది నా చిత్తశుద్ధి అని కెసిఆర్ అన్నారు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయ రంగం నుంచి ఇతర అన్ని రంగాల్లో నంబర్ >>2



సోమవారం హైదరాబాద్‌లో పెట్రోలు బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు

# బంకుల వద్ద పోలీసు భద్రత


హైదరాబాద్‌లో పెట్రోలు బంకుల వద్ద రద్దీని నియంత్రిస్తున్న పోలీసులు

రద్దీ నియంత్రణకు తొలిసారి పోలీసులు రాక
రహదారులపై భారీగా పెరిగిన ట్రాఫిక్‌జామ్‌లు
పలు బంక్‌ల వద్ద 'నోస్టాక్' బోర్డులతో అలజడి

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరత కారణంగా పెట్రోల్ బంకుల్లో ఒక్కసారిగా పెరిగిన రద్దీ సోమవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా అనేకచోట్ల రహదారులపై ట్రాఫిక్ జాంలకు దారితీసింది. జంట నగరాలు, శివార్లలో ఈ సమస్య మరింత ఎక్కువగా వుండడంతో గ్రేటర్ పరిధిలో అనేక రహదారులపై వాహనాలు బారులుతీరడంతో కిలోమీటరు దూరం వరకు >>2

# ఇక హైస్పీడ్ రైల్వే కారిడార్లు

## గంటకు 330 కి. మీ వేగంతో రైళ్లు

హైదరాబాద్ -పుణే - ముంబయి కారిడార్‌కు డిపిఆర్ పూర్తి
జూన్ 2న సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం: మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 27,ప్రభాతవార్త:** రాష్ట్రఅభివృద్ధికి నాలుగు హైస్పీడ్ రైల్వే కారిడార్లను ఏర్పాటు చేస్తున్నా మని భారత్ ఫ్యూచర్ సిటీ కేంద్రంగా ఇది ఉంటుందని రోడ్లు భవనాలశాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి తెలి పారు. హై స్పీడ్ రైల్వే కారిడార్లపై సోమవారం డా.బి. ఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకొని పలువ్యూహాత్మక కారిడార్ల పురోగతిని సమగ్రంగా పరిశీ లించారు. ఈ సందర్భంగా మంత్రి కొమటిరెడ్డి మాట్లాడు తూ మూడు కారిడార్లు ఒకటి హైదరాబాద్ - పూణే - ముంబై కారిడార్ రెండవది భారత్ ఫ్యూచర్ సిటీ - చెన్నై వయా అమ రావతి కారిడార్ మూడవది భారత్ ఫ్యూచర్ సిటీ - బెంగళూరు కారిడార్ లను హైస్పీడ్ కారిడార్లుగా తయారించడానికి ప్రతిపాదించామని చెప్పారు. హైదరాబాద్ –పూణే –ముంబాయి కారిడార్ దూరం 761కి.మీ గల మొత్తం స్టేషన్లు 12 అందులో 10ఎలివేటెడ్,2 అండర్గ్రౌండ్ ఉండనున్నాయనీ వివరిం చారు. వికారాబాద్ దగ్గర 4.6 కి.మీ టన్నెల్ నిర్మించే అంశంపై ముఖ్యమంత్రి తో చర్చిస్తానని మంత్రి అధికారులతో అన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే నాన్ స్టాప్ గా 2 గంటల 55 నిమిషాల్లో చేరొచ్చని అధికారులు వివరించారు. 12 స్టేషన్లో ఆగితే గంటకు 330కి.మీ స్పీడ్ తో 3గంటల 21నిమిషాల్లో గమ్యస్థానం చేరుకునేలా ప్లాన్ చేసినట్టు తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ అమరావతి చెన్నై కారిడార్‌పై ప్రత్యేకంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తి సముఖంగా ఉందని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున స్పెషల్ సిఎస్‌వికాస్ రాజ్,పలువురు అధికారులు ఈ ప్రాజెక్టులో సమన్వయం చేసుకోవాలని సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీ బెంగళూరు కారిడార్‌లో మన్ననూర్ సోమశిల ప్రాంతాలను కలుపుతూ కారిడార్ డిజైన్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. హై స్పీడ్ రైల్వేతో పాటు రాష్ట్రంలో కొనసాగుతున్న రోడ్లు, వంతెనలు, ఆర్‌వోబిలు, హైకోర్టు భవనం, టిమ్స్ హాస్పిటల్స్ వేగంగా చేయాలని కోరారు. పనులు సమయానికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధి కారులను ఆదేశించారు. జూన్2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌ను ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించినట్లు మంత్రి వెల్లడించారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేలా టిమ్స్ ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు. మెడికల్ హెల్త్ శాఖతో సమన్వయం >>2



# ఎండ ప్రచండం!

రాష్ట్రవ్యాప్తంగా హీట్‌వేవ్ హెచ్చరికలు
ఆదిలాబాద్‌లో $45.2^{0}$ నమోదు
రెండు రోజుల్లో 47 డిగ్రీలకు చేరే అవకాశం
దేశంలో అత్యధికంగా అకోలాలో $46.9^{0}$

**హైదరాబాద్ / న్యూఢిల్లీ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు రోజురోజుకి అసాధారణంగా పెరుగుతున్నాయి. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు మించి నమోదవుతున్నాయి. దీంతో రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. భానుడి ప్రతాపానికి ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయికి చేరుతుండడంతో జనం విలవిలలాడుతున్నారు. తాజాగా ఆదిలాబాద్‌లో అత్యధికంగా 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై ఈ సీజన్‌లోనే అత్యంత వేడి రోజుగా నిలిచింది. అయితే రానున్న రెండు రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతోందని, ఉష్ణోగ్రతలు ఏకంగా 47 డిగ్రీల మార్కునుతాకే ప్రమాదం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అసాధరణంగా >>2



# పట్టాలు తప్పిన వందేభారత్

పుణే స్టేషన్ సమీపంలో దుర్ఘటన..
ప్రయాణికులు క్షేమం

**పూణె ఏప్రిల్ 27:** ముంబయి షోలాపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. పూణె రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశిస్తున్న సమయంలోనే ఈ దుర్ఘటన జరిగింది. అయితే ప్రయాణీకులెవ్వరికీ గాయాలుకూడా కాలేదని >>2

# అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీలుగా ప్రమాణం

-ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్27:** ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, మంత్రి అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం శాసన మండలిలోని కమిటీ హాల్‌లో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితోపాటు,అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గవర్నర్ శుక్లా ఆదేశాల మేరకు జీఏడి ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.


**సిఎం మైనారిటీలకు ప్రాధాన్యత ఇస్తున్నారు: అజారుద్దీన్**

ప్రమాణస్వీకారం అనంతర మంత్రి అజారుద్దీన్ మీడియా మాట్లాడారు. తనకు అవకాశం ఇచ్చిన పార్టీ, రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్సీగా తనను ప్రతిపాదించిన మంత్రిమండలి, పీసీసీకి, రాహుల్‌గాంధీ, ఖర్గే, సోనియాగాంధీకి ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తెలంగాణలో మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని వెల్లడించారు. రాజకీయాలు, జీవితంలో ఎత్తుపల్లాలు వస్తుంటాయన్న అజారుద్దీన్ >>2


సోమవారం ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేస్తున్న కోదండరామ్, మంత్రి అజారుద్దీన్

# అసెంబ్లీకి పార్లమెంటు కళ

పబ్లిక్ గార్డెన్స్‌లో మెంబర్స్ క్లబ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 27:** తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణం రూపురేఖలను పూర్తిగా మార్చేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. దేశ రాజధానిలో పార్లమెంట్ ప్రాంగణం తరహాలో రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణాన్ని కూడా హుందగా,అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో చేపట్టాల్సిన పనుల పైన శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సిఎం పలు సూచనలు చేశారు.పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ ప్రాంగణం ఉండాలి..సభగౌరవం పెరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.. మెంబర్స్‌కి మరింత ప్రైవసీ ఉండాలి చెప్పారు. పబ్లిక్ గార్డెన్‌లో మెంబర్స్ కోసం క్లబ్ ఏర్పాటు చేయాలని, సభ్యుల అరోగ్యంపై కోసం వాకింగ్ ట్రాక్,క్రీడల కోసం ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి సెంట్రల్ హాల్ పనులను సిద్ధం చేసి అందుబాటులోకి తీసుకురావాలని సిఎం డెడ్‌లైన్ విధించారు. అభివృద్ధి పనులు చేస్తున్న క్రమంలో చారిత్రక కట్టడాలకు, హెరిటేజ్ భవనాలకు నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# మహిళలు, చిన్నారులకు సరికొత్త భద్రత

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** హైదరాబాద్ మహా నగరంలో మహిళలు, చిన్నారుల రక్షణకు కొత్తగా మరో వ్యవస్థ ఏర్పాటయ్యింది. సిటీ పోలీసు విభాగంలోని మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటైన "స్పందన ఆల్ వుమెన్ ఫస్ట్ రెస్పాండర్ సిస్టం"ను సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ రూంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఎం మాట్లాడుతూ >>2


సోమవారం హైదరాబాద్‌లో బెలూన్లను ఎగురవేసి 'స్పందన'ను ప్రారంభిస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి సీతక్క, డిజిపి శివధర్‌రెడ్డి, సిపి సజ్జనార్ తదితరులు

మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు
తక్షణ రక్షణ కోసం 'స్పందన'ను ప్రారంభించిన సిఎం రేవంత్



బెంగాల్‌లోని నాదియాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చేస్తున్న శాంతిపూర్‌నియోజకవర్గ సిపిఐ(ఎం) అభ్యర్థి సౌమెన్ మహతో

# చిల్లర కూతలు!

>> వన్‌గా నిలబెట్టామని, రైతుల సంక్షేమం కోసం రైతుబంధు పథకం తీసుకొచ్చామని కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని ఈ సందర్భంగా కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడం ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్ల లేకపోవడం వల్ల రైతున్నలు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే తీవ్రంగా బాధ పడుతుందని అన్నారు. తెలంగాణలో ఏం జరుగు తోందో అర్థం కావట్లేదని పేర్కొన్నారు. బొందలో పడినట్లయిందని తెలంగాణ ప్రజలు ఆవేదనతో ఉన్నారని తెలిపారు. పక్క రాష్ట్రాల ప్రజలు హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న పెద్ద అంబేద్కర్ విగ్రహాన్నీ చూడడానికి వస్తుంటే ఈ ప్రభుత్వం గేట్లు తీయడం లేదని కేసీఆర్ మండిపడ్డారు. ఇది చండాలమైన ప్రభుత్వం.. ఇది చిల్లర ప్రభుత్వం అని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభివర్ణించారు. ఆ మాటలు, కూతలు ఏమిటి? అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై కేసీఆర్ నిప్పులు చెరి గారు. సింగరేణి కార్మికులకు అన్నీ చేసినా ఆ ప్రాంతంలో ఓడిపోయా మన్న కేసీఆర్ కాంగ్రెస్ నేతలు అక్రమాలు, భూకబ్జాలకు పాల్పడుతు న్నారన్నారు. ప్రజలు విసుగు చెందారని వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమ యంలో రాజీనామా చేయాలంటే కిషన్‌రెడ్డి పారిపోయారని గుర్తు చేశారు. ప్రజాసమస్యలపై ప్రజాక్షేత్రంలో పోరాడేవారికే వచ్చే ఎన్ని కల్లో టిక్కెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీలోని కమి టీలను రద్దు చేస్తున్నట్లు ఈ సందర్భంగా కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి 200 మందికి శిక్షణ ఇవ్వాలని కూడా ఆయన నిర్ణయించారు. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు కొత్త కమిటీలు వేయాలని నిర్ణయించినట్లు పార్టీ అధినేత కేసీఆర్ ఈ సమావేశంలో ప్రకటించారు. సభ్యత్వ నమోదులో లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని పిలుపునిచ్చారు. లేదంటే ఉద్వాసన తప్పదని హెచ్చరించారు. 60లక్షల సభ్యత్వాలు ఉన్నా ఎందుకు ఓడిపోయామో ఆత్మ విమర్శ చేసుకోవాలన్న ఆయన రాశి కాదు వాసి ముఖ్యమన్నారు. బిఆర్ఎస్ అంతర్గత సమావేశంలోనే జీవన్‌రెడ్డిని బిఆర్ఎస్ కార్యవర్గానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డిని పార్టీ జనరల్ సెక్రటరీగా ప్రకటించారు.

# బంకుల వద్ద పోలీసు భద్రత

>> ట్రాఫిక్ జాం ఏర్పడింది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు తొలిసారిగా పెట్రోల్ బంకుల వద్ద ట్రాఫిక్ పోలీసులను రంగంలో దిగాల్సి వచ్చింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి పెట్రోల్ బంకుల సమీపంలోని రహదారులపై ఏర్పడ్డ ట్రాఫిక్ జాం రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగడం గమనార్హం.

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడడం చాలాసార్లు జరగడం తెలిసిందే. కొన్నిసార్లు ఈ సమస్య ఒకటి రెండు రోజుల్లో పరిష్కారం కాగా ఇంకొన్నిసార్లు వారం రోజులకు తీరింది. అయితే దీనికి భిన్నంగా పెట్రోల్, డీజిల్ కొరత వల్ల బంకుల వద్ద ఒక్కసారిగా పెరిగిన వాహనాల కారణంగా బంకుల పక్కనే గల రహదారులు, ఇతర మార్గాలలో హఠాత్తుగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. వాస్తవానికి మూడు రోజులుగా ఎపిలో పె ట్రోల్, డీజిల్ కొరత వుండడం విదితమే. దీని కారణంగా సమీపంలోని తెలంగాణలో గల గ్రామాలు, పట్టణాలలో పెట్రోల్ బంకుల వద్ద ఆదివారం నుంచి రద్దీ పెరిగింది. ఇదే సమ యంలో తెలంగాణలో కూడా ఆదివారం మధ్యాహ్నం నుంచి పెట్రోల్, డీజిల్‌కు కొరత ఏర్పడడం మొదలయ్యింది. దీనిపై మీడియాలో వార్తలు రాగా అబ్బే అలాంటిదే లేదు...అంతా ఉత్తుదే... రాష్ట్రంలో కావలసినంత పెట్రోల్, డీజిల్‌వుంది, ఎవరూ భయపడాల్సి న అవసరం లేదంటూ పౌర సరఫరాల శాఖ సన్నాయి నొక్కులు నొక్కింది. అయితే ఆదివారం సాయంత్రం నుంచి సమ స్య మరింత అధికమై రాత్రి నుంచి అనేక చోట్ల పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు వెలియడంతో పాటు బంకులను మూసివేసి ఎలాంటి గొ డవలు జరగకుండా పోలీసులను బందోబస్తు కోసం రంగంలో దించారు. ఇక సోమవారం ఉదయం నుంచి పరిస్థితులు మరింత ముదిరాయి. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో గల మూడు వేలకు పైగా పెట్రోల్ బంకుల్లో సగం వరకు మూతపడగా మిగతా వాటి వద్ద అరకొర స్టాక్ వుండడ ంతో వాటి వద్ద చాంతడంత క్యూ లైన్లు వుండడంతో ఈ కారణంగా ఆయా ప్రాంతాలలోని రహదారులపై వాహనాల రద్దీ పెరిగి ఎక్కడికక్కడ ట్రాఫిక్ జాంలు ఏర్పడ్డాయి. నగరం నడిబొడ్డున గల అబిడ్స్, లక్‌డికాపూల్ వద్ద ఈ సమస్య స్పష్టంగా కనిపించింది. ఈ కారణంగా వాహ నాలు ముందుకు కదిలేందుకు చాలా సమయం వేచి వుండాల్సి వచ్చింది. ఇదే సమస్య ఇతర ప్రాంతాలలోనూ కనిపించింది. ఈ సమస్య నుం చి బయట పడేందుకు, బంకులపై వాహనదారులు దాడులకు దిగకుండా వుండేందుకు ట్రాఫిక్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు బందోబ స్తు కోసం నియమించారు. పెట్రోల్, డీజిల్ కొరతపై బంకుల డీలర్లు స్పష్టంగా సమాధానం చెప్పడం లేదు. పౌర సరఫరాల అధికారులు మా త్రం అంతా సవ్యంగానే వుంది, కొన్నిచోట్ల వాహనదారులు అధికంగా ఇంధనం కొనుగోలు చేయడం వల్ల ఈ సమస్య తలెత్తింది, ఒకటి రెండు రోజుల్లో అంతా సర్దుకుంటుంది అని చెబుతున్నారు. రెండునెలల క్రితం ఇలాంటి పరిస్థితులే తలెత్తినపుడు నాలుగు రోజులు వాహనదారులు నానా ఇక్కట్లు పడడం తెలిసిందే. ఈసారి పరిస్థితులు చక్కబడేందుకు ఎన్ని రోజులు పడుతుందో...? చూడాల్సి వుంది.

## పట్టాలు తప్పిన వందేభారత్

>> అధికారులు తెలిపారు. రాత్రి 7.30 గంటలప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ముంబయి ఛత్రపతిశివాజీ మహరాజ్ టెర్మినస్‌నుంచి వాయవ్య మహారాష్ట్రలోని షోలాపూర్‌కువెళుతోంది. ప్రీమియం ఎసి రైలు కావడంతో స్పీడ్‌కూడా ఎక్కువగానే ఉంటుంది. ప్లాట్‌ఫామ్ సమీపంలోకి వస్తున్న సమయంలో వందేభారత్‌కోచ్‌లలో ఒకదాని చక్రాలు పట్టాలు తప్పాయి. డైమండ్‌క్రాసింగ్‌వద్దనే ఈ ఘటన జరిగింది. అయితే యుద్ధప్రాతిపదికన ఈ క్రాసింగ్‌ను మరమ్మతుచేసి పునరుద్ధరించారు. పూణెస్టేషన్‌లో యార్డ్ రీమోడలింగ్‌పనులు జరుగుతుండటంతో క్రాసింగ్ కొంతమేర వంగింది. అంతేకాకుండా వెంటనే సరిచేసి ప్రయాణాలకు అనువుగా మార్చినట్లు అధికారులు తెలిపారు. పట్టాలు తప్పిన కోచ్‌నుంచి ప్రయాణీకులు దిగి సమీపంలోని ప్లాట్‌ఫామ్‌పైకి పరుగులుపెట్టారు.

# ఇక హైస్పీడ్ రైల్వే కారిడార్లు

>> చేసుకొని అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి అధికారులను స్పష్టంగా ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పనుల పురోగతిని తెలుసుకుని, రిపోర్ట్ తయారు చేయాలని స్పెషల్ సెక్రెటరీకి మంత్రి సూచించారు. వరంగల్ హాస్పిటల్ పనులపై ఆరా తీసిన మంత్రి పనుల పురోగతిపై అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి వివరాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పో రేషన్ లిమిటెడ్ అధికారి ఇందుధర శాస్త్రీ, సిపిఎం ముంబై యు.పి సింహ్, రజనీష్ సరోజ్, ఆర్ బి స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి ప్రావిణ్య, ఇఎన్సీలు మోహన్ నాయక్, జయభారతి, సిఇవనజతో పాటు పలువురు సీఈలు, రైల్వే అధికారులు, ఎన్ హెచ్ ఎస్ ఆర్ సిఎల్ హెచ్ ఎండీఏ రవీందర్ రెడ్డి, ఎంఎయుడీ, హెచ్‌ఎంఆర్ఎల్ సిపిఎం ఆనంద్ మోహన్, శ్రీనివాస్ రెడ్డి, బి.వి రావు, ధర్మారెడ్డి, రాజేందర్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంపై సిబిఐ విచారణకు ఒత్తిడి చేద్దాం

>> వినతిపత్రం సమర్పించాలని మంత్రులకు సూచించారు. హైకోర్టు పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటును, కమిషన్ ఇచ్చిన నివేదికను తప్పు పట్టలేదని, అవన్నీ చెల్లుబాటులో ఉన్నాయని న్యాయ నిపుణులు వివరించారు. సోమవారం సాయంత్రం కాళేశ్వరంపై ఇటీవల హైకోర్టు తీర్పు నేపథ్యంలో తదుపరి చేపట్టాల్సి న చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింఘ్వీ తో చర్చించి ప్రభుత్వం అనుసరించాల్సి న కార్యాచరణ ప్రణాళిక ను నిర్దేశించారు. సుప్రీం కోర్టు ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింఘ్వీ, మంత్రి శ్రీధర్ బాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాళేశ్వరం అంశంపై ప్రస్తుతం ఏ కోర్టులోనూ ఎలాంటి కేసు పెండింగ్‌లో లేదని న్యాయ నిపుణులు స్పష్టం చేశారు. అందువల్ల సీబీఐ విచారణ చేపట్టేందుకు చట్టపరమైన అడ్డంకులు లేవని అభిప్రాయపడ్డారు. రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు , సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, ఇరిగేషన్ ఈఎన్సీ శ్రీధర్, సలహాదారు ఆదిత్య నాథ్ దాస్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

28-04-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, భరణి కార్తె
ద్వాదశి సా.6.55
ఉత్తరఫల్గుణి రా.10.38
వర్జ్యం : లేదు
దు.ఉ.8.16-ఉ.9.07,
2)రా.11.31-రా.12.22
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కార్యక్రమాలను పూర్తిచేయ గలుగుతారు. సమావేశాలలో పాల్గొంటారు.

**వృషభం:** ఉద్యోగాలలో మిశ్రమ ఫలితాలు ఉంటాయి. బంధువులనుండి ఆసక్తికరమైన సమాచారం అందుకుంటారు.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలలో సొంతనిర్ణయాలు తీసుకోవడం మంచిది. సంతానపరంగా పురోగతి ఉంటుంది.

**కర్కాటకం :** జీవితభాగస్వామి సలహాతో నూతనకార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. వాహనాల విషయంలో జాగ్రత్త.

**సింహం:** సంగీత, సాహిత్య, కళా రంగములలోని వారికి అనుకుల కాలము. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కన్య :** ప్రతి చిన్నవిషయానికి భావోద్రేకాన్ని కలిగిఉంటారు. సహచరవర్గానికి సహాయం అందిస్తారు. నూతన విద్యావకాశాలు కలవు.

**తుల :** బాధ్యతలు అధికమవుతాయి. అండగా నిలిచేవారు, సహాయసహకారాలు అందించేవారు కరువవుతారు.

**వృశ్చికం:** మానసికంగా కృంగిపోరు. ఆత్మస్థైర్యంతో సమస్యలతో సమరం సాగిస్తారు. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

**ధనుస్సు:** ఆర్థికంగా చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఉండవు. కొత్త పెట్టు బడులకు అనుకూలమైన కాలం కాదు.

**మకరం:** మాటమీద నిలబడే వ్యక్తిగా మంచి పేరును సంపాదించగలుగుతారు. ఉద్యోగులకు స్థానచలనం కలదు.

**కుంభం:** ఫైనాన్స్ రంగంలోని వారికి అనుకూలకాలం కాదు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం. బంధువుల కలయిక.

**మీనం :** ఆలోచనలు పరిపరి విధాలుగా సాగుతాయి. సంతానం యొక్క పురోభివృద్ధి పైన శ్రద్ధవహించవలసి ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మహిళలు, చిన్నారులకు సరికొత్త భద్రత

>> మహిళలు, చిన్నారుల రక్షణకు తమ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఇదే సమయంలో వారిపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. మహిళలకు రక్షణ వున్న సమాజంలోనే అభివృద్ధి వుంటు ందని ఆయన తెలిపారు. ఈ విషయం అభివృద్ధి చెందిన దేశాల్లో మనకు స్పష్టంగా కనిపిస్తుందని ఆయన అన్నారు. మహిళల వరకు వస్తే వారికి ఓటు హక్కు కల్పించిందే కాంగ్రెస్ పార్టీ అని సిఎం తెలిపారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లకు ముందుగా వచ్చింది, సంపూర్ణ మద్దతు ఇచ్చింది కూడా తామేనని ఆయన తెలిపారు. ఇకరాష్ట్రంలో స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించింది కూడా తమ ప్రభుత్వ మేనని, ఈ కారణంగానే అనేక మంది మహిళలు మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు కాగలిగారని, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా గెలుపొందగలిగారని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిటే ఇస్తున్నామని ఆయన అన్నారు. తమ సర్కారు ఇచ్చిన చీరలను మహిళలు ఎంతో సంతోషంతో తీసుకున్నారని సిఎం తెలిపారు. రాబోయే రోజుల్లో ఏర్పాటు చేయబోయే ఆదర్శ పాఠశాలల బాధ్యతలను మహిళలకు ఇస్తామని సిఎం తెలిపారు. చట్టాలు, శాసనాలు చేయడంలో మహిళలకు ప్రాధాన్యత వుండాలని, ఈ విషయంలోనూ తాము మహిళలకు అండగా వుంటామని సిఎం తెలిపారు. రాష్ట్రంలో 67 లక్షలకు పైగా మహిళా సంఘాలు వుండగా వాటికి భారీగా రుణాలను అందించామని ఆయన చెప్పారు. ఇ ది సాధారణ విషయం కాదని ఆయన తెలిపారు. ఇక మహిళలకు ఉచిత బస్సు కోసం తమ సర్కారు ఇప్పటి వరకు పది వేల కోట్ల రూపాలను ఖర్చు చేసిందని, వెయ్యి ఆర్టీసీ బస్సులను మహిళలకు కేటాయించిందని, సోలార్ ఎనర్జీలో మహిళలకు భాగస్వామ్యం ఇచ్చామని ఇది కూడా పెద్ద విషయమని ఆయన అన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం తమ లక్ష్యమని, ఇందుకోసం తమ సర్కారు అహర్నిషలు కృషి చేస్తూనే వుందని ఆయన తెలిపారు. ఆపదలో వున్న మహిళలు, చిన్నారులను ఆదుకునేందుకు ఇప్పటికే వున్న షీ బృందాల కు తోడుగా కొత్తగా ఏర్పాటైన స్పందన మరింత రాణించాలని సిఎం కోరారు. ఇందుకోసం వున్న 100, 112 టోల్ ఫ్రీ నంబర్లు అందరికి అందుబాటులో వుండాలని ఆయన కోరారు. దీనికి సంబంధించి కంట్రోల్ రూంకు సమాచారం అందగానే అక్కడి సిబ్బంది సమీప పోలీసులకు వెంటనే సమాచారం చేరవేస్తారని, బాధితులు ఒకవేళ గాయపడి వుంటే ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తారని సిఎం తెలిపారు. స్పందన వ్యవస్థ జంట నగరాలలోని ప్రతీ రెండు ఎసిపి జోన్‌లకు ఒక బృందం వుంటుందని సిఎం తెలిపారు. అంతకు ముందు స్పందనకు సంబంధించిన పోస్టర్‌ను సిఎం రేవంత్ రెడ్డి సహా మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క తదితరులు విడుదల చేశారు.

**డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాల్సిందే..**

రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడికి కఠినంగా వ్యవహరించాల్సిందేనని, ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షిం చవద్దని పోలీసులు, ఈగల్ సిబ్బందికి సిఎం ఆదేశించారు. పంజాబ్ రాష్ట్రం తీవ్రమైన డ్రగ్స్ సమస్యతో ఇబ్బంది పడుతోందని, అక్కడి యువతలో చాలా మంది దీని బారినపడి అవస్థలు పడుతున్నారని సిఎం తెలిపారు. ఈ పరిస్థితి మనకు రాకుండా వుండాలంటే అందరం కలిసి కట్టుగా ముందుకు సాగాలని సిఎం కోరారు. ఈ విషయంలో పోలీసుల బాధ్యత ఎంత వుందో...? కుటుంబ పెద్దల బాధ్యత కూడా అంతే వుందని సిఎం తెలిపారు. అందరు తమ పిల్లలు ఏం చేస్తున్నారనే దాని గురించి గమనించాలని, ఒకవేళ దారితప్పి వుంటే వెంటనే చక్కదిద్దుకోవాలని, లేకుండా చేయిదాటే ప్రమాదం వుందని ఆ యన అన్నారు. డ్రగ్స్‌తో పట్టుబడ్డ వారు ఎంతటి వారైనా వదలవద్దని సిఎం ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, డిజిపి శివధర్ రెడ్డి, సిటీ కొత్వాల్ సజ్జన్నర్, అదనపు కొత్వాళ్లు తఫ్సీర్ ఇక్బాల్ (శాంతి భద్రతలు), శ్రీనివాస్ (సిట్ అండ్ క్రైం) తదితరులు పాల్గొన్నారు.

# ఒట్టేసి చెప్తావా!

>> కూడా కేసీఆర్ ఓటమి చవిచూశారని గుర్తు చేశారు. తాము వివక్ష లేకుండా ప్రభుత్వం నడుపుతున్నామని, అన్ని వర్గాల ప్రజలకూ సమన్యాయం చేస్తూ పాలన కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కవిత కొత్త పార్టీ (తెలంగాణ రాష్ట్ర సేన) ఏర్పాటుపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కొత్త పార్టీ సంగతి తరువాత, ముందు ఉన్న పార్టీ (బీఆర్ఎస్) ఉంటుందా? ఊడుతుందా? కేసీఆర్ పార్టీకే మనుగడ లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి గతం ఉంది తప్ప, భవిష్యత్ లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం అప్పుడు వారు ఎలా మాట్లాడినా సహించారన్న ఆయన, అధికారంలో ఉన్న పదేళ్లు కూడా అలాగే మాట్లాడారని, అందుకే ప్రజలు ఓడించారని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబానికి, బీఆర్ఎస్ పార్టీకి ప్రజలతో ఎలాంటి సంబంధాలు లేవని ధ్వజమెత్తారు. కేసీఆర్ విశ్రాంతిలో ఉన్న ప్రజాప్రతినిధి అని, ఆయన చావును తానెందుకు కోరుకుంటానని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసమే పుట్టిన పార్టీగా బిఆర్ఎస్ తన లక్ష్యాన్ని నెరవేర్చుకుందని, ఇప్పుడు ఆ పార్టీకి ఎలాంటి ప్రాధాన్యత లేదని రేవంత్ వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో ప్రతి యాక్టివిటీకి ఒక ప్రయోజనం ఉంటుందని, ఆ ప్రయోజనం తీరిపోయాక దానికి విలువ ఉండదని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రీకృష్ణ కమిటీ నివేదిక ఇచ్చాక అది ఎలాగైతే గతమైపోయిందో, బిఆర్ఎస్‌కు గతం ఉంది తప్ప, భవిష్యత్తు లేదన్నారు. ప్రయోజనం తీరిపోయిన తర్వాత ఏ పార్టీకైనా భవిష్యత్తు ఉండదని చెబుతూ బిఆర్ఎస్ ఒక చనిపోయిన శవం వంటిదని, చనిపోయిన శవానికి ఎంత అలంకరణ చేసినా అది తిరిగి రాదు రేవంత్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. తెలంగాణ సాధనలో వారు ఎంత అసహ్యంగా వ్యవహరించినా రాష్ట్రం కోసం ప్రజలు భరించారని, రాష్ట్రం వచ్చాక వారి అహంకారాన్ని అహంభావాన్ని కూడా సహించారని గుర్తు చేశారు. 14 ఏళ్ల ఉద్యమం వారిని కాపాడిందని, కానీ అధికారాన్ని అడ్డం పెట్టుకుని వారు చేసిన ఆగడాలను చూసి ప్రజలు 2023లో ఓడించి, పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చారని మండిపడ్డారు. బిఆర్ఎస్ నుంచి విడిపోయిన విభాగాలు లేదా కొత్తగా వస్తున్న ముసుగులన్నీ ఒకే తాను ముక్కలని కవిత రాజకీయ పార్టీపై వ్యాఖ్యానించారు. వీరంతా ఒకే చెరువు నీళ్లు, వీరి రంగు, రుచి, వాసన మారదు, పంపకాల పంచాయతీలో వచ్చిన విభాగమే ఇదంతా అన్నారు. కేసీఆర్ మర మనిషో కాదో కుటుంబ సభ్యులకే తెలియాలని, కవిత ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం లేదన్నారు. రాజ్యసభలో బిఆర్ఎస్ ఎంపీలు బిజెపికి అనుకూలంగా ఏం చేశారో అందరికీ తెలుసని, ఏడు మండలాలను ఏపీలో విలీనం చేస్తున్నప్పుడు కెసిఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. వివక్ష లేని పాలన కాంగ్రెస్‌దని, తమకు ప్రతిపక్షమే లేదన్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుపట్టలేదని, కొన్ని సాంకేతిక లోపాలున్నాయని మాత్రమే చెప్పిందని అన్నారు. నివేదిక ఆధారంగా చర్యలు వద్దని కోర్టు చెప్పినట్లు తెలిపారు. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ తర్వాతే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. సీబీఐ వివరాలు కోరితే అన్నీ ఇస్తామని, విచారణ మొదలైతే అన్నీ బయటకు వస్తాయని చెప్పారు. సీబీఐ విచారణ కోరితే కేంద్రం 48 గంటల్లో లోపల వేస్తామన్నారని సీఎం గుర్తు చేశారు. సీబీఐ విచారణ కోరినా కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడట్లేదు? అని, విచారణ కోసం కేంద్రం వద్దకు వెళ్తామని తెలిపారు. సిబిఐ విచారణ కోసం పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా ఉద్యమిస్తామన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు కోర్టు పరిధిలో ఉందని, చట్టబద్ధంగా విచారణ జరుగుతోందన్నారు. దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్న జమిలి ఎన్నికల అంశంపై స్పందిస్తూ జమిలి అనేది ఎవరికీ అర్థం కాదని ఓ బ్రహ్మ పదార్థమని పేర్కొన్నారు. బిజెపి నేతలు తమలో తామే మాట్లాడుకుంటున్నారు తప్ప దానిపై ఎవరికీ స్పష్టత లేదని కొట్టిపారేశారు. మహిళా రిజర్వేషన్‌కు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, ప్రస్తుతం ఉన్న 543 ఎంపీ సీట్లలో, అన్ని రాష్ట్రాల్లోని ఎమ్మెల్యే సీట్లలో మహిళా రిజర్వేషన్లు అమలు చేయవచ్చని, 2027లో ఉత్తరప్రదేశ్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేయవచ్చన్నారు. ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యను మార్చకుండా నియోజకవర్గాల పునర్విభజన చేయవచ్చాన్నారు. ఎంపీ సీట్ల సంఖ్య పెంచాలనుకుంటే అన్ని పక్షాలతో చర్చించాలని పేర్కొన్నారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ ప్రక్రియకు ఎటువంటి ఆటంకం లేదని, సెక్షన్ 8బి, 8సి ప్రకారం ఎటువంటి కఠిన చర్యలు తీసుకోవద్దని మాత్రమే హైకోర్టు సూచించిందన్నారు. కాళేశ్వరం పాపాలను కప్పిపుచ్చుకోవడానికి ఎంత ప్రయత్నించినా దోషులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఎన్‌డిఎస్‌ఏ చైర్మన్ మేడిగడ్డకు వచ్చి సమీక్ష చేయడంపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు.



సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన నీతి ఆయోగ్ సభ్యుడు గోబర్ధన్ దాస్

## తేజస్వి సూర్య ఫోన్ చేస్తే, వ్యాఖ్యలు తప్పని చెప్పా

### దేశంలో పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయి

### కవిత పార్టీ టిఆర్ఎస్‌పై కెటిఆర్ స్పందన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్27:** తన సోదరి కవిత ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పార్టీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. చాలా పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయని వ్యాఖ్యానించారు. భారతదేశంలో పాతికేళ్లు పూర్తి చేసుకున్న పార్టీలు చాలా తక్కువగా ఉన్నాయని చెప్పారు. కొత్త పార్టీని పెద్దగా పట్టించుకోవాల్సి న అవసరం లేదని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ గురించి చాలామంది ఏదేదో మాట్లాడుతున్నారని, వాటిని కూడా పట్టించుకోవాల్సి న అవసరం లేదని అన్నారు. సోమవారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ తన పేరు ప్రస్తావిస్తాడని రేవంత్ రెడ్డి ఎదురుచూస్తున్నాడని అన్నారు. రేవంత్ రెడ్డిని ఎవరూ గుర్తించడం లేదని.. యాంకర్లు గుర్తుపట్టడం లేదని తెలిపారు. దేవుడి మీద ఒట్లు పెట్టి మాట తప్పిన మనిషి గురించి ఏం మాట్లాడతామని ప్రశ్నించారు. ఆయనో మనిషి? ఆయన నోటికి, మాటకు విలువ ఉన్నదా అని మండిపడ్డారు. బిజేపీ ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంటులో తెలంగాణ విభజన గురించి తప్పుగా మాట్లాడితే ముందుగా ఖండించింది తమ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావులేనని కేటీఆర్ గుర్తు చేశారు. తేజస్వీ సూర్య తనకు కూడా ఫోన్ చేసి, తాను మాట్లాడిన దానిని మీ (బీఆర్ఎస్) వాళ్లు తప్పుగా అర్థం చేసుకున్నారని చెప్పారని, కానీ మీరు మాట్లాడింది తప్పని ఆయనకు చెప్పేశానని కేటీఆర్ తెలిపారు. మేం ఖండించిన తర్వాతనే ఆయన సభలో వివరణ ఇచ్చారని చెప్పారు. బీఆర్ఎస్ సభ్యులు లోక్ సభలో ఉండి ఉంటే మా వాళ్లు అప్పుడే ఖండించేవారని చెప్పారు. హైదరాబాద్‌లో దోమలు, మంచినీటి బెడద ఎక్కువైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు.

## అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీలుగా ప్రమాణం

>> అన్నింటినీ అధిగమిస్తూ ముందుకు సాగాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లో ముస్లింల ఓట్ల కోసమే మంత్రి పదవి ఇచ్చారనేది వాస్తవం కాదన్న ఆయన, సీఎం మొదట్నుంచి మైనార్టీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి తన మీద పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఇప్పుడు తాను కెప్టెన్‌ను కాదని, తమ కెప్టెన్ రేవంత్ రెడ్డి అని స్పష్టం చేశారు.

**ఇచ్చిన మాటను నెరవేరుస్తాం: ప్రొఫెసర్ కోదండరామ్**

పార్టీ ప్లీనరీలో చర్చించాక సమస్య పరిష్కారంపై కార్యాచరణ ప్రకటిస్తామని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఈ ఎమ్మెల్సీ ఉపయోగపడుతుందని భావిస్తున్నామని, అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని ప్రజలకు హామీ ఇస్తున్నామని చెప్పారు. యూనివర్శిటీల పునరుద్ధరుణ, బీసీ రిజర్వేషన్ల సాధన వంటి అనేక అంశాలపై పని చేస్తూనే ఉన్నామని, తమ పని తాము కొనసాగిస్తూనే ఉన్నామని, ఈ ఎమ్మెల్సీ పదవి అందుకు మరింత ఉపయోగపడుతుందని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఇంతకాలం పోరాడినట్లే ప్రజల తరఫున ఇకముందు పోరాడుతామన్నకోదండరాం రాజకీయాల్లో సరళమైన జీవనశైలి చాలా అవసరమని, అది కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జయశంకర్‌కు ఇచ్చిన మాటను నెరవేరుస్తామని హామీ ఇస్తున్నామని, అసలైన ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం కమిటీ వేస్తామని ప్రకటించిందని, కార్యాచరణ వేగంగా జరగాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని వెల్లడించారు.

# ఎండ ప్రచండం!

>> పెరుగుతున్న ఎండ వేడిని పరిగణనలోనికి తీసుకున్న ఐఎండి, రాష్ట్ర వ్యాప్తంగా హీట్ వేవ్(వడగాలులు) హెచ్చరికలు జారి చేసింది. ముఖ్యంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కొమరంభీమ్, నిర్మల్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లాలకు అత్యంత ప్రమాదకరమైన రెడ్ అలెర్ట్ (ఎరుపురంగు ప్రమాద హెచ్చరిక)ను జారి చేసింది. ఈ జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలకు కూడా ఆరెంజ్ అలర్ట్ జారి చేస్తూ.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా.. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున బయటకు రావొద్దని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఒకవైపు ఎండలు మండిపోతున్నప్పటికీ స్థానికంగా ఏర్పడిన వాతావరణ మార్పుల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేస్తోంది.

**ఉత్తరాదిన మరింత పెరిగిన ఉష్ణోగ్రతలు**

దేశంలో ఎండలు మండిపోతున్నాయి. దాదాపు అన్ని ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటాయి. దీనితో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఉత్తర, మధ్యభారతావనిలో వడగాడ్పులు తీవ్రత పెరిగింది. భారత వాతావరణ శాఖ అధికార వర్గాల ప్రకారం, సోమవారం దేశంలోనే అత్యధికంగా మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో 46.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అమరావతి (మహారాష్ట్ర)లో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వెల్లడించింది. వాతావరణ శాఖ డేటా ప్రకారం, వార్ధాలో 46.4 డిగ్రీలు, యవత్మాల్‌లో 46 డిగ్రీలు, నాగ్‌పూర్‌లో 45.4 డిగ్రీలు, చంద్రాపూర్‌లో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విదర్భ ప్రాంతంలో తీవ్రమైన వడగాలులు వీచాయని తెలిపింది. ఈ వారం మొత్తం దేశంలోని అనేక ప్రాంతాల్లో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ సంవత్సరం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 నుంచి 46 డిగ్రీల వరకు చేరుకోవచ్చని, కొన్ని ప్రాంతాల్లో 47 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. రాబోయే 7 రోజులలో, ముఖ్యంగా పంజాబ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, విదర్భలోని పలు ప్రాంతాలలో వడగాలుల పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని ఐఎమ్‌డి విస్తృత అంచనా సూచిస్తోంది. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్న సమయాల్లో బయటకు రాకూడదని అధికారులు సూచించారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతూ, సాధారణం కంటే అధిక పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో, భారత వాతావరణ శాఖ వడగాలుల మార్గదర్శకాలు, సలహాలను జారీ చేసింది. వాయువ్య, మధ్య, ద్వీపకల్ప భారతదేశం అంతటా గరిష్ట ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 40 డిగ్రీల సెల్సియస్ నుండి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతున్నాయి. అనేక ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే ఎక్కువగా నమోదవుతున్నాయని, ఇది దేశంలోని కొన్ని ప్రాంతాలలో వడగాలి పరిస్థితి తీవ్రత తెలియజేస్తున్నదని పేర్కొంది.

## పశ్చిమాసియాలో శాంతికి శాయశక్తులా కృషిచేస్తాం: పుతిన్

**మాస్కో, ఏప్రిల్ 27:** ఇరాన్, అమెరికాఇజ్రాయెల్ యుద్ధంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పందించారు. పశ్చిమాసియాలో తమకు సాధ్యమైనంత వరకు శాంతిపునరుద్ధరణ కోసం ప్రతి ఒక్కకార్యాచరణ అమలుచేస్తామని అన్నారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశ్చిమాసియా ప్రాంతంలో త్వరగా శాంతి నెలకొనేలా చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ ప్రాంత ప్రజలందరి ప్రయోజనాలకు ఉపయోగపడే ప్రతిదీ చేస్తామని అరాఘ్చీతో పుతిన్ చెప్పినట్లు రష్యా ప్రభుత్వ మీడియా పేర్కొంది. అరాఘ్చి రష్యా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. రష్యా, ఇరాన్ మధ్య సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయని అన్నారు. ఇవి మరింతగా బలోపేతమవుతున్నట్లు పేర్కొన్నారు. చర్చలు విఫలం కావడానికి అమెరికానే కారణమని ఆరాగ్చి అన్నారు. పుతిన్‌తో వేదిక పంచుకోవడానికి ముందు అరాఘ్చి మాట్లాడారు.



డిజిపి కార్యాలయంలో సోమవారం జరిగిన వీడ్కోలు సభలో డిజిపి శివధర్ రెడ్డిని సన్మానించిన శాంతిభద్రతల డిజి మహేష్‌భగవత్, ఎస్‌పిఎఫ్ డిజి స్వాతిలక్రా, సిఐడి డిజి చారుసిన్హా తదితరులు

## డిజిపి శివధర్‌రెడ్డికి వీడ్కోలు

### ఘనంగా సన్మానించిన డిజిలు మహేష్ భగవత్, స్వాతిలక్రా, చారుసిన్హా తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేస్తున్న డిజిపి శివధర్ రెడ్డికి సోమవారం నాడు డిజిపి కార్యాల య సీనియర్ అధికారులు, ఎన్జీఓ అధికారులు ఘనంగా వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిజిపి శివ ధర్ రెడ్డిని శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్, ఎస్‌పిఎఫ్ డిజి స్వాతి లక్రా, సిఐడి డిజి చారు సిన్హా, పర్సనల్ అదనపు డిఎస్ చౌహాన్, పోలీసు సంక్షేమ విభాగం ఐజి గజారావు భూపాల్ తదితరులు ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డిజిపి శివధర్ రెడ్డి పోలీసు శాఖకు 32 ఏళ్ల పాటు అందించిన సేవలను వారు కొనియాడారు. ముఖ్యం గా ఇటీవల కాలంలో తెలంగాణ పోలీసుల ఎదుట 800 పైగా నక్సలైట్లు లొంగిపోవడం వెనుక డిజిపి కార్యసిద్ధి వుందని శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కు అరైవ్, అలైవ్ పేరిట చేబట్టిన కార్యక్రమం కూడా విజయవంతం అయ్యిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, లీగల్ విభాగం డైరక్టర్ గంగాధర్ తదిత రులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన మరో కార్యక్రమంలో టిఎన్‌జిఓలు కూడా డిజిపిని సన్మానించారు.

## బంగ్లా రాయబారిగా కేంద్ర మాజీమంత్రి దినేశ్‌త్రివేది

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** బిజెపి సీనియర్ నాయకుడు కేంద్ర రైల్వేశాఖ మాజీ మంత్రి దినేశ్‌త్రివేదిని బంగ్లాదేశ్ తదుపరి రాయ బారిగా కేంద్రం నియమించింది.



ప్రస్తుతం అక్కడన్న ప్రణయ్‌వర్మ ను బెల్జియం, యూరోపియన్ యూనియన్ రాయబారిగా పంపిస్తున్నారు. 75 ఏళ్ల త్రివేది షేక్ హసీనా దిగిపోయిన తర్వాత దెబ్బతిన్న రెండుదేశాల సంబంధాలను మళ్లీ పునరుద్ధరించగలరని కేంద్రం భావిస్తోంది. దినేశ్‌త్రివేది రైల్వే మంత్రిగా 2011 నుంచి 2012వరకూ పనిచేసారు. అలాగే 2009 నుంచి 2011వరకూ కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రిగా పనిచేసారు. మన్మోహన్‌సింగ్ కేబినెట్‌లో మంత్రిగాపనిచేసిన త్రివేది 2009 నుంచి 2019 వరకూ లోక్‌సభ ఎంపిగాకొనసాగారు. కోల్‌కత్తాలోని బారక్ పోర్ నియోజకవర్గంనుంచి టిఎంసి ఎంపిగా ఎన్నికయ్యారు. అయితే ఆ తర్వాత ఇఎంసికి రాజీనామా చేసి బిజెపిలో చేరారు. ఆస్టిన్‌లోని టెక్సాస్ యూనివర్సిటీనుంచి ఎంబిఎ ఉత్తీర్ణులయిన దినేశ్ పైలట్ శిక్షణ కూడా పొందారు. సొంతంగా ఎయిర్‌కార్గో బిజినెస్‌కూడా నిర్వహించారు. దెబ్బతిన్న సంబంధాలకు ప్రభుత్వం మారినప్పటినుంచే చికిత్స ప్రారంభించారు. బంగ్లా విదేశాంగమంత్రి ఖలీలుర్‌రెహమాన్ భారత్‌లోకూడా పర్యటించారు. ఎన్ఎస్ అజిత్‌దోవల్, విదేశాంగమంత్రి జైశంకర్‌లతో చర్చలుజరిపారు. వాణిజ్యం, ఇంధనం, ఇరు దేశాల ప్రజల్లో పరస్పర సంబంధాలుపెంపొందేవిధంగా చర్చలుజరిగాయి.

# న్యూజిలాండ్‌తో చరిత్రాత్మక ఒప్పందం

### స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత్, న్యూజిలాండ్ వాణిజ్య మంత్రులు సంతకాలు

### రైతులు, యువత, స్టార్టప్‌లకు ఎంతో మేలు: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** భారత్-న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కుదిరింది. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఇరుదేశాల వాణిజ్య మంత్రులు పీయూష్ గోయల్, టాడ్ మెక్‌క్లే సంతకాలు చేశారు. ఈ ఎఫ్‌టిఏ వల్ల భారత్‌కు ఎంతో మేలు చేకూరనుంది. ముఖ్యంగా భారత్ నుంచి న్యూజిలాండ్‌కు ఎగుమతి చేసే 100శాతం ఉత్పత్తులకు కస్టమ్స్ డ్యూటీ నుంచి మినహాయింపు లభిస్తుంది. అంటే అన్ని ఉత్పత్తి కేటగిరీలకు, అన్ని టారిఫ్ లైన్లకు ప్రవేశ పన్నుల నుంచి మినహాయింపు దొరుకుతుంది. దీనివల్ల వస్త్రాలు (టెక్స్‌టైల్స్), దుస్తులు (అపెరల్స్), (తోలు) లెదర్, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, ప్రాసెస్డ్ ఫుడ్స్‌లాంటి రంగాల్లో పోటీతత్వం పెరుగుతుంది. తద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఇ)కు, ఉపాధి కల్పనకు మంచి ఊతం లభిస్తుంది.

ఈ ఒప్పందంపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, 'భారతదేశపు మొట్ట మొదటి మహిళా నేతృత్వ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అని, ఇది ఇరు దేశాల ద్వైపాక్షిక ఆర్థిక ప్రయాణంలో ఒక కీలకమైన మైలురాయి' అని అన్నారు. ప్రధాన సంధాన కర్త, ఉప సంధానకర్త, పారిశ్రామిక రంగాల అధిపతు లతో సహా, సంప్రదింపుల బృందంలో అధిక శాతం మహిళలే ఉన్నారనే విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రోత్సహించిన ఈ చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం, వాణిజ్య సంప్రదింపులలో లింగ సమానత్వానికి ఒక మైలురాయిగా, అలాగే దేశీయ పరిశ్రమలకు, అంత ర్జాతీయ వాణిజ్య సంబంధాలకు ఒక ప్రోత్సాహంగా పరిగణించ బడుతోందని పేర్కొన్నారు.

ఈ చరిత్రాత్మక ఒప్పందం గాఢమైన పరస్పర విశ్వాసాన్ని, ఉమ్మడి ఆశయాన్ని, శ్రేయస్సు పట్ల ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబిస్తుందని గోయల్ అన్నారు. "ఇది న్యూజిలాండ్‌కు భారతీయ ఎగుమతులకు 100 శాతం సుంకరహిత ప్రవేశాన్ని కల్పిస్తుంది. తద్వారా ఎంఎస్‌ఎంఈలు, రైతులు, మహిళలు, యువత, నిపుణులు, ఉద్యోగ కల్పన రంగాలకు గణనీయమైన అవకాశాలను తెరుస్తుంది. అదే సమయంలో, సమతుల్యమైన, క్రమబద్ధమైన చట్రం ద్వారా భారత దేశపు సున్నితమైన ప్రయోజనాలను కాపాడు తుంది' అని ఆయన అన్నారు. ఈ దూరదృష్టి గల ఒప్పందం భారతదేశంలోకి 20 బిలియన్ డాలర్ల పెట్టు బడులను సులభతరం చేస్తుం దని, వాణిజ్యం, సేవలు, పెట్టుబడి, ఆవిష్కరణ, చలనశీలత, వ్యవసాయ ఉత్పాదకత, విద్యలో సహకారాన్ని మరింతగా పెంచు తుందని, అలాగే నైపుణ్యం గల ప్రతిభావంతులు, విద్యా ర్థులకు మార్గాలను సృష్టిస్తుందని గోయల్ అన్నారు.



**రైతులు, యువత, స్టార్టప్‌లకు చాలా మేలు: ప్రధాని మోడీ**

భారత్-న్యూజిలాండ్ సంబంధాల్లో ఇదో గొప్ప రోజు అని, ఇది ఇరుదేశాల అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'భారత్ న్యూజిలాండ్ భాగస్వామ్యంలో ఈరోజు ఒక చారిత్రక ఘట్టంగా నిలిచిపోతుంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం మన రెండు దేశాల అభివృద్ధిని మరింత వేగవం తం చేస్తుంది. ఇది మనమధ్య ఉన్న నమ్మకాన్ని, ఉమ్మడి విలువలను, ఆశయా లను ప్రతిబింబిస్తోంది. ఈ ఒప్పందం వల్ల మన రైతులు, యు వత, మహిళలు, ఎంఎస్‌ఎంఇలు, చేతివృత్తులవారు, స్టార్టప్‌లు, విద్యా ర్థులు, ఆవిష్కర్తలకు ఎంతో మేలు చేకూరుతుంది. ఇది అభివృద్ధికి కొత్త మా ర్గాలను తెరుస్తుంది. సరికొత్త అవకాశాలను సృష్టిస్తుంది. వివిధ రం గాల్లో మన సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తుంది. న్యూజి లాండ్ పెట్టనున్న 20 బిలియన్ డాలర్ల (రూ.1.6 లక్షల కోట్లు) పెట్టుబడితో మన వ్యవసాయం, తయారీ, టెక్నాలజీ రంగాలకు మేలు జరుగుతుంది. ఇది ఇరుదేశాలకు మరింత సుసంప న్నమైన, చైతన్య వంతమైన భవిష్యత్‌కు మార్గాన్ని సుగమం చేస్తుంది' అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

## సంక్షేమానికి బెంచ్ మార్క్ తెలంగాణ

### ఎస్సీల అభివృద్ధికి 31,763 కోట్లు ఖర్చు

### సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** సంక్షేమంలో తెలంగాణ ఒక బెంచ్ మార్క్‌ను నెలకొల్పిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, విద్యా పథకాలపై రూ.31,763 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ చండీగఢ్‌లో నిర్వహించిన చింతన్ శివిర్ 2026లో భాగంగా సోమవారం అందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమానత్వం, సాధికారత, గౌరవంపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్య, స్కాలర్‌షిప్‌లలో గణనీయమైన పెట్టుబడులు పెట్టిందన్నారు. ఇక సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం పెంపొందించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. అలాగే సంక్షేమ పథకాల పంపిణీలో పారదర్శకత, వేగాన్ని మెరుగుపరచడానికి డిజిటల్ పాలన సాధనాలను విస్తృతంగా వినియోగించాలని సూచించారు. సామాజిక పరివర్తనకు విద్య ఒక కీలక చోదక శక్తి అని అభివర్ణించారు. ఈ నేపథ్యంలోనే పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.574.74 కోట్లు ఖర్చు చేసిందని, దీనివల్ల 3.39 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందారని చెప్పారు. అంతేకాకుండా ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.66.31 కోట్లు ఖర్చు చేసిందని, తద్వారా 73,666 మంది విద్యార్థులు లబ్ధి పొందారని వివరించారు. విదేశీ విద్యా నిధి పథకం కింద విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 564 మంది విద్యార్థులకు మద్దతు ఇవ్వడానికి రూ.103.49 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. అదనంగా తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్స్‌లో సంక్షేమ యువతకు వివిధ ప్రవేశ పరీక్షల్లో నాణ్యమైన శిక్షణ, ఇతర సదుపాయల నిమిత్తం రూ.24.53 కోట్లు ఖర్చు చేయడ జరిగిందని వెల్లడించారు. దీని ద్వారా 2,426 మంది అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌తో సహా పోటీ పరీక్షలకు కోచింగ్ పొందేందుకు వీలు కలిగిందని తెలిపారు.

## రాష్ట్రంలో పంటలన్నీ కొనుగోలు చేయాలని తీర్మానం

### బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గం సమావేశంలో కెసిఆర్ కీలక తీర్మానం

### అన్ని స్థాయికమిటీలు రద్దు, వెంటనే సభ్యత్వ నమోదు ప్రారంభం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 27:** బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ రాష్ట్ర స్థాయి కమిటీ మినహా అన్ని కమిటీలను రద్దు చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు.త్వరలోనే అన్ని స్థాయిల కమిటీలను నియమించాలని కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. కొత్త కమిటీలకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ బాధ్యతలను కేటీఆర్‌కు అప్పగించారు. అలాగే బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కేసీఆర్ సూచించారు. బుక్ మీదనే కాకుండా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సభ్యత్వాలు నమోదు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పండిన పంటలన్నీ కొనుగోలు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ తీర్మానం చేసింది. ఇప్పుడున్న స్థానాల్లో మహిళా రిజర్వేషన్లు తక్షణమే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. పండిన పంటలు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసింది. పంటల కొనుగోళ్లపై బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రభుత్వాన్ని నిలదీయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. రైతులకు పూర్తి అండగా నిలవాలని చెప్పారు. సభ్యత్వం కోసం ప్రతి జిల్లాకు ఒక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడికి ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు ఇవ్వాలని నిర్ణయించారు.

# భారీగా పతనం కానున్న పంట దిగుబడుల ధరలు

### ఎంఎస్‌పికి చట్టబద్ధతతోనే రైతులకు మద్దతు ధర

### ఒప్పందం అంశాన్ని రాష్ట్రాలతో చర్చించని కేంద్రం

### ఇది సహకార సమాఖ్య వ్యవస్థకు పూర్తి విరుద్ధం

### రాష్ట్రానికి ఎరువుల సరఫరా పైనా స్పష్టత ఇవ్వని కేంద్రం

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ప్రతిపాదిత అమెరికాతో వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రానున్న ఖరీఫ్ సీజన్‌కు ముందు దేశవ్యాప్తంగా రైతుల్లో తీవ్ర అనిశ్చితి నెలకొందని, మార్కెట్ పరిస్థితులు మారి పోతాయనే భయం పెరిగిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయం దేశంలో సుమారు 45 శాతం ప్రజలకు ఉపాధి కల్పించే కీలకరంగమని, నిర్ణయాలను అత్యంత జాగ్రత్తగా తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి హితవు చెప్పారు. అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం కారణంగా ఏర్పడిన అనిశ్చితితో రైతు ఏ పంట వేయాలి, ఎంత విస్తీర్ణంలో సాగు చేయాలి అనే విషయాల్లో కేంద్రం నుండి మార్గదర్శకాలు లేకపోవడం శోచనీయమన్నారు. దీంతో రాష్ట్రాలు సందిగ్ధంలో పడిపోయాయన్నారు. అమెరికాతో ట్రేడ్ ఒప్పందం విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్రం ఎలాంటి సంప్రదింపులు జరపకపోవడం సహకార సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమని స్పష్టం చేశారు. రాష్ట్రాలు తమ పంటల ప్రణాళికను సక్రమంగా రూపొందించలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా రైతులు భారీ సబ్సిడీలు పొందుతుండగా, భారత రైతులు చిన్న స్థాయి, అధిక ఖర్చులతో సాగు చేస్తున్న పరిస్థితిలో తాజా వాణిజ్య ఒప్పందం సమాన పోటీని కల్పించలేదని స్పష్టం చేశారు. ఈ విషయమై సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అమెరికాతో ఒప్పందానికి సంబంధించి బయటికి వస్తున్న విషయాల ప్రభావం ఇప్పటికే మార్కెట్‌లో కనిపించడం ప్రారంభమైందని, మొక్కజొన్న ధరలు సుమారు 30 శాతం వరకు పడిపోవడం, సోయాబీన్ , పత్తి ధరలు 20 శాతం వరకు తగ్గడం వంటి పరిణామాలు రైతులకు ముందస్తు హెచ్చరికగా నిలుస్తున్నాయన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తే అమెరికా నుంచి డిడిజిఎస్, సోయా ఆయిల్ దిగుమతులు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో దేశీయంగా సోయాబీన్ డిమాండ్ తగ్గిపోవడం, మొక్కజొన్న వినియోగం పడిపోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ పరిణామాలు ముఖ్యంగా తెలంగాణలో మొక్కజొన్న, నూనెగింజల సాగుపై ఆధారపడిన రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తాయని స్పష్టం చేశారు. ఇప్పటికే ఎంఎస్‌పి వ్యవస్థ రైతులకు పూర్తిస్థాయి భరోసా ఇవ్వలేకపోతోందని కేంద్రంపై విమర్శలు వినిపిస్తున్నాయని చెప్పారు. ఎంఎస్‌పి ప్రకటించిన పంటలను కొనుగోలు చేయడంలో కేంద్రం విఫలమవుతోందని మంత్రి తుమ్మల దుయ్యబట్టారు. అయితే రైతు ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తున్న తెలంగాణ ప్రజా ప్రభుత్వం సోయాబీన్, శనగ తదితర పంట దిగుబడులను కేంద్ర ప్రభుత్వ పరిమితికి మించి కొనుగోలు చేయడంతోపాటు మొక్కజొన్న, జొన్న వంటి పంటలను కూడా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఎంఎస్‌పి ధరకు కొనుగోలు చేస్తోందని, దీంతో ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వంపై రూ.3000 నుండి రూ.5000 కోట్ల అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు.

అమెరికాతో వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ఎంఎస్‌పికి చట్టబద్ధమైన రక్షణ ఉన్నదా?లేదా? వంటి విషయాలపై కేంద్రం ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్‌కు అత్యంత కీలకమైనఎరువుల సరఫరా విషయంలో కూడా కేంద్రం స్పష్టత లేకపోవడం మరో ప్రధాన సమస్యగా పరిణమించిందని మంత్రి తుమ్మల తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం కేటాయింపులు ప్రకటించి చేతులు దులుపుకుంటోందని, ఎప్పుడు, ఎంత ఎరువు అందుతుందో స్పష్టత ఇవ్వకపోవడంతో ఏప్రిల్‌కు కేటాయించిన ఎరువులు ఇంకా రాష్ట్రానికి చేరలేదని తెలిపారు.

ఎరువుల సరఫరాలో అనిశ్చితి ప్రభావం ఆహార ఉత్పత్తిపై ప్రత్యక్షంగా పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా రైతులకు నష్టం కలిగించే యూఎస్ వాణిజ్య ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలని, ఎంఎస్‌పికి చట్టబద్ధమైన రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి ప్రయోజనాలను కాపాడేందుకు ముందుంటుందని ప్రకటించారు. "రైతు బలహీనపడే విధానం ఏదైనా మేము అంగీకరించం" అని కేంద్ర ప్రభుత్వానికి స్పష్టం చేశారు. కాగా.. భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. రైతులకు అవసరమైన టార్పలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు.

## నటి రియాచక్రవర్తికి ముంబయి కోర్టులో ఊరట



నటి రియాచక్రవరి

**ముంబయి, ఏప్రిల్ 27:** నటి రియా చక్రవర్తి, ఆమె సోదరుడు షోవిక్, తల్లి సంధ్యకు బ్యాంక్ ఖాతాలను డీఫ్రీజ్ చేయాలని ముంబయిలోని ప్రత్యేక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2020లో నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణం తర్వాత నమోదైన డ్రగ్స్ కేసులో భాగంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) వారి ఖాతాలను స్తంభింపజేసిన విషయం తెలిసిందే. గతంలో కొన్ని ఖాతాలపై నిషేధం తొలగించినప్పటికీ, ఐసీఐసీఐ, యాక్సిస్, కోటక్ బ్యాంకుల్లోని మరికొన్ని ఖాతాలను కూడా విడుదల చేయాలని రియా కుటుంబం తాజాగా పిటిషన్ దాఖలు చేసింది. ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 68ఎఫ్ ప్రకారం ఎన్‌సీబీ సరైన నిబంధనలు పాటించలేదని, కాబట్టి ఖాతాలను స్తంభింపజేయడం చట్టవిరుద్ధమని వారి తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలపై ఎన్‌సీబీ తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. రియా ఒక డ్రగ్ సిండికేట్‌లో చురుకైన సభ్యురాలని, అందుకే అధికారి ఖాతాలను ఫ్రీజ్ చేశారని తెలిపారు. అయితే, ఇరుపక్షాల వాదనలు విన్న ప్రత్యేక న్యాయమూర్తి యు.సి.దేశ్‌ముఖ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 68ఎఫ్(2) ప్రకారం ఏదైనా ఆస్తిని లేదా ఖాతాను ఫ్రీజ్ చేసిన 30 రోజుల్లోగా కాంపిటెంట్ అథారిటీ నుంచి నిర్ధారణ ఉత్తర్వులు పొందాలని, కానీ ఈ విషయంలో ఎన్‌సీబీ ఆ నిబంధనను పాటించలేదని స్పష్టం చేశారు. ఎన్‌సీబీ ఈ వైఫల్యాన్ని అంగీకరించినందున, ఖాతాలను డీఫ్రీజ్ చేయాలన్న అభ్యర్థనను అనుమతిస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

## క్షేత్రస్థాయి సవాళ్లను అధిగమించాలి

### విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఫైర్ డైరెక్టర్ శిఖాగోయాల్

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించితే ప్రభుత్వ కార్యకలాపాలలో పారదర్శకతను జవాబుదారీ తనం పెంపొందంచేందుకు వీలవుతోందని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఫైర్ డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. సోమవారం బిఆర్‌కెభవన్‌లో అకౌంట్స్, ఆడిట్ పెన్షన్, జిపిఎఫ్ అంశంపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఆర్థిక నిబంధ నలలో వచ్చిన తాజా మార్పులు, అనుసరించా ల్సిన విధాన పరమైన అంశాలపై స్పష్టతనిచ్చారు. ఈ వర్క్‌షాప్ వివిధ శాఖల మధ్య సమన్వయం మరియు సామర్థ్య పెంపుదలకు ఒక ముఖ్యమైన వేదికగా నిలిచింది. తెలంగాణలోని అన్ని విభాగాలలో సమర్థవంతమైన ఆర్థిక పాలన, పారదర్శకత, పటిష్టమైన ఆడిట్ యంత్రాంగాన్ని నిర్ధారించడంలో ప్రభుత్వ నిబద్ధతను ఇది పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందాపండిట్, మాధవి, నరేష్, అభయ్ సోనార్కర్, ఎఆర్ శ్రీనివాస్, అభిషేక్ మహంతి, బాల్వమి, విక్రమ్‌సింగ్ మాన్ తదిత రులు పాల్గొని జిపిఎఫ్ నిర్వహణ, పెన్షన్, ఆడిట్ క్రమశిక్షణ, ఆడిట్ నిబంధనలు ఆర్థిక క్రమశిక్షణపై చర్చించారు.

## నటుడు, టివికె చీఫ్ విజయ్‌కి హైకోర్టులో ఊరట



**చెన్నై, ఏప్రిల్ 21:** తమిళగ వెట్రి కళగం పార్టీ చీఫ్ విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో ఊరట లభించింది. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం ఆయన దాఖలు చేసిన నామినేషన్ అఫిడవిట్‌లోని ఆర్థిక అసమగ్ర వివరాలిచ్చారని. విచారణ జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. చెన్నైకి చెందిన ఎంపీ వెంకటేశ్ అనే వ్యక్తి తన పిటిషన్‌లో పెరంబూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న విజయ్ తన ఫారం 26 అఫిడవిట్‌లో ఆర్థిక వివరాలను తప్పుగా చూపారని, కీలక సమాచారందాచిపెట్టారని ఆరోపించారు. ముఖ్యంగా కుటుంబ సభ్యులకు, అనుబంధ సంస్థలకు కోట్ల రూపాయల విలువైన రుణాలు ఇచ్చినట్లు చూపిన విజయ్, అదే సమయంలో తనకు ఎలాంటి అప్పులు లేవని ప్రకటించడంపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

తన భార్యకు రూ.12 కోట్లకు పైగా రుణం ఇచ్చినట్లు పేర్కొనడం వంటి లావాదేవీలు అనుమానాస్పదంగా ఉన్నాయని తెలిపారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 సెక్షన్ 33ఎ ప్రకారం అభ్యర్థులు పూర్తి, పారదర్శకమైన సమాచారం ఇవ్వాలని, కానీ విజయ్ సమర్పించిన వివరాలు ఓటరుకు సమాచారం తెలుసుకునే హక్కును కాలరాసేలా ఉన్నాయని పిటిషనర్ వాదించారు. ఈ వ్యవహారంపై ఆదాయపు పన్ను శాఖ, కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఎన్నికల సంఘంతో ప్రాథమిక విచారణ జరిపించాలని కోరారు. ఈ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి సంజయ్ వి. గంగాపూర్వాలా ధర్మాధికారి, జస్టిస్ అరుళ్ మురుగన్‌తో కూడిన ధర్మాసనం, పిటిషన్‌ను విచారణకు స్వీకరించకుండానే కొట్టివేసింది.

## బ్యాంకు ఉద్యోగుల వేతన సవరణ వేగవంతం

### యేడాదిలోగా తుది నిర్ణయం తీవాలన్న ఆర్థిక మంత్రిత్వ శాఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు, అధికారుల వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని బ్యాంకులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. 13వ ద్వైపాక్షి క వేతన ఒప్పందం కోసం చర్చలను తక్షణమే ప్రారంభించి వచ్చే 12 నెలల్లోగా తుది నిర్ణయం తీసుకోవాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచించింది. వేతన సవరణ 2027 నవంబరు 1 నుంచి అమల్లోకి రావాల్సి ఉండగా, ఈసారి ఎలాంటి జాప్యం లేకుండా గడువు తేదీ నుంచే కొత్త వేతనాలు వర్తించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. చర్చలతో పాటు, సంబంధిత నియంత్రణ మార్పులను కూడా షెడ్యూల్ తేదీ కంటే ముందే పూర్తి చేయాలని ఆదేశించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా సంస్థలతో సహా ఇతర ఆర్థిక సంస్థలు తమ ఉద్యోగుల వేతన సవరణను ప్రతి ఐదేళ్లకోసారి చేపడతాయి. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) వివిధ బ్యాంకు ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి పరస్పర అంగీకారంతో కూడిన వేతన ప్యాకేజీని రూపొందించనుంది. కాగా 12వ వేతన సవరణలో 17 శాతం పెంపు లభించగా, 13వ సవరణలో 15 నుండి 20 శాతం వరకు పెంపు ఉండవచ్చని అంచనా. బ్యాంకు ఉద్యోగుల జీతాలు, కరువు భత్యం (డిఏ), పెన్షన్, ఇతర అలవెన్సుల సవరించే లక్ష్యంతో ఈ చర్చల్లో నిర్ణయం తీసుకోనున్నాయి. బ్యాంకులు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు లాభాలు, మెరుగైన ఆస్తి నాణ్యత కలిగి ఉండే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా ఈ వేతన సవరణ సానుకూలంగా ఉండవచ్చని ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ కార్యదర్శి ఒకరు తెలిపారు.

## ఎస్వీ అన్నప్రసాదానికి రూ.20 లక్షలు విరాళం

**తిరుమల, ఏప్రిల్ 27 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు కుటుంబం రూ.20లక్షలు విరాళమిచ్చారు. ఆయన కుమార్తె ఆముక్త, కుమారుడు అవనీష్ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు ఒక్కొక్కరు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. దాతలు తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ఉన్నారు.


తెలంగాణ ప్రభుత్వం

**క్యాతనపల్లి మునిసిపాలిటీ కార్యాలయం-మంచిర్యాల జిల్లా**

**కొటేషన్ ప్రకటన**

లేఖ నం. E1/01/కొటేషన్/Kytply/Mplty/2026-27, తేది: 27.04.2026

విషయము:- క్యాతనపల్లి పురపాలక సంఘం-ఇంజనీరింగ్ సెక్షన్-క్యాతనపల్లి మునిసిపాలిటీలో డ్రై రిసోర్స్ సేకరణ కేంద్రం (DRCC)కు యంత్రాలు మరియు సామగ్రి యొక్క సేకరణ. మెషినరీ సేకరణకు కొటేషన్‌లు పిలుపు నిమిత్తం ఏదైనా తెలుగు దిన వార్తాపత్రికలో ప్రచురణకు అభ్యర్థన-గురించి

క్యాతనపల్లి మునిసిపాలిటీలో SBM 2.0 క్రింద మునిసిపల్ ఘన వ్యర్థ పదార్థాల ప్రోసెసింగ్‌కు అవసరమైన మెషినరీ మరియు సామగ్రి యొక్క సేకరణకు అతి తక్కువ రేట్స్ ఆఫర్‌ను ఉత్పత్తిదారులు/అధీకృత డీలర్‌లు/ఏజెన్సీల నుండి ఇందుమూలముగా అభ్యర్థిస్తూ కోరడమైనది.

| క్ర.సం. | యంత్ర/సామగ్రి | ప్రత్యేక వివరణ |
|---|---|---|
| 1 | వేబ్రిడ్జి | 10TPD-10 టన్నుల ఎలక్ట్రానిక్ పిట్‌లెస్ టైప్ |
| 2 | సార్టింగ్ కన్వేయర్ బెల్ట్ | 10TPD-మొత్తం సెటప్‌తో 1440 RPM, 1200 mm వెడల్పు బెల్ట్, 5 HP-ఫ్లాట్ రోలర్ టైప్ బెల్ట్ కన్వేయర్ |
| 3 | బాలింగ్ మెషీన్ | 10 TPD-540x680x2600 mm-25-టన్నులు (జాక్ ఫోర్స్) వెర్టికల్ సింగిల్ సిలెండర్ డబుల్ ఛాంబర్, సుమారు మెషీన్ బరువు 850 Kg |
| 4 | ష్రెడ్డర్ | 10TPD-సింగిల్ షాఫ్ట్-10 టన్నులు/7.5 HP |
| 5 | ఎయిర్ బ్లోయర్ | 10TPD-1500 CFM-15 HP |
| 6 | ట్రామ్మెల్ | 16-40 mm |
| 7 | విండ్రో టర్నర్ | అవసరమైనట్లుగా |

దిగువ సంతకందారునికి 29.04.2026 తేదీన సా.5.00 గం. లేదా ముందు సీల్డ్ కొటేషన్‌లు దాఖలు చేయవలెను. తదుపరి ప్రత్యేక వివరణలపై సమాచారానికి దయచేసి 9989272060, 9121283460 సంప్రదించండి.

సం/- కమిషనర్, క్యాతనపల్లి మునిసిపాలిటీ, మంచిర్యాల జిల్లా

DIPR.No.1503-PP/CL/Advt/1/2026-27, తేది: 27.04.2026

వార్త


మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కానీ మంచివారుగా మారటం అరుదు.

న- స్వీడేన్ బర్గ్

# కృత్రిమ కొరత 'పాపం'ఎవరిది!

తెలుగు రాష్ట్రాలిప్పుడు పెట్రోలు, డీజిల్ కొరతతో విలవిల్లాడుతున్నాయి. ఇదంతా కృత్రిమకొరత కావచ్చునని అంచనా ఉన్నా దీని వెనుక పాపం ఎవరిదో ఇంకా స్పష్టంగా కనిపెట్టలేకపోతున్నారు. వీటన్నిటినీ ఇంధన కష్టాలుగా ఎక్కడికక్కడే పెట్రోలు బంకుల్లో జనం తన వాహనాలతో బారులు తీరి ఉన్నారు. వాహనాలతోపాటు ఖాళీ డబ్బాలతో కూడా బంక్‌లకొచ్చేస్తున్నారు. కనుచూపు మేరలో పెట్రోలు, డీజిల్ కొరత వచ్చేస్తోందన్న ముందస్తు భయంతో మళ్లీ ఇప్పట్లో పెట్రోలు, డీజిల్‌ను చూడడం కష్టమేనని భావించి వాటి కోసం ఎగబడుతున్నారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు సగం పెట్రోలు బంకులు ఖాళీ అయ్యాయి. కొత్తగా సరకు వచ్చేదారిలేక, డిపోల నుండి తమ ట్యాంకర్లతో సరుకు తెచ్చుకునే ఆశ లేక బంకులు మూతపడ్డాయి. నిజానికి ఒక్కసారిగా ఉన్నట్టుండి వాహనదారులు దాదాపు అన్ని పెట్రోలు బంకుల్లో లైన్ కట్టడం విచిత్రంగా ఉంది. రాష్ట్రమంతటా అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలు, గామశివార్లు, రహదారుల్లోని పెట్రోలు బంక్‌లో ఒకే తీరులో జనం ఎగబడుతున్నారంటే సమస్య ఎక్కడ పుట్టిందో, అసలు సమస్య వాస్తవమో కాదో అర్థం కావడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపే బంకులపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా కృత్రిమ కొరతకు మూలం ఎక్కడో నిర్ణయించుకోలేకపోతున్నారు. చాలా బంకులు 'నో స్టాక్' బోర్డులు ఎందుకు పెడుతున్నాయో పరిశీలనలోనే ఉన్నాయి. నిజంగానే సరుకు లేదా? లేక ఉండికూడా కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నంలో స్టాకు దాచేస్తున్నాయా తెలియక కొన్నిసర్వే బృందాలను తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అలెర్ట్ చేశాయి. సమృద్ధిగా నిల్వలు ఉన్నాయని, సరుకు లేదన్న వదంతులు నమ్మి పెట్రోలు బంకుల్ని చుట్టుముట్టాల్సిన అవసరం లేదని తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ స్పష్టం చేస్తోంది. వాస్తవానికి చెప్పాలంటే పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో హార్మూజ్ జలసంధి వద్ద ఆగిపోయిన గ్యాస్ పెట్రోలు, డీజిల్ నౌకలను భారత్‌కు రప్పించడంలో కేంద్ర ప్రభుత్వం కృతకృత్యురాలైంది. అన్నీ సర్దుకున్నాయనుకున్న తరుణంలో పెట్రోల్ బంక్‌ల వద్ద కలకలం, దీని వెనుక పాపం ఎవరిదో అంచనాలకు అందడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లోఅన్ని పెట్రోలు బంకుల వద్ద వాహనాల రద్దీ, కృత్రిమ కొరత, నోస్టాక్ బోర్డులు వంటివి కనబడుతున్నాయి. తెలంగాణలో వరంగల్, నల్గొండ, ఖమ్మం, జిల్లాలో ఇలాంటి పరిస్థితులు కనబడుతున్నాయి. తీవ్రంగా డీజిల్ కొరత ఉన్నట్లుంది. రైతుల ఆందోళన అంతాఇంతాకాదు. యాసంగి సీజన్‌లో వరికోతలు ముమ్మరంగా కొనసాగుతున్న పరిస్థితుల్లో వరికోత యంత్రాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ కారణం చేత కొన్ని చోట్ల కోతలు ఆలస్యమవుతున్నాయి. కొన్ని రోజుల కిందట హైదరాబాద్ నగరంలోని పెట్రోలు బంకులన్నీ 2,3 రోజులు ఇదే రకం అనుభవాన్ని నమోదు చేసుకున్నాయి. అధికారులు, జోక్యం చేసుకున్నాక సజావుగా పెట్రోలు, డీజిల్ సంపూర్ణంగా అందే పరిస్థితులు ఏర్పడ్డాయి. అలామూడు రోజుల పాటు నగర పెట్రోలు బంకుల వద్ద జనజీవనం స్తంభించింది. ఇప్పుడు మళ్లీ ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాల్లోనూ అదే దృశ్యాలు , వాహనదారులు క్యూకట్టి కనిపిస్తున్నారు. యుద్ధం తొలినాళ్లలో కమర్షియల్ గ్యాస్ విక్రయంపై కేంద్రప్రభుత్వ నిర్ణయాలు చిన్నచిన్న తినుబండార వ్యాపారుల్ని, వాటి వినియోగదారుల్ని కలవరపరిచింది. కొంత మంది ఆహార పదార్థాల విక్రయం ద్వారా జీవనోపాధి పొందే వారు వ్యాపారాలు ఎత్తేశారు. కొందరైతే తినుబండారాల రేట్లు పెంచేసి, వాటి సైజుల తగ్గించి వ్యాపారం కానిచ్చేస్తున్నారు. పెరిగిన రేట్లు, తగ్గిన తినుబండారాల సైజుల గురించి వినియోగదారులుమారు మాట్లాడకుండా 'దొరికిందే చాల'ని సంతృప్తిపడుతున్నారు. దానికి తోడు కొత్తగా పెట్రోలు, డీజిల్ కృత్రిమ కొరత. తెలుగు రాష్ట్రాలన్నిటా నిన్న, మొన్న నేడు కూడా ఇవే దృశ్యాలు కనపడుతున్నాయంటే అత్యున్నత స్థాయి సమావేశాలు వాటిని అరికట్టలేకపోయాయి. అదే పరిస్థితి ఇప్పుడు హైదరాబాద్‌లోనూ ప్రత్యక్షమౌతున్నది. డీజిల్‌కు కొరత ఏర్పడ్తుందనే భయాలు అవసరం లేదనిపాలకులు విజ్ఞప్తి చేసినా పరిస్థితి కంట్రోలు కావడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ రోజుల్లో 6,330కిలో లీటర్లపెట్రోల్, 9048 కిలో లీటర్ల డీజిల్ అమ్మకాలు జరుగుతాయి. తెలంగాణలో రోజుకి 9574 కి.లీ పెట్రోల్, 14,457 కిలో లీటర్ల డీజిల్ విక్రయిస్తుండగా గత రెండు రోజుల్లో విక్రయాలు పెరిగాయి. వీటి కొరత అధికంగా ఉందని తలచి వినియోగదారులు తీవ్ర ఆందోళనలకు గురయ్యారు. తిరుమల కొండపైకి వాహనాలపై వెళ్లిన భక్తులైతే పెట్రోలు, డీజిల్ దొరక్క తీవ్ర ఇబ్బందుల నెదుర్కొన్నారు. ఆక్వా రైతులు తమ చెరువుల్లో కృత్రిమ ఆక్సిజన్ సృష్టించడానికి డీజిల్ అవసరం. ట్రాక్టర్లు, ట్రక్కులుకూడా పెట్రోలు, డీజిల్ కోసం అల్లాడుతున్నాయి. అరకొర సరఫరా వారిని ఆందోళనలో ముంచెత్తుతోంది. పెట్రోలు, డీజిల్ ధరలు పెరుగలేదు. దానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనందున ఆయిల్ కంపెనీల యాజమాన్యం 'కృత్రిమ కొరత' సృష్టించిందా!అన్న అనుమానాలతో స్థానిక ప్రభుత్వాలు ఆ దిశగా అన్వేషిస్తున్నాయి. కానీ ఇతమిత్థంగా కారణాలపై స్పష్టత రాలేదు. ఈలోగా పెట్రోలు బంకుల్లో నిల్వలు సమకూర్చుకునే విషయంలో ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుంటే తప్ప సరఫరాలో అంతరాయం తగ్గదు. అయిందేదో అయింది. ఇక సమృద్ధిగానే నిల్వలు ఉంటాయన్న'భరోసా' కల్పిస్తే తప్ప పెట్రోలు బంకుల్లో 'క్యూ'లు ఆగవు.

అదృష్టం తనంత తానుగా వచ్చి తలుపు తడుతుందని అందరూ చెప్తుంటారు. నమ్మవద్దు అది అవకాశం రూపంలో ఉంటుంది. దాన్ని వెంటాడు. సొంతం చేసుకో.



సెనెకా

ఇతరులలో మంచిని చూడలేకపోవడం మనలో మంచితనం లేకపోవడాన్నే సూచిస్తుంది.



సోక్రటీస్

# ప్రజావాక్కు



### ప్రత్యేక సమావేశాలెందుకు?

చంద్రబాబు మహిళా బిల్లుకోసం అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఎందుకండీ. పార్లమెంటులో ప్రత్యేకంగా సమావేశం పెడితే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆటోమేటిక్‌గా పాస్ అవుతుంది. మొన్న డీలిమిటేషన్ బిల్లు కలిపి పెట్టినందున ఇండియా కూటమి వ్యతిరేకించింది. అయితే మీరు మహిళా బిల్లు కోసం శాసన సభ్యులు తమ నియోజక వర్గాలలో ప్రచారం చెయ్యాలని, ప్రత్యేకంగా శాసనసభ ఏర్పాటు చెయ్యాలని ప్రకటించారు. మీకెవరు సలహాలు ఇస్తున్నారో గాని, అవి ప్రజాఆమోదం పొందవు. ఎందుకంటే ఔషధమొక్కలు పెంచుతామని ప్రభుత్వ భూములను తక్కువ లీజుకు తీసుకొని, అందులో మామిడి, జామ ,బొప్పాయి లాంటి వ్యాపార పంటలు పండిస్తూ, ప్రకృతి వైద్యం అంటూ కరకట్ట మీద ఫైవ్‌స్టార్ హోటల్ లాంటిది కట్టి మోసం చేస్తున్న వారినిసలహా దారునిగా నియమించారు. ఆయన సంగతి ప్రజలకు తెలుసు. మరి మీకెందుకు తెలియ లేదో.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఉపాధి హామీ కల్పించాలి

పాలకుర్తి నుండి హనుమకొండ వచ్చే దారి వెంట రోడ్ల పైననే వడ్లు, మక్కలు విస్తారంగా పోసినారు. దాని వల్ల వాహన దారులు ప్రమాదాలకు గురికావడం పరిపాటిగా మారింది. మరి కేంద్రంలోని ఏ పార్టీ అధికారంలో ఉన్నా రైతునురాజును చేయడమే మాసంకల్పం అంటారు కదా. మరి రైతుకేంద్రంగానిర్ణయాలు చేస్తున్నారా లేదా? ఉపాధి హామీలో ఆస్తులసృష్టి గురించి స్పీచ్‌లు ఇచ్చే నాయకులు రైతులకు కల్లాలను ఎందుకు నిర్మించలేకపోతున్నారు. అసలు ఈకేంద్రీకృత ఉపాధిహామీ విధానం తొలగకుండా వికసిత భారతం సాధ్యం అవుతుందా? గ్రామీణా ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ దిశగా తెలంగాణలో అడుగులు పడాలి.

- భారత అవినాష్, జనగామ

### దివ్యాంగులను మినహాయించాలి

ఒకరి సహాయం లేనిదే దివ్యాంగులు ఏ పని చేయలేరు. అంధులు రాయడం కష్టంఅవుతుంది. శారీరక దివ్యాంగులకు చాలా ఇబ్బందికరంగా ఉంటుంది . కనుక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జనగణనలో జనాభా లెక్కల సేకరణలో వికలాంగులను మినహాయిస్తూప్రభుత్వం జిల్లా కలెక్టర్‌కి, వివిధ శాఖల ఉన్నత అధికారులకు విద్యాసంస్థల ప్రిన్సిపాల్‌లకు జనాభా లెక్కల సేకరణలో వికలాంగుల మినహాయిస్తూ ఆదేశాలు జారీ చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### డ్రైవర్ల భద్రత

ఈమధ్య ఆర్టీసీ డ్రైవర్లపై అకారణ దాడులు పెరుగుతున్నాయి. ప్రతిరోజూ ఎంతో మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే డ్రైవర్లు తమ విధులను నిబద్ధతతో నిర్వహిస్తున్నారు. అలాంటి వారిపై దాడులు చేయడం సహించరాని విషయం. బైక్‌లపై ప్రయాణించే కొందరు, సైడ్ ఇవ్వలేదని చిన్న విషయాన్ని పెద్ద గొడవగా మార్చి డ్రైవర్లతో వాగ్వాదానికి దిగి దాడులు చేస్తున్నారు. డ్రైవర్లు నిబంధనల ప్రకారంజాగ్రత్తగా వాహనంనడిపినా, అనవసరంగా వివాదాలు సృష్టించడం బాధాకరం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, పరస్పరం గౌరవంతో ప్రవర్తించాలి. డ్రైవర్ల భద్రత కోసం అన్నిబస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. పోలీసుల పర్యవేక్షణను పెంచి, అత్యవసర సహాయం త్వరగా అందేలా చూడాలి. ప్రయాణికులు కూడా డ్రైవర్లకు మద్దతుగా నిలవాలి. అప్పుడే డ్రైవర్లు నిర్భయంగా విధులను నిర్వహిస్తారు.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### విద్యాశాఖ పనితీరు అభినందనీయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ పనితీరు అభినందనీయం. ఎలిమెంటరీను హైస్కూల్‌నుండి వేరు చేయడం, ఇంటర్మీడియట్ విద్యనుహైస్కూల్ ప్లస్‌గామార్చడం ఆహ్వానించ దగ్గ మార్పు. నూతనంగా విద్యాశాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వారు ఉపాధ్యాయ సంఘ నాయకులతో చర్చలు జరిపి అప్రెంటిస్ టీచర్లను నోషనల్ ఇంక్రిమెంట్స్ విషయమై ఏ టీచర్అయినా వ్యక్తిగతంగా అభ్యర్థిస్తే పరిశీలిస్తామని చెప్పడం చాలా సంతోషించ వలసిన విషయం. సీనియర్లకు జూనియర్ల కంటే తక్కువ వేతనం రావడానికి ప్రధాన కారణం అన్వేషించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు ఈనేపథ్యంలో అందరు అప్రెంటిస్ టీచర్లకు రెండేళ్ల అప్రెంటిస్ కాలం దిగ్విజయంగా పూర్తి చేసిన నేపథ్యంలో ఇవ్వబడిన రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు వారు ఉద్యోగంలో జాయిన్ అయిన తేదీ నుండి అమలు చేయాలి.

- వీరగంట భాస్కర్ రావు , విజయనగరం జిల్లా

### గ్రామాల్లో అన్ని సౌకర్యాలుండాలి

గ్రామాలలో ప్రతి రంగానికి చెందిన పాలకవర్గం అధికారులు, కిందిస్థాయి సిబ్బంది విపత్కర,సాధారణ పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండడమేగాకవారికి కావలసిన సౌకర్యాలు అందుబాటులోఉంటేనే గ్రామాలుఅభివృద్ధి చెందుతూ ప్రజలు మెరుగైన జీవితం గడపడానికి అవకాశాలు ఉంటాయి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ట్రంప్‌పై దాడి ప్రజాగ్రహానికి నిదర్శనమా?

**ఇటీవల ట్రంప్‌పై జరిగిన దాడి పట్ల అతిగా స్పందించవల సిన అవసరం లేదు. ఈ సంఘటన ట్రంప్‌పై ప్రతీకారం తో జరిగిందా? లేక అమెరికా ప్రజల్లో సానుభూతి కోసం జరిపించుకున్న నాటకమా? అనే విషయం తేలాలి. ఇప్పటికే అధ్యక్షుడి తీరుతో అమెరికా ప్రజలు విసుగెత్తిపోయారు. 'నో కింగ్స్' అంటూ లక్షలాది మంది ప్రజలు రోడ్లెక్కి నిర సన తెలిపారు. ఇరాన్‌పై జరుపుతున్న యుద్ధంలో ఘోర వైఫల్యం చెందిన ట్రంప్ ప్రజలను తప్పు దారి పట్టించడానికి ఈ డ్రామా ఆడినట్టు పలువురు భావిస్తున్నారు. తనపై జరిగిన దాడిని అమెరికా రాజ్యాంగంపై జరిగిన దాడిగా ట్రంప్ పేర్కొనడంవిడ్డూరం. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, ప్రజాస్వామ్య ముసుగులో నియంతృత్వం చెలాయిస్తున్న ట్రంప్‌కు ఇలాంటి వ్యాఖ్యలు చేసే నైతిక హక్కు లేదు. ఏది ఏమైనప్పటికీ ఇకనైనా భారత్ మేల్కొనాలి. అమెరికా పట్ల జాగరూకత వహించాలి. నమ్మకమైన రష్యాను భారత్ వదులుకోకూడదు.**



సుంకవల్లి సత్తిరాజు

ప్రపంచమంతా ఇంధన సంక్షోభంతో కకావికలమవుతూ, అమెరికాను తిట్టిపోసుకుంటున్న తరుణంలో వైట్‌హౌస్ వార్తలను బాహ్య ప్రపంచానికి తెలియచేసే ప్రెస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ విందు సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై కాల్పులు జరగడం, ట్రంప్‌తో పాటు ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఇతర అతిథులు తృటిలో తప్పించుకోవడం సంచలన వార్తగా మారింది. డోనాల్డ్ ట్రంప్‌పై హత్యా ప్రయత్నం జరగడం ఇదేమీ మొదటి సారికాదు. గతంలో లాస్ వెగాస్, పెన్సిల్వేనియాల్లో కూడా ట్రంప్‌పై కాల్పులు జరిగాయి. 2024లో అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్ కుడి చెవికి బుల్లెట్ గాయం తగిలినా సురక్షితంగా బయట పడిన విషయం విదితమే. శత్రు దుర్భేద్యమైన భద్రతా వలయాన్నిచేధించుకుని ఒక అతిథిలా కాలిఫోర్నియాకు చెందిన ఒక యువ ఉపాధ్యాయుడు ఆయుధాలతో ప్రవేశించడం అమెరికా భద్రతా వ్యవస్థలోని లోపాలను బహిర్గతం చేసింది. తాజాగా జరిగిన దాడిని వివిధ కోణాల్లో విశ్లేషించవలసి ఉంటుంది. ఈ దాడి వెనుక ప్రధాన ఉద్దేశ్యమేమిటి? ట్రంప్ తన చేష్టలతో, యుద్ధోన్మాదంతో ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్నాడన్న ఆగ్రహంతో ఈదాడి జరిగిందా? అమెరికా ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేస్తున్నందుకా? ఇరాన్ విషయంలో అనవసరంగా జోక్యం చేసుకుని ఇంధన కొరతను సృష్టించి ప్రపంచ దేశాలకు కంటక ప్రాయంగా మారినందుకా? ఇలాంటి ఎన్నో సందేహాలు విశ్లేషకుల ఆలోచనలకు పదును పెడుతున్నాయి. ట్రంప్‌పై జరిగిన దాడిపట్ల ఎవరూ మన స్ఫూర్తిగా తమ సానుభూతిని వ్యక్తం చేయలేదు. కొన్ని దేశాలు ఈదాడినిఖండించినా అది ఆయా దేశాల నుండి మన స్ఫూర్తిగా వెలువడిన ప్రకటనలు కావని అందరికీ తెలుసు. తనపై కాల్పులు జరిపిన వ్యక్తిని మానసిక రోగిగా ట్రంప్ పేర్కొనడం విడ్డూరం. వాస్తవంగా చెప్పాలంటే ట్రంప్ నిజమైన మానసిక రోగ గ్రస్తుడుగాను, యుద్ధోన్మాదిగాను, అహంభావి గాను అమెరికాతోపాటు యావత్ ప్రపంచం భావిస్తున్నది. అయినప్పటికీ ట్రంప్ తన పిచ్చి చేష్టలతో తమపై ఏరూపంలో విరుచుకుపడతాడోనన్న భయంతో కొన్ని దేశాలు సంయమనం పాటిస్తున్నాయి. వీసాల విషయంలోను, టారిఫ్‌ల అంశంలోను తలనొప్పిగా పరిణమించిన ట్రంప్ నిర్ణయాలు అనుచితంగా ఉన్నాయి. తన మిత్ర దేశాలను సైతం వదలకుండా చులకనగా చూసిన ట్రంప్ వైఖరి వలన అమెరికా నేడు ఏకాకిగా మారింది. భారత్‌ను ఎన్నో సార్లు ట్రంప్ అత్యంత దారుణంగా అవమానించాడు. కనీస నియమ నిబంధనలు పాటించకుండా, అక్రమ వలస దారులంటూ అమెరికాలో ఉంటున్న భారతీయులకుసంకెళ్ళు వేసి యుద్ధ విమానాల్లో భారత్‌కు పంపించి, అమర్యాదగా ప్రవర్తించాడు. అమెరికా రేడియో వ్యాఖ్యాత మైఖేల్ సావెజ్ భారత్,చైనాలను నరక కూపాలుగా, భారతీయ ఉద్యోగులను ల్యాప్ ట్యాప్‌లు ధరించిన గ్యాంగ్ స్టర్లుగా అభివర్ణిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఆ వ్యాఖ్యలను ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో రీ ట్వీట్‌చేస్తూ, తన అభిప్రాయం కూడా అదేనన్నట్టుగా అక్కసు వెళ్ళగక్కడం అభ్యంతరకరం. గర్భం దాల్చిన మహిళలు అమెరికాలో అడుగు పెట్టి, పిల్లలను కని అమెరికాలో శాశ్వతంగా తిష్టవేయడానికి ప్రయత్నిస్తున్నారని చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపణీయం. అమెరికా ఎంతగా



అవమానించినా, నిందించినా భారత ప్రభుత్వం ఇప్పటి వరకు సరైన రీతిలో స్పందించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు. అమెరికా స్థూల జాతీయోత్పత్తిలో గణనీయమైన పాత్ర వహిస్తూ, కీలకమైన రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తూ అమెరికా అభివృద్ధికి గుండెకాయలా మారిన భారతీయులను,వారి మేధస్సును విమర్శించడం అర్థరహితం, అత్యంత దుర్మార్గం. భారతీ యుల శ్రమను, నైపుణ్యాన్ని వినియోగించుకుంటూ,వారిని అవమానించడం కుసంస్కారం. ఇప్పటికే గ్రీన్ కార్డులపై భారతీయుల ఆశలు సన్నగిల్లాయి. హెచ్1బి వీసాల సంఖ్య ను 25వేలకు కుదించిన నేపథ్యంలో మూడేళ్ల పాటు హెచ్ 1బి వీసాలను కూడా నిరాకరించాలని యు.ఎస్ కాంగ్రెస్ ముందుకు మరో బిల్లు రాబోతున్నది. ఇలాంటి నిర్బంధాల మధ్య ఇక భారతీయ సాఫ్ట్‌వేర్ నిపుణుల అమెరికా ప్రవేశం అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే అమెరికాలో స్థిరప డాలని కలలు గన్న భారతీయుల ఆశలు ఆవిరైపోయాయి. చాలా మంది భారతీయులు అమెరికాలో పనిచేయడానికి విముఖత ప్రదర్శిస్తున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. అమెరికా పట్ల ప్రపంచ దేశాలకు నమ్మకం పోయింది. పాక్ తో ట్రంప్ స్నేహం భారత్‌కు తలనొప్పి తెచ్చే వ్యవహారమే. పాక్ ఉగ్రవాదుల మూక పహల్గాంలో నరమేథం సాగించిన తర్వాత భారత్ ఎంతో సాహసంతో ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేయడమే కాకుండా, ఉగ్రవాదులను క్షణాల్లో మట్టుబెట్టి శభాష్ అనిపించుకుంది. భారత్ చర్యతో బెంబేలెత్తిన పాక్ భారత్‌ను శరణుజొచ్చి, కాల్పుల విరమణకు అంగీకరింప చేసింది. అప్పుడే అమెరికా ఈ సన్నివేశంలోకి ట్రంప్ హఠాత్తుగా ప్రవేశించి తానే భారత్ పాక్‌ల మధ్య యుద్ధాన్ని నిలువరించానని, ఇరుదేశాల మధ్య అణుయుద్ధం రాకుండా ఆపగలిగానని ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతూ, నేటివరకు అనేక విషయాల్లో భారత్‌ను నొప్పిస్తూ, అవమానిస్తూ సంతృప్తి పొందుతు న్నాడు. అమెరికా తన శక్తి యుక్తులన్నీ కూడదీసుకుని అత్యంత శక్తివంతమైన క్షిపణులను ఇరాన్‌పై ప్రయోగించినా, అమెరికా ఆయుధ సంపత్తి ఇరాన్ డ్రోన్ల ముందు తునాతునకలు కావడం, ఇరాన్ క్షిపణుల దాటికి అమెరికా యుద్ధ విమానాలు విధ్వంసం కావడం అమెరికా ఆయు ధాలు కొంటున్న దేశాలను ఆలోచింప చేస్తున్నాయి. ట్రంప్ వైఖరి వలనే హార్మూజ్ జలసంధివద్ద భారత్‌తోసహా పలు దేశాల చమురు నౌకలు నిలిచిపోయాయి. ఇరాన్ నౌకాశ్ర యాలను దిగ్బంధనం చేయడంవలనే ఇరాన్ హార్మూజ్‌పై తన పట్టును మరింత బిగించింది. ఈకారణంగానే భారత్‌తో సహాపలు ప్రపంచ దేశాలు తీవ్రమైన చమురు, గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ట్రంప్ దురహంకారం ప్రపంచ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. కాల్పుల విరమణ ప్రకటించినా ట్రంప్ అందుకు కట్టు బడక పోవడంతో, ట్రంప్‌పై ఇరాన్ తన నమ్మకాన్ని కోల్పోయింది. ఒక వైపు చర్చలంటూనే మరోవైపు ఇరాన్ నౌకాశ్రయాలను దిగ్బంధనం చేయడం వలన ఇరాన్ అమెరికాతో ప్రత్యక్ష చర్చలను నిలుపుదల చేసింది. ఇరాన్ అమెరికాల మధ్య యుద్ధాన్ని ఆపగల సామర్థ్యమున్నా భారత్ మాత్రం మౌన ముద్రహించడంలో గల ఔచిత్యం అవగతం కావడం లేదు. ఇటీవల ట్రంప్‌పై జరిగిన దాడి పట్ల అతిగా స్పందించవల సిన అవసరం లేదు. ఈ సంఘటన ట్రంప్‌పై ప్రతీకారం తో జరిగిందా? లేక అమెరికా ప్రజల్లో సానుభూతి కోసం జరిపించుకున్న నాటకమా?అనే విషయం తేలాలి. ఇప్పటికే అధ్యక్షుడి తీరుతో అమెరికా ప్రజలు విసుగెత్తిపోయారు. 'నో కింగ్స్' అంటూ లక్షలాది మంది ప్రజలు రోడ్లెక్కి నిరసన తెలిపారు. ఇరాన్ పై జరుపుతున్న యుద్ధంలో ఘోర వైఫ ల్యం చెందిన ట్రంప్ ప్రజలను తప్పు దారి పట్టించడానికి ఈ డ్రామా ఆడినట్టు పలువురు భావిస్తున్నారు. తనపై జరిగిన దాడిని అమెరికా రాజ్యాంగం పై జరిగిన దాడిగా ట్రంప్ పేర్కొనడంవిడ్డూరం. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, ప్రజాస్వామ్య ముసుగులో నియంతృత్వం చెలాయిస్తున్న ట్రంప్ కు ఇలాంటి వ్యాఖ్యలు చేసే నైతిక హక్కు లేదు. ఏది ఏమైనప్పటికీ ఇకనైనా భారత్ మేల్కొనాలి. అమెరికా పట్ల జాగరూకత వహించాలి. నమ్మకమైన రష్యాను భారత్ వదులుకోకూడదు.

# నకిలీ విత్తనాలతో కుప్పకూలుతున్న రైతు!

తిప్పర్తి శ్రీనివాస్

నకిలీ విత్తనాల వ్యాపారం వ్యవసాయ రంగానికి ముప్పుగా మారింది. ముఖ్యంగా పత్తి సాగులో ఈ సమస్య మరింత తీవ్రమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ ప్రారంభానికి ముందే గ్రామాల వరకు చేరుతున్న నకిలీ పత్తి విత్తనాలు, కోట్ల రూపాయల దందాగా విస్తరించడం ఆందోళనకర విషయం. నియంత్రణ సంస్థలు, టాస్క్ ఫోర్స్ బృందాలున్నప్పటికీ, అవి కేవలం నామమాత్రంగా మారిపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పత్తిరైతులు ప్రతి సీజన్‌ను ఆశలతో ప్రారంభిస్తారు. మంచి దిగుబడి, సరైన ధరలతో తమ కుటుంబాలను ముందుకు తీసుకెళ్లాలని కలలు కంటారు. కానీ నకిలీ విత్తనాలు వారి ఆశలను ఛిద్రం చేస్తున్నాయి. ప్యాకెట్‌పై ప్రముఖ కంపెనీల పేర్లు, ఆకర్షణీయమైన లేబుళ్లు ఉండటంవల్ల రైతులు అవి నమ్మదగినవని భావిస్తారు. కానీ మొలక శాతం తక్కువగా ఉండటం, మొక్కల పెరుగుదల సరిగాలేకపోవడం, తెగుళ్లకు త్వరగా గురవడం వంటి సమస్యలు రైతులను తీవ్ర నష్టాలకు గురిచేస్తున్నాయి. ఈ సమస్యకు ప్రధాన కారణం పర్యవేక్షణ లోపం. విత్తనాల సరఫరా వ్యవస్థలో అనేక దశలు ఉన్నప్పటికీ, వాటి ప్రతిదశలోనూ సరైన తనిఖీలు జరగడం లేదు. అనుమతి లేని డీలర్లు, మధ్యవర్తులు గ్రామాలవరకు చేరి రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారు. అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పాలి. ఇంకా ఒక ముఖ్య అంశం అవగాహన లోపం. చాలా మంది చిన్న రైతులు అసలైన విత్తనాలను, నకిలీ విత్తనాలను ఎలా గుర్తించాలో తెలియక మోసపోతున్నారు. అధికార సంస్థలు, వ్యవసాయ శాఖలు రైతులకు సరైన మార్గదర్శకాలు ఇవ్వడంలో విఫలమవుతున్నాయి. రైతు సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు కేవలం పత్రాలకే పరిమితమవుతున్నాయి. వాస్తవానికి, ప్రతి గ్రామంలోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, రైతులను



అప్రమత్తం చేయాలి. టాస్క్‌ఫోర్స్ బృందాల విషయానికి వస్తే, అవి కేవలం కాగితాలపై మాత్రమే పనిచేస్తున్నాయనే అభిప్రాయం బలంగా ఉంది. ఎక్కడైనా దాడులు జరిపినట్లు వార్తలు వస్తున్నప్పటికీ, అవి స్థిరమైన ఫలితాలను ఇవ్వడం లేదు. పెద్ద మాఫియాలను పట్టుకోవడంలో విఫలంఅవుతుండగా, చిన్నడీలర్లపై చర్యలు తీసుకోవడం మాత్రమే జరుగుతోంది. ఇది సమస్యను మూలం నుంచి పరిష్కరించలేకపోతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంతక్షణ చర్యలు తీసుకోవాలి. మొదటిగా విత్తనాల తయారీ, పంపి ణీ వ్యవస్థపై కఠిన నియంత్రణలు అమలు చేయాలి. ప్రతి ప్యాకెట్‌పై ట్రేసబిలిటీ ఉండే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. రైతులు క్యూఆర్ కోడ్‌ల ద్వారా విత్తనాల నాణ్యమైనవా!కావా అనేది సులభంగా తెలుసుకునేలా చేయాలి. ఇది నకిలీ విత్తనాల వ్యాప్తిని తగ్గించడంలోకీలక పాత్ర పోషిస్తుంది. రెండవది, గ్రామ స్థాయిలో తనిఖీలు పెంచాలి. వ్యవసాయ అధికారులు, పోలీస్‌శాఖ కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించి నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకోవాలి. ఇందులో స్థానిక రైతు సంఘాల సహకారంకూడా తీసుకోవాలి. రైతులు స్వయంగా అనుమానాస్పద కార్యకలాపాలను అధికారులకు తెలియజేసేలా ప్రోత్సహించాలి. అలాగే నకిలీ విత్తనాల తయారీదారులు, సరఫరాదారులపై కఠిన శిక్షలువిధించాలి. ప్రస్తుతం ఉన్న చట్టాలు సరిపోకపోతే, వాటిని మరింత కఠినతరం చేయాలి. భారీ జరిమానాలు, జైలుశిక్షలు విధించడం ద్వారా ఈ దందాను అరికట్టవచ్చు. నేరస్థులు తప్పించుకునే అవకాశాలు లేకుండా వేగవంతమైన విచారణలు జరగాలి. చివరిగా, రైతులకు నష్ట పరిహారం అందించే వ్యవస్థను బలోపేతం చేయాలి. నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులు తిరిగి నిలబడేందుకు ఆర్థికసహాయం అందించాలి. ఇది రైతులలో నమ్మకాన్ని పెంచుతుంది. మొత్తంగా చూస్తే, నకిలీ విత్తనాల సమస్యను నిర్లక్ష్యం చేయలేం. ఇదికేవలం రైతుల సమస్య మాత్రమేకాదు, దేశ ఆర్థికవ్యవస్థకు సంబంధించిన కీలక అంశం. వ్యవసాయం బలపడితేనే దేశం బలపడుతుంది. అందువల్ల, ప్రభుత్వం, అధికారులు, రైతులు కలిసి ఈసమస్యను ఎదుర్కొని, శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేయాలి.

# పిల్లల్లో పెరుగుతున్న స్థూలకాయ సమస్య

జి. యోగేశ్వర్ రావు

ఆటపాటలు తక్కువైపోయాయి. వ్యాయామాల జోలికి వెళ్లే వారు మరీ తగ్గిపోయారు. జంక్ ఫుడ్ మాత్రం ఎక్కువైపోయింది. ఇది చాలా దేశాల్లో చిన్నారుల పరిస్థితి. ఈ కారణాల వల్ల చిన్నతనంలోనే అనేక మంది బరువెక్కిపోతున్నారు. కేవలం పది దేశాల్లో లెక్కచూస్తే బడి ఈడు పిల్లల్లో 20 కోట్ల మందికి పైగా అధిక బరువుతో బాధ పడుతున్నట్టు అంచనా. కాలు బయటపెట్టడానికి ఇష్టపడకుండా అతికొద్ది మంది పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. చాలా మంది టీవీలు, ఫోన్లకు అంటిపెట్టుకుని ఉంటున్నారు. దీనివల్ల ఎంతోమంది బాలబాలికలు స్థూలకాయం బారిన పడుతున్నారు. 2025లో ఇలాంటి వారి పరంగా చైనా తర్వాతి స్థానం ఇండియాదే. గత ఏడాది మనదేశంలో 5-19 ఏళ్ల మధ్య పిల్లల్లో ఊబకాయంతో సతమతమవుతున్న వారి సంఖ్య 1.4 కోట్ల వరకూ ఉంది. చైనాలో ఈ సంఖ్య అత్యధికంగా 3.3కోట్లు ఉండగా ఇరాక్‌లో అత్యల్పంగా 0.3 కోట్లని వరల్డ్ ఒబెసిటీ అట్లాస్ 2026 తెలిపింది. 2022 లో ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఎనిమిది మందిలో ఒకరు ఊబకాయంతో జీవిస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అలాగే 1990 నుంచి వయోజనులలో ఊబకాయం రెట్టింపు కన్నా ఎక్కువగా పెరిగింది. కౌమార దశలో ఉన్న వారిలో నాలుగు రెట్లు పెరిగింది. 2022లో 2.5 బిలియన్ల మంది వయోజనులు అధిక బరువు కలిగి ఉన్నారు. వీరిలో 89కోట్ల మంది ఊబకాయంతో జీవిస్తున్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారిలో 43 శాతం మంది అధిక బరువుతో ఉండగా, 16 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. 2024లో అయిదేళ్ల లోపు వయసున్న 35 మిలియన్ల మంది పిల్లలు అధిక బరువుతో ఉన్నారు. ఆహారం, శక్తి వ్యయం మధ్య అసమతుల్యత వల్ల అధిక బరువు, ఊబకాయం సమస్య వస్తుంది. బాల్యం, కౌమార దశలో ఎక్కువ బరువు ఉండటం కారణంగా ఆరోగ్య సమస్యలు విపరీతంగా వస్తున్నాయి. ఇవి జీవ నాణ్యతను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. వివక్ష రావొచ్చు. వేధింపులూ తప్పకపోవచ్చు. ఊబకాయంతో ఉండే పిల్లలు పెద్దయ్యాక కూడా అదే విధంగా ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వయోజన దశలో వీరికి అంటువ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం లేకపోలేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. మనదేశం విషయానికే వస్తే పిల్లల్లో ఊబకాయం సమస్య రానురానూ పెరిగిపోతోంది. అయిదేళ్ల లోపు పిల్లల్లో అధిక బరువు 127 శాతం పెరిగినట్టు ఒక అధ్యయనం ద్వారా వెల్లడైంది. మరో నాలు



గేళ్లలో భారత దేశంలో 27 మిలియన్లకు పైగా పిల్లలు, టీనేజర్లు ఊబకాయంతో సతమతం కావచ్చని అంచనా. ఆధునిక జీవనశైలి అన్నివిధాలా చిన్నారులను దెబ్బతీ స్తోంది. స్మార్ట్‌ఫోన్‌తో అదేపనిగా ఉండటం, మితిమీరి జంక్ ఫుడ్ తినడం, అటూ ఇటూ తిరిగే పనిలేకపోవడం వంటి కారణాలతో సమస్య మరింతగా పెరిగిపోతోంది. ఫలితంగా చిన్నతనంలోనే టైప్ 2 డయాబెటిస్, రక్తపోటు, ఫ్యాటీ లివర్ వ్యాధులు మీద పడుతున్నాయి. షుగర్ డ్రింక్స్, ప్రాసెస్ చేసిన స్నాక్స్, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం వల్ల ఇన్సులిన్ పెరిగి కొవ్వు పేరుకుపోతుందని నిపుణులు చెబుతున్నారు. తగినంత నిద్ర లేకపోవడంకూడా ఓ కారణమే అని అంటున్నారు. ఏదో ఒకటి తినేసి పొట్ట నింపుకోవాలన్న తాపత్రయం చిన్నారుల్లో, టీనేజర్లలో ఎక్కువైపోయిందనీ, ఇది చాలా ప్రమాదకరమని చెబుతూ ముందు కుటుంబ పెద్దల్లో మార్పు అవసరమని సూచిస్తున్నారు. పిల్లలకు అనుకరించే అలవాటు పెద్దవారి నుంచి వస్తుంది. తల్లితండ్రులను, వారి ఆహార అలవాట్లను చాలా మంది చిన్నారులు అనుసరిస్తూ ఉంటారు. కుటుంబంమొత్తం ప్రణాళికా బద్ధంగా జీవిస్తే తప్ప చిన్న పిల్లలు తమ పద్ధతి మార్చుకుంటారని అనుకోవడం పొరపాటే అవుతుంది. చదువు ఒత్తిడి, పోటీతత్వం, సామాజిక ఆందోళనలు కూడా పిల్లలపై ప్రభావం చూపిస్తాయి. పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి పోషకాలతో కూడిన ఆహారం చాలా అవసరం. కూరగాయలు, తాజా పండ్లు, తృణధాన్యాలు, పాలు సరైన మొత్తంలో తీసుకునేలా వారిని ప్రోత్సహించాలి. వాటిని తీసుకోవడం వల్ల లభించే మేలును అర్థమయ్యేలా వివరించి చెప్పగలగాలి. ఇది ఇంటి పెద్దలు తీసుకోవాల్సిన బాధ్యత అని గుర్తించాలి. జంక్ ఫుడ్, చక్కెర అధికంగా ఉండే వాటిని పిల్లలకు వీలైనంత దూరంగా ఉంచాలి. శారీరక శ్రమ లేకపోవడం వల్ల అధిక బరువు సమస్య ఎదురవుతోంది. ఆటలు ఆడటం మంచిదని, సైక్లింగ్ చేయడం మరింత మంచిదని చెప్పి ప్రోత్సహించాలి. శారీరక శ్రమ పెరిగితే ఊబకాయం దానంతట అదే కొన్నాళ్ళకు దూరం అవుతుంది. తగినంత నిద్ర లేకపోయినా కూడా ఊబకాయం రావచ్చు. బరువు పెరగవచ్చు. నిద్ర లేమి కారణంగా శరీరంలో వాపు మొదలై బరువు పెరగడానికి ఆస్కారముంది. కనీసం రోజుకు ఎనిమిది నుంచి తొమ్మిది గంటల పాటు నిద్ర ఉండేలా సమయాన్ని నిర్ధారించే బాధ్యతను తల్లితండ్రులు తీసుకోవాలి. చదువు నిమిత్తం కంప్యూటర్, ఫోన్ వినియోగించుకోవడంలో తప్పు లేదు. కానీ వేళకాని వేళల్లో దాన్ని వినోదం కోసం గంటల తరబడి ఉపయోగించడం ఆరోగ్యానికి నిస్సందేహంగా ముప్పే. దీనికి బదులు ఇంటి పనిలో సాయపడమని చెప్పండి. పుస్తకాలు చదివించండి. తోట పని చేస్తే కలిగే ఆనందం గురించి వివరించండి. ఇది కూడా పెద్దల బాధ్యతే. పిల్లలకు ఆదర్శంగా నిలవండి. ముందు మీరు మారండి. ఆ తర్వాత మిమ్మల్ని చూసి వారే మారిపోతారు.

# బెంగాల్‌లో ముగిసిన ప్రచారం



**రేపే రెండో విడత పోలింగ్**

**7 జిల్లాల్లోని 142 నియోజకవర్గాలలో ఏర్పాట్లు పూర్తి**

**కోల్‌కతా, ఏప్రిల్ 27:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండవ, చివరి దశ ప్రచారం సోమవారం ముగిసింది. ఈ ప్రచారంలో ఎస్ఐఆర్, చొరబాటు, అవినీతి, నిరుద్యోగం వంటి అంశాలపై తీవ్ర రాజకీయ వాదోపవాదాలు చోటుచేసు కున్నాయి. 142 నియోజకవర్గాల్లోని ఓటర్లకు బిజెపి, టిఎంసిలు హామీల వర్షం కురిపించాయి.ఈ హోరాహోరీ ప్రచారంలో, పశ్చిమ బెంగాల్‌ను చొరబాటుదారులకు స్వర్గధామంగా మారుస్తోందని అధికార టిఎంసిపై బిజెపి నాయకత్వం ఆరోపించింది. మరోవైపు, కాషాయ పార్టీ విభజన రాజకీయాలకు పాల్పడుతోందని, రాష్ట్రాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తోందని, చేపలు, గుడ్ల వినియోగాన్ని నిరుత్సాహపరుస్తోందని మమతా బెనర్జీ ఆరోపించారు. ఏప్రిల్ 29న జరగనున్న ఈ దశ ఎన్నికల్లో మొత్తం 3,21,73,837 మంది ఓటర్లు ఓటు వేయడానికి అర్హులు. వీరిలో 1,64,35,627మంది పురుషులు, 1,57,37,418 మంది మహిళలు, 792 మంది తృతీయ లింగ ఓటర్లుఉన్నారు. 41,001 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరగనుంది, అన్ని పోలింగ్ కేంద్రాలను వెబ్‌కాస్టింగ్ ద్వారా కవర్ చేస్తున్నారు. ఏడు జిల్లాల్లో 2,321కంపెనీల కేంద్ర బలగాలను మోహరించి, ఎన్నికల సంఘం విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. మొత్తం 142 మంది సాధారణ పరిశీలకులు, 95 మంది పోలీసు పరిశీలకులు, 100మంది వ్యయ పరిశీలకులను నియమించారు. పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి కెమెరాలతో కూడిన డ్రోన్‌లను కూడా ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా 273 కంపెనీల కేంద్ర బలగాలను కోల్‌కతాలో మోహరించారు. ఈ దశలో పోలింగ్ జరుగుతున్న నియోజకవర్గాలలో, భాంగర్‌లో అత్యధికంగా 19 మంది అభ్యర్థులు ఉండగా, గోఘాట్‌లో అత్యల్పంగా ఐదుగురు ఉన్నారు. ఇది జిల్లాలవారీగా వైవిధ్యభరితమైన ఎన్నికల పోటీని ప్రతిబింబిస్తోంది. ఈ దశలోని కీలక అభ్యర్థులలో భవానిపూర్ నుండి తిరిగి ఎన్నిక కోరుకుంటున్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఉన్నారు. ఈ దశలోని అత్యంత ప్రముఖమైన పోటీలలో ఒకదానిలో, ఆమె బిజెపి దిగ్గజం సువేందు అధికారితో తలపడుతున్నారు. కోల్‌కతా పోర్ట్‌లో, సీనియర్ టిఎంసి నాయకుడు ఫిర్హాద్ హకీమ్, బిజెపి అభ్యర్థి రాకేష్ సింగ్‌తో పోటీ పడు తున్నారు. మైనారిటీలు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గం, మధ్య కోల్‌కతాలో అధికార పార్టీకి కీలకమైనదిగా పరిగణించబడుతోంది. ఇతర ముఖ్యమైన స్థానాలలో భట్‌పారా, జగత్ దల్, బ్యారక్‌పూర్, బంగావ్, దుమ్‌దుమ్, సందేశ్ ఖాలి, హింగల్‌గంజ్, రాణాఘాట్ ఉత్తర్, దక్షిణ, రాష్ బెహరి, జాదవ్‌పూర్, బల్లిగంజ్ ఉన్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఉత్తరాఖండ్,అసోం ముఖ్యమంత్రులతో సహా పలువురు బిజెపి నాయకులు రాష్ట్రంలో ప్రచారం నిర్వహించారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ఆ పార్టీ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, అగ్రనేత అభిషేక్ బెనర్జీ విస్తృతంగా ప్రచారం చేశారు. అటు కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీలు సుడిగాలి పర్యటనలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు.

# మంటల్లో పశ్చిమాసియా

## హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తాం..

### ఇరాన్ తాజా ప్రతిపాదన



**వాషింగ్టన్, ఏప్రిల్ 27:** అమెరికాతో నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించేందుకు ఇరాన్ ఒక కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. యుద్ధాన్ని ముగిస్తే ప్రధానమైన హార్మ్యూజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని, అయితే అణు సంబంధిత చర్చలను మాత్రం ప్రస్తుతానికి వాయిదా వేయాలని ఆ ప్రతిపాదనలో కోరినట్టు అమెరికా మీడియా సంస్థ యాక్సియోస్ ప్రస్తావించింది. ఓ అమెరికా అధికారి, చర్చల గురించి తెలిసిన ఇద్దరు వ్యక్తులను ఉటంకిస్తూ ఈ వివరాలను వెల్లడించింది. చర్చల్లో నిలిచిపోయిన పరిస్థితిని అధిగమించడంతో పాటు, అణు రాయితీల పరిధిపై ఇరాన్ నాయకత్వంలో ఉన్న అంతర్గత విభేదాలను పక్కనపెట్టి ముందుకు సాగే వ్యూహంలో భాగంగానే ఇరాన్ ఈ ప్రతిపాదన చేసిందని యాక్సియోస్ తెలిపింది. అయితే, ఈ ప్రతిపాదనకు అమెరికా అంగీకరిస్తే భవిష్యత్తు చర్చల్లో ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చే అవకాశం అధ్యక్షుడు ట్రంప్ కోల్పోతారని నివేదిక విశ్లేషించింది. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తొలగించడం, యురేనియం శుద్ధిని శాశ్వతంగా నిలిపివేయించడమే ట్రంప్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలు. ఈ పరిణామాల నేపథ్యంలో అధ్యక్షుడు ట్రంప్ తన జాతీయ భద్రతా, విదేశాంగ విధాన బృందంతో సోమవారం సిట్యుయేషన్ రూమ్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ముగ్గురు అధికారులు వెల్లడించారు. చర్చల్లో ప్రతిష్టంభన, తదుపరి చర్యలపై ఈ సమావేశంలో చర్చిస్తారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ ఇరాన్‌పై నావికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తామనే సంకేతాలు ఇచ్చారు. చమురు ఎగుమతులను అడ్డుకోవడం ద్వారా ఇరాన్‌ను లొంగదీసుకోవచ్చని ఆయన భావిస్తున్నట్టు వ్యాఖ్యానించారు. ఇటీవల ఇస్లామాబాద్‌లో ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు విఫలమవడంతో ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఈ కొత్త ప్రతిపాదన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# యేడాది కావస్తున్న 'ఆపరేషన్ సిందూర్'




## 22 నిమిషాల్లోనే టార్గెట్లు ఖతం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:**ఆపరేషన్ సింధూర్‌నిర్వహించి ఏడాదికి చేరువవుతున్న సందర్భంలో భారత్ ఆర్మీ సోషల్‌మీడియాలో కొత్త పోస్టులు పెట్టింది. కేవలం 22 నిమిషాల వ్యవధిలోనే ఉగ్రవాదుల కమాండ్ వ్యవస్థను ఎలా కుప్పకూల్చిందీ వివరిస్తూ తాజాగా ఓ పోస్ట్ చేసింది. నిర్ణయం, స్పష్టత, లక్ష్యంపై దృష్టి న్యాయం జరిగింది, వేగంగా, కచ్చితంగా అంటూ సైన్యం తన పోస్టులో పేర్కొంది. ఆదివారం కూడా ఆర్మీ మరో పోస్ట్ చేస్తూ పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో (పీఓకే) లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి సంస్థలకు చెందిన 9 ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసినట్లు తెలిపింది. భారత్ మర్చిపోదు అనే ట్యాగ్‌లైన్‌తో ఈ వివరాలను పంచుకుంది. ఈ ఆపరేషన్ల తర్వాత భారత సైన్యం తన సన్నద్ధతను మరింత పటిష్ఠం చేసుకుందని, కొత్త సర్దుబాటు, పటిష్ఠం, సన్నద్ధం ఆత్మనిర్భర్ భారత్ సిద్ధంగా ఉందని మరో పోస్టులో స్పష్టం చేసింది. గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు మతం అడిగి తెలుసుకుని 26 మంది పర్యాటకులను దారుణంగా హతమార్చిన ఘటనకు ప్రతిస్పందనగానే భారత సైన్యం ఈ కఠిన చర్యలు చేపట్టింది. ఈ దాడి జరిగిన వెంటనే భారత సైన్యం 'ఆపరేషన్ మహాదేవ్‌ను ప్రారంభించింది. దాదాపు 93 రోజుల పాటు 300 చదరపు కిలోమీటర్ల కఠినమైన హిమాలయ ప్రాంతంలో గాలించి, దాడికి పాల్పడిన ముగ్గురు ప్రధాన ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఆ తర్వాత వ్యూహాత్మక ప్రతీకార చర్యగా మే 6, 7 తేదీల్లో ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాక్, పీఓకేలోని కీలక ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడిని నిర్వహించింది. ఉగ్రవాదాన్ని భారత్ ఎంతమాత్రం సహించబోదని, దేశానికి వ్యతిరేకంగా ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా ప్రతిస్పందన కచ్చితంగా ఇలాగే ఉంటుందని హెచ్చరించింది. ఈ ఆపరేషన్ అనంతరం 50 కొత్త మిషన్‌రెడీ యూనిట్లు, 4 అదనపు ఫార్మేషన్లు, 5 లక్షలకు పైగా అత్యాధునిక ఆయుధాలను సమకూర్చుకున్నట్లు సైన్యం వెల్లడించింది.



## యుద్ధంలో అమెరికా స్థావరాలకు భారీ నష్టమే..

**వాషింగ్టన్, ఏప్రిల్ 27:** అమెరికాతో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ జరిపిన దాడుల వల్ల మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలకు ఊహించిన దానికంటే చాలా ఎక్కువ నష్టం వాటిల్లినట్లు అమెరికా అధికారులే అంగీకరిస్తున్నారు. ఈ నష్టం విలువ బిలియన్ల డాలర్లలో ఉంటుందని, మరమ్మతులకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని పలు అంచనాలు తెరపైకి వచ్చాయి. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్ దళాలు ఏడు దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడుల్లో కమాండ్ సెంటర్లు, విమాన హ్యాంగర్లు, శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, రన్‌వేలు, రాడార్లతో పాటు కొన్ని విమానాలు కూడా దెబ్బతిన్నాయి. అమెరికాకు చెందిన అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఛేదించుకుని, ఇరాన్‌కు చెందిన పాతతరం ఎఫ్5 ఫైటర్ జెట్ కూడా దాడి చేయగలగడం అమెరికా సైనిక వర్గాలను ఆశ్చర్యపరిచింది. సౌదీ అరేబియాలోని ఒక ఎయిర్ బేస్ పై దాడిలో అమెరికా నిఘా విమానం (అవాక్స్) ధ్వంసమైన చిత్రాలు కూడా వెలుగులోకి వచ్చాయి. అయితే, జరిగిన నష్టంపై పూర్తి వివరాలు వెల్లడించడానికి అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) నిరాకరిస్తోంది.

## రెండోసారి పాక్‌కు వచ్చిన ఇరాన్ విదేశాంగ మంత్రి



**టెహ్రాన్, ఏప్రిల్ 27:** అమెరికా, ఇరాన్ మధ్య జరగాల్సిన శాంతి చర్చలు ఆగిపోయిన క్రమంలో అనేకపరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీ కొద్ది గంటల వ్యవధిలోనే రెండోసారి పాకిస్థాన్‌కు చేరు కోవడం అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాం శమైంది. అమెరికాతో చర్చల విషయంలో మధ్య వర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్‌లో ఆయన పర్య టనకు ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌తో సమావేశమై వెళ్లిన అరగ్చీ, ఆ తర్వాత ఒమన్‌కు వెళ్లారు. అక్కడ సుల్తాన్ హైతామ్ బిన్ తారిఖ్ అల్‌సైద్‌తో సమావేశమై హోర్ముజ్ జలసంధి భద్రత, ఇరాన్‌పై యుద్ధాన్ని ముగించే అంశాలపై చర్చించారు. ఒమన్ పర్యటన ముగించుకున్న వెంటనే ఆయన మళ్లీ పాకిస్థాన్‌లోని రావల్పిండి నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్నారు. ఈ ఆకస్మిక పర్యటనలో భాగంగా ఆయన మరోసారి పాక్ ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. ఇస్లామాబాద్‌లో భేటీల అనంతరం ఆయన మాస్కోకు బయలుదేరి వెళ్లనున్నట్లు సమాచారం.

## పాక్ సరైన మధ్యవర్తి కాదు: ఇరాన్ విదేశాంగ అధికారి



**టెహ్రాన్, ఏప్రిల్ 27:** అమెరికా–ఇరాన్ మలి విడత చర్చలపై అనిశ్చితి కొనసాగిపోతోంది. ఈ నేపథ్యంలో మధ్యవర్తిగా పాకిస్థాన్ తటస్థ వైఖరితో సమర్థవంతంగా వ్యవహారించగలదా అని టెహ్రాన్ అధికారిక వర్గాల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇరాన్ పార్లమెంట్‌లో ఆ దేశ ఎంపి, జాతీయ భద్రత విదేశాంగ విధాన కమిషన్ అధికార ప్రతినిధి అయిన ఇబ్రహీం రెజాయీ మాట్లాడుతూ పాక్ సరైన మధ్యవర్తి కాదనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఇస్లామాబాద్‌లో దౌత్యానికి అనుకూల పరిస్థితులు లేవని అన్నారు.

'పొరుగు దేశమైన పాకిస్థాన్ మనకు మంచి మిత్ర దేశం. కానీ అది చర్చలకు సరైన మధ్యవర్తి కాదు. మధ్యవర్తిత్వానికి అవసరమైన విశ్వసనీయత దానికి లేదు. పాక్ అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ప్రవర్తిస్తుందే కానీ.. ఆ దేశ వైఖరిని సవాలు చేయడానికి సాహసంచదు. లెబనాన్ విషయంలో అమెరికా అంగీకరించలేని విధంగా డిమాండ్లు తెరపైకి తీసుకువచినప్పుడు కూడా పాక్ నేతలు అడ్డు చెప్పలేదు. మధ్యవర్తులు నిష్పక్షపాతంగా ఉండాలి కానీ.. ఒక పక్షం వైపు మొగ్గు చూపకూడదు. ఇప్పటివరకు వారి విధానం చూస్తుంటే చర్చల విషయంలో వారు నిష్పక్షపాతంగా వ్యవహరించగలరా అనే దానిపై సందేహాలు తలెత్తుతున్నాయి' అని ఇబ్రహీం రెజాయీ పార్లమెంటులో పేర్కొన్నారు.

# ఆప్ ఎంపీల విలీనప్రక్రియకు రాజ్యసభ ఛైర్మన్ ఆమోదం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** ఆమ్ ఆద్మీపార్టీకి రాజీనామా చేసి బిజెపిలో విలీనం అవుతామని ప్రకటించి ఆపార్టీ తీర్థంతీసుకున్న ఏడుగురు ఎంపిల విలీన ప్రక్రియను రాజ్యసభ ఛైర్మన్ ఆమోదించారు. ఆ విలీన ప్రక్రియకు సోమవారం రాజ్యసభ ఛైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదించారు. దీంతో రాజ్యసభ వెబ్‌సైట్ ప్రకారం ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల సంఖ్య 10 నుంచి మూడుకు పడిపోయింది. ఇక బీజేపీ సంఖ్య 106 నుంచి 113కు చేరింది. ఇక రాజ్యసభలో ఎన్డీఏ బలంగా ఇప్పుడు 141 నుంచి 148కి పెరిగింది. దీంతో రాజ్యసభలో మెజారిటీ మార్క్ అయిన 123 సంఖ్యకు బీజేపీ చేరువు అవుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీలో చేరినట్లు ఆమ్ ఆద్మీ పార్టీలు సమర్పించిన విలీన లేఖపై రాజ్యసభ ఛైర్మెన్ రాధాకృష్ణన్ న్యాయపరమైన అభిప్రాయాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏడుగురు ఆప్ ఎంపీలు ఆ లేఖపై సంతకం చేశారు. అయితే ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీల సంఖ్యలో 2/3 మెజారిటీ ఉన్నది. దీంతో ఎంపీల విలీన ప్రక్రియకు దాదాపు క్లియరెన్స్ వచ్చేసింది. రాఘవ్ చద్దా, సందీప్ పాతక్, స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, విక్రమ్‌జీత్ సాహ్నే, అశోక్ మిట్టల్, రాజేందర్ గుప్తాలు బీజేపీలో చేరారు. ఆప్ ఎంపీలు రాసిన లేఖ రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌కు తగినట్లు ఉందని రాజ్యసభ్య ఛైర్మెన్ భావిస్తున్నట్లు తెలిసింది. ఆ షెడ్యూల్ ప్రకారం 2/3 మెజారిటీ ఉంటే, విలీనాన్ని ఆమోదించవచ్చు. మరోవైపు ఆ ఏడుగురు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఛైర్మెన్‌ను కోరిన విషయం తెలిసిందే. రాఘవ్‌ఛద్దాపై ఆప్ హైకమాండ్ వ్యవహరించిన తీరుపై కలత చెందిన ఇతర ఎంపిలు కూడా ఆయన వెంటే నడిచారు. వెంటనే రాజీనామాలు చేసి బిజెపి అధ్యక్షుడు నితిన్‌నబీన్‌ను కలిసి తమ నిర్ణయాన్ని ప్రకటించడం ఆపై వెంటనే వారిని పార్టీలోకి ఆహ్వానించడం వెనువెంటనే జరిగిపోయాయి. ఈలోపు తమ విలీనప్రక్రియను ఆమోదించాలంటూ రాజ్యసభ ఛైర్మన్‌కు కూడా వివిధ పత్రాలను అందించారు. వాటిని పరిశీలించిన ఛైర్మన్ రాధాకృష్ణన్ వెంటనే ఆమోదిస్తూ నిర్ణయాన్ని వెల్లడించడంతో ఏడుగురు ఎంపిల విలీన ప్రక్రియ సజావుగా ముగిసింది.

# బిజెపికి బీటీమ్‌గా ఆమ్ ఆద్మీపార్టీ: కాంగ్రెస్‌నేత అజయ్‌మాకెన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** ఆప్‌పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలు బీజేపీలో విలీనం కావటంతో ఆమ్ ఆద్మీ కన్వీనర్ కేజ్రీవాల్ పార్టీ నిజ స్వరూపం బయటప డిందని కాంగ్రెస్ పేర్కొంది. ఆ పార్టీ బిలియనీర్ల పార్టీ అని, డబ్బు ఉన్నవారికే రాజ్యసభ సీట్లు కేటాయించిందని ఆరోపించింది. పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు బీజేపీకి ఆప్ సహాయపడుతోందని ఆ పార్టీ నేత అజయ్ మాకెన్ విమర్శించారు. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 6శాతం ఓట్లు సాధించిన బీజేపీ, ఆప్ ఎంపీల చేరికపై ఏం సమాధానం ఇస్తుందని ప్రశ్నించారు. బీజేపీకి ఆమ్ ఆద్మీపార్టీ బీ టీం అని తమ పార్టీ ఎప్పుడూ చెబుతూనే ఉందన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ పేరును అరబ్ ఆద్మీయోంకా పార్టీగా మార్చాలని అజయ్ మాకెన్ అన్నారు. డబ్బు కోసం ప్రశాంత్ భూషణ్, అశుతోష్, యోగేంద్రయాదవ్‌లకు రాజ్యసభ సీట్లు ఇవ్వలేదని ఆరోపించారు. తాను సహ వ్యవస్థాపకుడిగా ఉన్న రాజకీయ పార్టీ ఆప్ నుంచి వైదొలుగుతున్నట్లు బీజేపీ ఎంపీ రాఘవ్ చద్దా ప్రకటించారు. పార్టీలో విషపూరితమైన పని వాతావరణం ఉందని, ఇటీవలి కాలంలో పార్టీ అంతర్గత కార్యకలాపాలు గణనీయంగా క్షీణించాయని ఆరోపించారు.

## జీహాదీ మిలిటెంట్ల దాడిలో మాలి రక్షణ మంత్రి దారుణ హత్య

**బమాకో, ఏప్రిల్ 27:** జిహాదీలు జరిపిన ఆత్మాహుతి దాడిలో మాలి దేశ రక్షణ శాఖ మంత్రి సాదియో కమరా మృతిచెందారు. దేశ రాజధాని బమాకోకు సమీపంలో ఉన్న అతని నివాసంపై అటాక్ జరిగింది. జిహాదీ మిలిటెంట్లు, వేర్పాటువాదులు కలిసి దేశవ్యాప్తంగా హింసకు పాల్పడుతున్నారు. తీవ్రవాదుల దాడిలో గాయాలపాలైన రక్షణ మంత్రి ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ ఛానల్ కన్ఫర్మ్ చేసింది. మిలిటరీ జుంటా



అధినేత జనరల్ అసిమి గోయిటాను ప్రస్తుతం సురక్షిత ప్రాంతానికి తరలించారు. చాన్నాళ్లుగా మాలి దేశంలో అల్‌ఖయిదా, ఇస్లామిక్ స్టేట్‌తో పాటు అజావాద్ లిబరేషన్ ఫ్రంట్‌కు చెందిన గ్రూపుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. కటి ప్రాంతంలో ఉన్న రక్షణ మంత్రి ఇంటిపై అల్‌ఖయిదా అనుబంధ మిలిటెంట్లు దాడి చేశారని, ఆ దాడుల్లో కమరా ఫ్యామిలీకి చెందిన మరో ముగ్గురు కూడా హతమైనట్లు తెలిసింది. మినిస్టర్ నివాసంపైకి ఆయుధాలతో నిండిన వాహనం దూసుకువచ్చిందని, ఓ ఆత్మాహుతి బాంబర్ ఆ వాహనాన్ని నడిపినట్లు ప్రభుత్వ ప్రతినిధి ఇసా ఔస్మనే కౌలిబలీ తెలిపారు. మిలిటెంట్లపై ఎదురు కాల్పులు జరిపామని, కొందర్ని హతమార్చామని, కానీ గాయాల వల్ల రక్షణ మంత్రి ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా సైనిక స్థావరాలపై అల్ ఖైదా అనుబంధ తుయరెగ్ రెబెల్స్ చేసిన దాడుల వల్ల ఆయన మరణించినట్లు అల్ జజీరా చానల్ పేర్కొన్నది. మాలిలో ప్రభావవంతమైన వ్యక్తుల్లో సడియో ఒకరని అల్‌జజీరా తెలిపింది. కటి పట్టణంలోని తన నివాసంలో ఆత్మాహుతి కారు బాంబు దాడిలో సడియో హత్యకు గురయ్యారని వెల్లడించింది. ఆయన ఇంటి వద్ద అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉన్నప్పటికీ ఈ దాడి జరిగిందని తెలిపింది. కటిలో పరిస్థితి తమ నియంత్రణలో ఉందని ఆర్మీ చెప్తున్నప్పటికీ సాయుధ గ్రూపులు ఆదివారం కూడా కాల్పులకు తెగబడినట్టు వార్తలు వచ్చాయి. సడియో మృతి ఆ దేశ సైన్యానికి పెద్ద షాక్ తగిలినట్లేనని రక్షణ నిపుణులు పేర్కొంటున్నారు.

## యుఎఇ చేతికి ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్



**టెల్‌అవీవ్, ఏప్రిల్ 27:** పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు రగులుతున్న వేళ యుఎఇని అనూహ్యంగా ఓ మిత్ర దేశం ఆదుకొంది. అదే ఇజ్రాయెల్. యుద్ధం ప్రారంభమైన తొలినాళ్లలలో ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను యుఎసి తన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో అడ్డుకొంది. కానీ, కొన్ని ఇరాన్ ఆయుధాలు కీలక మౌలిక వసతులపై దాడులు చేయడంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మిత్రదేశాల సాయం కోరింది. దీంతో ఇజ్రాయెల్ ముందుకొచ్చి దానికి సాయం చేసినట్లు అమెరికా పత్రిక సంచలన కథనం ప్రచురించింది. ఇజ్రాయెల్ తన ఐరన్‌డోమ్ వ్యవస్థను యుఎఇకి పంపించడంతోపాటు దానిని ఆపరేట్ చేసి రాకెట్లు, డ్రోన్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు తమ దళాలను కూడా అక్కడికి తరలించింది. నెతన్యాహుకు ఫోన్ చేసిన యుఎఇ అధ్యక్షుడు ఇరాన్ దాడుల తీవ్రత పెరగడంతో యుఎఇ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జయేద్ నుంచి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ఫోన్‌కాల్ వెళ్లింది. ఆ తర్వాతే ఐరన్ డోమ్ వ్యవస్థను యుఎసి తరలించాలని ఇజ్రాయెల్ ప్రధాని నుంచి ఐడిఎఫ్ దళాలకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో ఇరాన్ దాడులకు ప్రధాన టార్గెట్‌గా మారిన అబుదాబికి ఊరట లభించింది. దీంతో డజన్లకొద్దీ ఇరాన్ క్షిపణులను యుఎఇ ఈ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో అడ్డుకొంది. ఇరాన్ ఈ యుద్ధ సమయంలో మొత్తం ఆ దేశంపై 550 బాలిస్టిక్ క్షిపణులు, 2,200 డ్రోన్లు ప్రయోగించినట్లు అబుదాబి రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ చర్యతో ఇజ్రాయెల్–యుఎఇ మిత్రత్వం మరింత పెరిగినట్లు అమెరికా మీడియా సంస్థ వెల్లడించింది. ఇప్పటివరకు ఇజ్రాయెల్ దేశం బయట తన సొంత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను మోహరించింది యుఎఇలోనే. అయితే అమెరికా కూడా తన సొంత ఐరన్ డోమ్‌ను వాడుతోంది.

# లడఖ్‌లో కొత్తగా ఐదు జిల్లాలు: ఏడుకు పెరిగిన కేంద్రపాలితప్రాంత జిల్లాలు




**లేహ్, ఏప్రిల్ 27:** కేంద్రపాలిత ప్రాంతమైన లడక్‌లో పరిపాలనా సంస్కరణల దిశగా మరో ముందడుగు పడింది. ప్రజల దశాబ్దాల కల నెరవేరుస్తూ లడఖ్‌లో కొత్తగా ఐదు జిల్లాల ఏర్పాటుకు లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు లద్దాఖ్‌లో లేహ్, కార్గిల్ అనే రెండు జిల్లాలు మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా నుబ్రా, షామ్, చాంగ్‌థాంగ్, జన్‌స్కర్, ద్రాస్ జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో లడఖ్‌లో మొత్తం జిల్లాల సంఖ్య రెండు నుంచి ఏడుకు పెరుగుతోంది. పరిపాలన సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలను ఏర్పాటు చేసినట్లు వినయ్ కుమార్ సక్సేనా తెలిపారు. ఈ నిర్ణయంతో లడఖ్‌లోని మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. లద్దాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు ఏర్పాటుచేయనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, 2024 అగస్టులో వెల్లడించారు. త్వరలోనే హోంమంత్రి అమిత్ షా పర్యటించనున్న నేపథ్యంలో తాజాగా ఆ ఐదు జిల్లాలను ఏర్పాటు చేస్తూ లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదముద్ర వేశారు. జమ్ముకాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి హోదాను రద్దుచేసి అసెంబ్లీతో కూడినకేంద్రపాలితప్రాంతంగాప్రకటించిన తర్వాత గతంలో జమ్ముకాశ్మీర్‌లో అంతర్భాగంగా ఉన్న లడక్‌నుఅసెంబ్లీలేని కేంద్రపాలితప్రాంతంగా ప్రకటించారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఈ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తుంటారు. అంటేనేరుగా కేంద్ర ప్రభుత్వమే లడక్ పాలనా వ్యవహారాలు చూస్తుంది.

## బాధ ఉన్నా.. బయటపడని అమెరికా!



**వాషింగ్టన్, ఏప్రిల్ 27:**అమెరికా–ఇరాన్ యుద్ధంలో ప్రస్తుతానికి కాల్పుల విరమణ కొనసాగుతోంది. యుద్ధం ఆగుతుందా? చర్చలు జరుగుతాయా? అనే ప్రశ్నలకు మాత్రం సమాధానం ఇంకా దొరకడం లేదు. ఈ యుద్ధంలో ఇరాన్‌ను సైనికంగా దెబ్బతీశామని, వారు ఒప్పందానికి రావాల్సిన పరిస్థితి కల్పించామని అగ్రరాజ్యం చెప్తోంది. అయితే ఇరాన్ కూడా మిలిటరీ శక్తి అయిన యుఎస్‌ను గట్టిగా దెబ్బకొట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. బయటకు చెప్తున్న దానికంటే నష్ట తీవ్రత ఎక్కువగానే ఉందని పేర్కొన్నాయి. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. వాటిని ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై టెహ్రాన్ విరుచుకుపడింది. అక్కడ ఉన్న అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. కమాండ్ సెంటర్లు, నిల్వ కేంద్రాలు, విమానాలు ఉంచే ప్రాంతాలు, రన్‌వేలు, రాడార్ వ్యవస్థలపై దాడులు చేసింది. సైనిక కదలికలు, నిఘాకు వాడే వ్యవస్థలను దెబ్బకొట్టింది. యుఎస్ వద్ద అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలున్నప్పటికీ.. ఇరాన్ తన పాత ఎఫ్–5 యుద్ధ విమానాన్ని దాడి చేయడంతో యుఎస్ ఖంగుతిన్నది. ఇరాన్ దాడుల్లో జరిగిన నష్టానికి సంబంధించి కచ్చితమైన లెక్కలను అమెరికా ఇప్పటివరకు బయటపెట్ట లే దు. ఈ విష యంలో ట్రంప్ యంత్రాంగం పారదర్శకంగా లేకపోవడంపై కొంత సొంత పార్టీ నేతలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వారాలుగా ఆ వివరాలు ఇవ్వాలని అడు గు తున్నా పూర్తి వివరాలు మాత్రం బయటకు రావడం లేదంటున్నారు. మరోవైపు యుద్ధం నేపథ్యంలో 200 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 18 లక్షల కోట్లు)పైగా నిధులు ఇవ్వాలని అమెరికా పార్లమెంటున్న పెంటగాన్ కోరినట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఇక, ఘర్షణలు ప్రారంభమైన మొదటి వారంలోనే అమెరికా 11 బిలియన్ డాలర్ల మేర ఖర్చు చేసింది. ఈ వార్ ప్రారంభం కావడానికి ముందు ట్రంప్ 1.5 ట్రిలి యన్ డాలర్ల డిఫెన్స్ బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఆ మొత్తం క్రితం యేడాదితో పోలిస్తే 50 శాతం ఎక్కువ కావడంగమనార్హం. ఘర్షణలు కొనసాగించడానికి పెట్టే ఖర్చు ఒకవైపు అయితే.. దెబ్బతిన్న వాటిని బాగు చేయడానికి కొన్ని బిలియన్ల డాలర్ల మేర అవసరం కానుందని అంచనా. ఈ బాధ ఎక్కువగా ఉన్నా దానిని బయటకు చెప్పలేని పరిస్థితిలో అమెరికా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# సహజీవన భాగస్వామిపై లైంగిక దాడి ఆరోపణలేమిటి?



**సహజీవనానికి, లైంగిక దాడికి ఎంతో తేడా: సుప్రీంకోర్టు స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** పెళ్లి చేసుకుంటానని చెప్పి తనపై అత్యాచారం, లైంగిక దాడికి పాల్పడ్డాడని ఒక వ్యక్తిపై ఆరోపణలు చేస్తూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పరస్పర అంగీకారంతో కూడిన సహజీవనానికి, నేరపూరిత లైంగిక నేరాలకు మధ్య తేడాను కోర్టు నొక్కి చెప్పింది. ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తన సహజీవన భాగస్వామిపై సదరు మహిళ లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ పిటిషన్ వేసింది. పరస్పర అంగీకారంతో ఏర్పడిన ఆ బంధం వీగిపోయిన తర్వాత అది లైంగిక దాడి ఎలా అవుతుందని జస్టిస్ బీవీ నాగరత్న కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు సహజీవనానికి సంబంధించినదని, వివాహం కాకుండానే మహిళ బిడ్డకు కూడా జన్మనిచ్చిందని తెలిపారు. కానీ ఇప్పుడు ఆమె దాడి, అత్యాచారం అంటోందని అన్నారు. సమ్మతితో ఏర్పడిన బంధం చివరకు దాడిగా ఎలా మారిందని ప్రశ్నించారు. వివాహ ప్రస్తావన లేకుండా ఏర్పడిన బంధాల్లో ఉన్న సమస్యలు ఇవేనని, కొన్నేళ్లపాటు కలిసి ఉన్న ఆ మహిళ ఇప్పుడు ఫిర్యాదు చేయడమేమిటని ప్రశ్నించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది మాట్లా డుతూ, నిందితుడు ఆ మహిళను కలిసినప్పుడు ఆమె వయస్సు పద్దెనిమిది అని, అప్పుడు ఆమె ఒక వితంతువు అని కోర్టుకు తెలిపారు. అతడికి కూడా అప్పటికే పెళ్లి అయిపోయిందని, కానీ ఆ విషయాన్ని దాచిపెట్టి అతడు సంబంధాన్ని కొనసాగించాడని పేర్కొన్నారు. ఇతర మహిళలను కూడా అతడు ఇలాగే మోసం చేశాడని అన్నారు. అయితే, ఆమె పెళ్లి చేసుకోవడానికి బదులు కలిసి జీవించడానికి ఎందుకు అంగీకరించిందని ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రశ్నించారు. పరస్పర అంగీకారంతో కూడిన సంబంధం లైంగిక దాడి కాదని స్పష్టం చేశారు. అలాగే మహిళ పరిస్థితిపై న్యాయమూర్తి సానుభూతి వ్యక్తం చేశారు. ఆ బిడ్డ పోషణ కోసం భరణం కోరవచ్చని సూచించారు. ఈ సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు.

# తాగునీటి సరఫరాపై ప్రభుత్వం ఫోకస్

### గ్రామాల వారీగా రోజువారీ నివేదికలు

### సర్పంచ్‌ల ద్వారా నేరుగా సమాచారం సేకరిస్తున్న ఉన్నతాధికారులు

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగు తుండడంతో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం ఫీల్డు నుంచి వచ్చే రిపోర్టులపై మాత్రమే ఆధార పడకుండా గ్రామాల నుంచి కూడా విడిగా నివేదికలను తెప్పించుకుంటున్న ఇంజనీర్ ఇన్ చీఫ్ వాస్తవపరిస్థితికనుగుణంగా అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు. రోజువారీ రిపోర్టులను రివ్యూ చేస్తూ ఇబ్బంది తలెత్తిన వెంటనే దిద్దుబాటు చర్యలపై ఫోకస్ పెడుతున్నారు. దీనికి తోడు పంచాయతీరాజ్ మంత్రి సీతక్క సైతం అధికారులతో నిరంతరం రివ్యూలు చేస్తూ పరిస్థితిని పర్యవేక్షి స్తున్నారు. పంటలు కోతకు వచ్చినందున సాగునీటి అవసరాలు లేని ప్రాంతాల్లో తాగునీటికి అందించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర వాతావరణ విభాగం నుంచి అందే రోజువారి రిపోర్టులకనుగుణంగా తాగునీటి ఇక్కట్లు లేకుండా అధికారులను అప్రమత్తం చేసే వ్యవస్థ అమలవుతోంది. అన్ని పంచాయతీల నుంచి సచివాలయంలోని పేషీకి తాగునీటి సరఫరాపై రోజువారి నివేదికలు అందుతున్నాయి. కేవలం నివేదికలపై మాత్రమే ఆధారపడకుండా సర్పంచ్‌ల నుంచి కూడా వివరాలను సేకరించడానికి ప్రత్యేకంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారు. నేరుగా సర్పంచ్‌లే వారి పంచా యతీల్లోని తాగునీటి అంశాలను ఫోన్ ద్వారా తెలియజేయడం అధికారులకు ఉపయోగపడు తోంది,. ఏ గ్రామంలో తాగునీటి సరఫరా సక్రమం గా లేదో, ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో సర్పంచ్‌లు ఇచ్చే సమాచారం ఆధారంగా ఇంజినీర్ ఇన్ చీఫ్ సహా అధికారులు సమీపంలోని డిపార్టుమెంట్ సిబ్బందిని అప్రమత్తం చేసి దిద్దుబాటు చర్యలు తీసుకోడానికి ఈ వ్యవస్థ దోహదం చేస్తోంది. దీంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలకు ఆస్కారం ఉండదని పంచాయతీరాజ్ అధికారుల చెబుతున్నారు. ఈ వేసవి ముగిసేంత వరకు మంత్రి సీతక్క జిల్లాలవారీగా రివ్యూ మీటింగులు కొనసాగిస్తారని, రోజువారి నివేదికలే కాకుండా సర్పంచ్‌ల నుంచి అందే ఫీడ్‌బ్యాక్, ఫిర్యాదుల ఆధారంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు.

## పోలీసుల పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం రోజున సెలవులు

### ఉత్తర్వులు జారీచేసిన డిజిపి శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసులకు డిజిపి శివధర్ రెడ్డి పదవీ విరమణకు మూడు రోజుల ముందు తీపి కబురు అంది ంచారు. విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడిలో వుండే పోలీసులకు ఇక ముందు పుట్టిన రోజుతో పాటు వివాహ వార్షికోత్స వం రోజున సెలవు లు మంజూరు చేస్తూ డిజిపి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. పుట్టిన రోజు, వివాహ దినోత్స వం రోజున పోలీ సులు తమ కుటుంబసభ్యులతో గడిపేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకుం టున్నట్లు డిజిపి తెలిపారు. కానిస్టేబుల్ నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని, అయితే సెలవు పొందగోరే వారు ముందు గానే రాతపూర్వక అభ్యర్థనను ఇవ్వాల్సి వుంటుందని డిజిపి తెలి పారు. శాంతి భద్రతల పరంగా ఏమైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే తప్ప, ఇతర సమయాలలో సంబంధిత యూనిట్ అధికారులు సిబ్బంది అభ్యర్థలను కాదనకుండా సెలవులు మంజూరు చేయాలని డిజిపి శివధర్‌రెడ్డి ఆదేశించారు.

## మాది ప్రజాపాలన.. ప్రతిపక్షపాత్రను మరిచింది మీరు

### కెసిఆర్‌పై ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విసుర్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన చెయ్యాలని ముందుకు వెళ్తుందనీ, ప్రతిపక్ష పాత్ర పోషించడం మరిచింది మీరే అంటూ కెసిఆర్‌పై ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి విమర్శలు చేశారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ ప్రజాసమస్యలు ప్రభుత్వం ముందుకు తీసుకు రావాలి కానీ కెసిఆర్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారని అదీ మీ విజ్ఞతకే వదిలివేస్తున్నామని అన్నారు. బిఆర్ఎస్ పార్టీకి ఇకనుండి వర్ధంతిలు చేసుకోవా లని ఆయన సూచించారు. కెసిఆర్ ఫామ్‌హౌస్ పరిపాలన మాత్రమే తెలుసనీ అన్నారు. ఆయన కూతురు వ్యాఖ్యలపై కెసిఆర్ స్పందించలేదనీ మౌనం అంగీకారమేనా అని ప్రశ్నించారు. జేబులు చూసి పరిపాలించారన్న కవిత ఆబాండాలపై కెసిఆర్ మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఎంపి తేజస్వీసూర్య మాట్లాడితే ఒక్క ఎంపి కూడా మాట్లాడలేదని కెసిఆర్ అంటున్నారని నువ్వే కావాలని బిజెపి ఎంపిలను గెలిపించుకున్నావని అన్నారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ గళం మీకు వినిపించలేదా? కెసిఆర్ అని అడిగారు. కవిత చేసిన ఆరోపణలు నిజమా, అబద్ధమా సమాధానం చెప్పి వేరే విషయాలు కెసిఆర్ మాట్లాడాలని అన్నారు.

# ఆఫ్టర్ కేర్ పిల్లలకు అండగా ప్రభుత్వం

### 1,050 మంది చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు

### ఆఫ్టర్ కేర్ పిల్లలకు మంత్రి సీతక్క హామీ

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ఇప్పటి వరకు ప్రభుత్వ సంరక్షణలో ఉన్న ఆఫ్టర్ కేర్(అనాథ) పిల్లలు ఇకపై స్వతంత్ర జీవితంలోకి అడుగుపెడుతున్నారని, వారి ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రా లను ప్రభుత్వం స్వయంగా అందజేస్తోందని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క చెప్పారు. గతంలో సర్టిఫికెట్ల కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ సమస్యలను ప్రభుత్వం పూర్తిగా తొలగించిందని వివరిం చారు. అనాథ పిల్లలకు ఏకకాలంలో వేల సంఖ్యలో ధృవీకరణ పత్రాలు అంద జేయడం రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. 'ఈ ధ్రువపత్రాలు కేవలం కాగితాలు కావు. ఇవే మీ భవిష్యత్తుకు బాటలు వేసే సాధనాలు' అని పేర్కొ న్నారు. ఈ మేరకుప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన "చైల్డ్ సేఫ్టీ - ప్రొటెక్షన్ సే నో టు డ్రగ్స్' కార్యక్రమంలో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుటుంబ ఆదరణ లేకపోయినా కష్టాలను అధిగమించి ఉన్నత స్థాయికి వచ్చిన విద్యార్థులను అభినందించారు. చిన్నారుల భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మంత్రి సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రతీ ఇంటికి ప్రభుత్వ సేవలను చేరవేస్తున్నామని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే వేలాది ధృవపత్రాలు అందజేశామని, మిగతా ప్రక్రియలు కూడా త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు.

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం అందుతోందని, బాలల భద్రత, పునరావాసం, విద్య, మహిళల సాధికారత కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ' ప్రతి చిన్నారి భద్రంగా ఉండాలి. ప్రతి యువకుడు సరైన దిశలో ఎదగాలి. ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలి. అదే తెలంగాణను అగ్రస్థానంలో నిలబెడుతుంది." అని స్పష్టమైన సందేశమిచ్చారు. ఈ సందర్భంగా ఆఫ్టర్ కేర్ విద్యార్థులకు ఆధార్, ఆదాయ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆరోగ్యశ్రీ కార్డులు వంటి కీలక పత్రాలను మంత్రి సీతక్క అందజేశారు. ఈగల్ ఫోర్స్ తరఫున విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం "సే నో టు డ్రగ్స్" పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల కమిషన్ చైర్పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి, సభ్యులు అపర్ణ చందన, సరిత, వందన, వచన్‌కుమార్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక, మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ శృతి, ఈగల్ ఫోర్స్ అధికారులు గిరిధర్, పద్మజ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నీలోఫర్ ఆసుపత్రిలో యూనిక్ డిసెబిలిటి ఐడి ఎవల్యూషన్ కేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. యూడిఐడి కేవలం గుర్తింపుకార్డు మాత్రమే కాదని, దివ్యాంగుల గౌరవానికి ప్రతీకగా నిలిచే హక్కు పత్రమన్నారు. యూడిఐడి కార్డు కొత్త జీవితానికి దారి చూపుతుందని, దివ్యాంగుల సామాజిక గుర్తింపును బలపరుస్తుందని తెలిపారు.

## జనగణనలో ఒబిసి కాలమ్ కోసం ఉద్యమించాలి

### బిసి సంఘాలకు మాజీ ఎంపి విహెచ్ పిలుపు

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** జనగణనలో ఒబిసి కాలమ్ పెట్టాలనీ బిసి సంఘాలు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని పిసిసి మాజీ అధ్య క్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన తరగతులు సామాజికంగా ఆర్థికంగా ఎంత వెనుకబాటులో ఉన్నారనే విషయం రాహుల్ గాంధీ పాదయాత్ర చేసినప్పుడే ప్రత్యక్షంగా చూడటంతో అర్దమైందని అందుకే ఆయన ఒబిసిల ఆర్థిక స్వావలంబన, రాజకీయ అవకాశాలపై వాటా కల్పనకు ఒక విధానం రూపొందించుకొన్నారని తెలిపారు. కేవలం అగ్ర కులాలే రాజకీయాల్లో పెరుగు తున్నారనీ, కులగణన లేకుంటే జనగణనా ఎందుకు? మా లెక్క లేకపోతె ఏం తెలుస్తుంది అని ఆయన ఆవేదన చెందారు. మేము మహిళలకు వ్యతిరేకం కాదు కులగణనలో ఒబిసి కాలమ్ ఉండాలని అదేవిధంగా మహిళలకు చట్టసభల్లో సీట్లు ఇచ్చినా అందులో బిసి రిజర్వేషన్ కూడా అమలు చేయాలని సూచించారు.

## ఉపముఖ్యమంత్రి పిఆర్ఓ మృతి

### డిప్యూటీ సిఎం, పిసిసి చీఫ్, మంత్రుల సంతాపం

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ఉపముఖ్యమంత్రి ముఖ్య ప్రజా సంబంధాల అధికారిగా బాధ్యతలు నిర్వర్తిసున్న సీనియర్ జర్నలిస్టు మారబోయిన మధుసూదన్ సోమవారం తీవ్రమైన గుండెపోటుతో ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి



ఎం.మధుసూదన్ (ఫైల్)

చెందారు. సోమవారం మధ్యాహ్నం ఛాతి నొప్పితో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొం దుతున్న సమయంలో ఆయనకు కార్డియాక్ అరెస్ట్ సంభవించడంతో సమీపంలోని అపోలో ఆస్పత్రికి తరలించారని, అక్కడ చికిత్స కొన సాగుతున్న సమయంలో మరోసారి కార్డియాక్ అరెస్ట్ రావడంతో ఆయన మృతి చెందారు. పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మధు సూదన్ కుటుంబానికి తీవ్రసంతాపం తెలి పారు. డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన పిఆర్ఓ చనిపోవడం తీవ్రంగా కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్, పనిపట్ల ఎంతో నిబద్ధతతో ఉండే మధు అకాల మరణం తీవ్రంగా కలచివేసిందన్నారు. బిసి సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆస్పత్రికి వెళ్లి మధుసూదన్ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంతాపం వ్యక్తం చేస్తూ మధుసూదన్ మరణంతో ఆయన కుటుంబసభ్యులకు పూడ్చుకోని నష్టం జరిగిందని అన్నారు.

## 42 శాతం బిసి రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు జరపాలి

### ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరగబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభసభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని కొందరు మంత్రులు, అధికారులకు రహస్య ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోందని, ప్రభుత్వం తన బీసీ వ్యతిరేక వైఖరిని మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కృష్ణయ్య కోరారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన జరుగుతాయని, ఆ దృష్ట్యా కచ్చితంగా 42 శాతం కోటాను అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. రిజర్వేషన్లపై ఉన్న కోర్టు స్టేను తొలగించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నించాలని డిమాండ్ చేశారు. బీసీలకు అన్యాయం జరిగే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల పట్ల వివక్ష చూపుతున్నారని కృష్ణయ్య విమర్శించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయకుండా బీసీ విద్యార్థుల చదువులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.

## బతుకమ్మకుంట వివాదంలో కీలకమలుపు

### హైడ్రా నేమ్ బోర్డు.. శిలాఫలకాలు తొలగింపునకు చర్యలు

### హైకోర్టు ఆదేశాలను పాటించాలని సుప్రీంకోర్టు సూచన

### తదుపరి విచారణపై సర్వత్రా ఉత్కంఠ

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** అంబర్‌పేట్‌లోని బతుకమ్మకుంట భూవివాదం మరో ఆసక్తికర మలుపు తిరిగింది. ఈ కుంటపై తమ ఆధిపత్యాన్ని సూచించే బోర్డులు, శిలాఫలకాలను తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. అంబర్‌పేట్‌లోని సుమారు ఏడు ఎకరాల స్థలం విషయంలో ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తికి, ప్రభుత్వానికి మధ్య గత కొంతకాలంగా న్యాయపోరాటం నడుస్తోంది. ఈ స్థలం తన వ్యక్తిగత ఆస్తి అని, ఇది ఎప్పుడూ కుంట (నీటి వనరు) కాదని సుధాకర్ రెడ్డి వాదిస్తున్నారు. అయితే ఈ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండగానే ప్రభుత్వం ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టిందని ఆయన కోర్టును ఆశ్రయించారు. ఈ స్థలాన్ని ప్రభుత్వ భూమిగా భావించిన హైడ్రా.. ఇక్కడ సుమారు ఐదు ఎకరాల్లో చిల్డ్రన్స్ పార్కు, ఓపెన్ ఎయిర్ జిమ్, వాకింగ్ ట్రాక్ ను ఏర్పాటు చేసి సుందరీకరించింది. గతేడాది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా దీనిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. అయితే కోర్టులో స్టేటస్ కో (యథాతథ స్థితి) ఆర్డర్‌ఉండగా అభివృద్ధి పనులు చేయడంపై గతంలో తెలంగాణ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. దీనిని కోర్టు ధిక్కరణగా భావించి, అక్కడ హైడ్రాకు సంబంధించిన పేర్లు, గుర్తులను మూడు వారాల్లోగా తొలగించాలని ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై హైడ్రా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, తదుపరి విచారణ జరిగే వరకు హైకోర్టు ఆదేశాలనే పాటించాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో విచారణ ముగిసే వరకు ఈ స్థలం ఎవరికి చెందుతుందనేది ఉత్కంఠగా మారింది.

# జాతీయ జల భౌగోళిక ఆస్తిగా బోరు బావి

### బోరు బావుల తవ్వకం డేటా ప్రామాణీకరణ

### హైదరాబాద్‌లో నేడు ప్రాంతీయ వర్క్‌షాప్

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** 'భూగర్భ జలాల డ్రిల్లింగ్ డేటా ప్రామాణీకరణ, జాతీయ జల భౌగోళిక ఆస్తిగా బోరు బావులను (డ్రిల్లింగ్) సంస్థాగతీకరించడం, డేటా సేకరణ' అంశంపై మంగళవారం హైదరా బాద్‌లో వర్క్‌షాప్ జరగ నుంది. భూగర్భజల అభివృద్ధి, డ్రిల్లింగ్ కార్యకలా పాలు, జల వనరుల నిర్వహణలో అనుభవమున్న వివిధ కీలక భాగస్వాములందరూ ఒకే వేదికపైకి రానున్నారు. డ్రిల్లింగ్ డేటాను ప్రామాణీకరిం చాల్సి న ఆవశ్యకతపై చర్చించడం, జాతీయ ఆస్తిగా దీర్ఘకాలిక విలువను గుర్తించడం ఈ వర్క్ షాప్ లక్ష్యంగా కనిపిస్తోంది. దేశవ్యాప్తం గా తాగునీరు, సాగునీరు, పారిశ్రామికరంగాల నీటి అవసరాలను తీర్చడంలో భూగర్భ జలాలు కీలక పాత్ర పోషిస్తాయి.

వివిధ సంస్థలు చేపట్టే డ్రిల్లింగ్ కార్యకలాపాల ద్వారా భూగర్భ శిలాశాస్త్రం, జలస్తర లక్షణాలు, బావుల నిర్మాణం, దిగుబడి సామర్థ్యం, నీటి నాణ్యతపై ఎంతో విలువైన సమాచారం లభిస్తుంది. అయితే ఈ డేటాను చాలా వరకూ వివిధ విభాగాల్లో, విభిన్న విధానాల్లో నమోదు చేస్తున్నారు. శాస్త్రీయ విశ్లేషణ, ప్రణాళిక కోసం దీనిని పూర్తిగా ఉపయోగించడం లేదు. ప్రామాణికమైన డేటా నియమావళి లేకపోవడంతో డ్రిల్లింగ్ ద్వారా లభించే సమాచారాన్ని సమగ్ర భూగర్భ జల డేటాబేస్‌లతో ఏకీకృతం చేయడంలో పరిమితులు ఏర్పడుతు న్నాయి. దీంతో ఆధారాల ప్రాతిపదికన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ సమాచారం అంత ప్రభావవంతంగా ఉండడం లేదు. ఈ నేపథ్యంలో భూగర్భ జలాల డ్రిల్లింగ్ డేటా సేకరణ, ప్రమాణీకరణ, రిపోర్టింగ్ ప్రక్రియల్లో ఏకరూప ప్రమాణాలను నెలకొల్పాల్సి న తక్షణ ఆవశ్యకతపై ఈ వర్క్‌షాప్ ప్రధానంగా దృష్టి సారించనుంది. ప్రతీ బోరు బావిని (బోర్ హోల్) దేశ జల భౌగోళిక ఆస్తిగా పరిగణించాలన్న భావనను ఈ వర్క్‌షాప్ స్పష్టం చేయనుంది.

# సెక్యులర్ ఓటర్ల తొలగింపునకు బిజెపి కుట్రలు




### రాహుల్‌ను ప్రధానమంత్రి చేయడమే ధ్యేయంగా పనిచేయాలి

### త్వరలోనే తీపి కబురు.. కార్పొరేషన్‌ల పదవుల భర్తీ

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

### అడ్డదారుల్లో బిజెపి అధికారం చేపట్టాలనే కుతంత్రానికి పగ్గాలు వేద్దాం: మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ఓటర్ల జాబితా ప్రత్యేక నియంత్రణ సవరణ (ఎస్ఐఆర్)తో సెక్యులర్ ఓటర్లను తొలిగించేందుకు బిజెపి చేస్తున్న కుటిల పన్నాగాలను బూత్‌లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి నిలువరించాలని టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లోని ఇందిరభవన్‌లో సోమవారం డిసిసి లు, నియోజక వర్గ కోఆర్డినేటర్లలతో టిపిసిసిఅధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ సమావేశమైనారు. బిఎల్ ఏ ల నియామకం, మండల, జిల్లా కమిటీ ల ఏర్పాటు పై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ బూత్ లెవెల్ ఏజెంట్ నియామకం విషయంలో అత్యంత శ్రద్ధతీసుకోవాలని ప్రతి ఓటరుతో సన్నిహిత సంబంధాలు ఏర్పాటు చేసుకొనే విధంగా ప్రతి ఇంటితో అనుబంధం కలిగి ఉండే వ్యక్తిని నియామకం చేసుకొనాలని సూచించారు.బిజెపి అడ్డదారిలో ఓట్లు తొలిగించాలనే కుట్ర చేస్తోందని ఆరోపించారు. మన అందరి ధ్యేయం కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలనీ రాహుల్ గాంధీ ప్రధాని కావాలనీ దీనికి తగ్గట్టుగానే మన రాష్ట్రంలో బిజెపి పాలిత రాష్ట్రాలలో ఎక్కడ కూడా అమలు చేయని పథకాలు అమలు చేస్తున్నామని ప్రజల మద్దతు మనకు అనుకూలంగా కూడగట్టుకోవడంలో అనేక అనుకూలతలు ఉన్నాయని వివరించారు. సంక్షేమం మాత్రమే కాకుండా అభివృద్ధి విషయంలో కూడా బిజెపి పాలిత రాష్ట్రాలకంటే భేషుగా ఉన్నామని ఇప్పటి వరకు రూ. ఐదులక్షల కోట్లు పెట్టు బడులు వచ్చాయని ఇది రావడం రావడం ఆషామాషీ విషయం కాదనీ అభిప్రాయపడ్డారు. అభివృద్ధి , సంక్షేమం ధ్యేయంగా ప్రజాపాల సాగుతోందని తెలంగాణలో అత్యధిక పార్లమెంట్,అసెంబ్లీ స్థానాలు గెలవాలనీ ఆయన ఉద్బోధించారు.బిఎల్ ఏ నియామకంలో సమర్థులను ఎంపికచేసి 2023 సీన్ రిపీట్ కావాలనీ కోరారు. క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టంగా ఉండాలంటే ఈ రోజు నుంచే బిఎల్ ఏ నియామక కార్యక్రమం మొదలుకావలనీ సూచించారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ నియోజకవర్గం స్థాయి వరకు పార్టీ సంస్థాగత బలోపేతంకు తోడ్పడే పునాదిని నియమించే అవకాశం మీకు వచ్చిందనీ దానిని సద్వినియోగం చేసుకోవాలనీ హితవు చెప్పారు. నిరంతరం పార్టీ కోసం పనిచేయాలనీ 80 శాతం సమయాన్ని పార్టీకి కేటాయించేలా చూసుకోవాలనీ మీ అందరి కర్తవ్యం అని చెప్పారు. పార్టీ నిర్మాణం త్వరలోనే తీపి కబురు కార్పొరేషన్ పదవులు భర్తీ చేయబోతున్నామని తెలిపారు.

**బిజెపి కుతంత్రానికి పగ్గాలు వేద్దాం: మీనాక్షి నటరాజన్**

తెలంగాణలో అడ్డా దారులు ద్వారా ఓట్లు తొలగించి అధికారంలోకి రావడానికి దేశవ్యాప్తంగా బిజెపి చేసే కుట్రలు తెలంగాణలో కాంగ్రెస్ శ్రేణులు కట్టడి చేయాలనీ దీనికోసం అప్రమత్తంగా ఉండాలని ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ హితవుచెప్పారు. గాంధీ భవన్ లో బిఎల్ ఏ నియామకాలు, మండల కమిటీల నియామకాలకు సంబంధించి పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించినారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ ఆయా నియోజకవర్గాల పరిస్థితికి అనుగుణంగా కార్యాచరణను వారికి ప్రత్యేకంగా ఇచ్చారు.



## నారాయణ ఎంబిఎ విభాగానికి ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్

### అకడమిక్ అడ్మినిస్ట్రేటివ్ ఆడిట్ గుర్తింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజి ఎంబిఎ విభాగం మరో ఘనతను సాధించింది. ప్రముఖ అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ హైమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికెషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్ పొందింది. సర్టిఫికెట్‌తోపాటు అకాడమిక్ అడ్మినిస్ట్రేటివ్ ఆడిట్ సర్టిఫికేషన్‌ను కూడా అందుకుని ప్రత్యేకతను చాటుకుంది. కళాశాల ఎంబిఎ విభాగం డీన్ గంగినేని ధనుంజయకు సర్టిఫికెట్లను హైమ్ సంస్థ సిఇఒ శివయ్య అందజేశారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లోనూ ప్రతిష్టాత్మక గుర్తింపు అందుకున్న అరుదైన విద్యాసంస్థగా నారాయణ ఇంజనిరింగ్ కాలేజి ఎంబిఏ విభాగం నిలిచిందన్నారు. విద్యా నాణ్యత, పరిపాలన, విద్యార్థుల సమగ్రాభివృద్ధి, పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణ వంటి అంశాల్లో నారాయణ ఇంజనీరింగ్ కాలేజి-నెల్లూరు ఎంబిఎ విభాగం విశిష్ట ప్రతిభ కనబరిచిందని కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయ శర్మ, ప్రిన్సిపల్ వి. రవి ప్రసాద్, డీన్ గంగినినే ధనుంజయ్ మాట్లాడుతూ.. నారాయణ విద్యాసంస్థలు నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని చెప్పారు. కళాశాల యాజమాన్య ప్రతినిధి వై. వినయ్ ఈ విజయం మొత్తం నారాయణ విద్యాసంస్థలకే గర్వకారణమన్నారు. అంతర్జాతీయ ప్రమాణాల సర్టిఫికెషన్ కళాశాల విద్యా నాణ్యతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

## రాష్ట్రంలో షెడ్యూల్ కులాలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలి

### బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతికిరణ్

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో షెడ్యూల్ కులాలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ పిలుపునిచ్చారు. సోమవారం భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా నూతన కార్యవర్గ సమావేశం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు నేతృత్వంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కాంతి కిరణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు సారథ్యంలో మనందరం భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి కట్టుబడి ఉండాలని, చిత్తశుద్ధితో పనిచేయాలని, శ్రేణులకు పిలుపునిచ్చారు. నాయకులందరూ చట్టసభల్లోకి వెళ్లే విధంగా వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకుంటూ, పార్టీ అభివృద్ధికి దోహదపడాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గత శాసనసభ ఎన్నికల్లో చేవెళ్లలో ఇచ్చిన ఎస్సీ డిక్లరేషన్ అమలయ్యే వరకు అవిశ్రాంత పోరాటానికి సిద్ధంగా ఉండాలని నాయకులకు పిలుపునిచ్చారు. చిన్న చిన్న సమస్యలను పట్టించుకోకుండా.. సీనియర్ నాయకులతో ఐక్యమత్యంగా ఉండి పార్టీ అభివృద్ధికి నిరంతర కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర పదాధికారులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర పదాధికారులు రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ గారిని ఘనంగా సత్కరించారు.

# రికార్డు స్థాయిలో అమ్ముడవుతున్న బీర్లు

### మార్చిలో 50.78 లక్షల కేసుల అమ్మకం

### గతేడాది మార్చితో పోలిస్తే 30 శాతం అధికం

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. చాలా ప్రాంతాల్లో 45 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో రాష్ట్రంలో బీర్ల విక్రయాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. బీర్ల ధరలు పెరిగినప్పటికీ ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు మందుబాబులు చల్లని బీర్లను తెగ తాగేసుండడంతో బీర్ అమ్మకాలుభారీగా పెరిగిపోతున్నాయి. ఫలితంగా బీర్ల విక్రయాలు రికార్డు సృష్టిస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి సమ్మర్‌లో బీర్ల సేల్స్ భారీగా పెరిగినట్లు ఎక్సైజ్‌శాఖ గణాంకాలు చెబుతున్నాయి. రానున్న కొద్ది రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశముందని, బీర్ల విక్రయాలు మరింత పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు. రానున్న డిమాండ్‌ను అంచనా వేసిన బీర్ల ఉత్పతినత కంపెనీలు కొరత రాకుండా ఉత్పత్తిని పెంచుతున్నాయి. ఈ ఏడాది మార్చిలో బీర్ల విక్రయాలు ఏకంగా 50.78 లక్షల కేసులకు చేరుకున్నాయి. గత ఏడాది మార్చిలో 39.05 లక్షల కేసులు అమ్ముడవగా ఈ ఏడాది మార్చిలో ఏకంగా 30 శాతం వృద్ధి చెందాయి. బీర్ల అమ్మకాలు పెరగడంతో ఎక్సైజ్‌శాఖకు ఆదాయం గణనీయంగా పెరుగతోంది. అటు ఐఎంఎఫ్ఎల్ మద్యం విక్రయాలు 2.5 శాతం తగ్గాయి. ఇక మార్చిలో మొత్తం విక్రయాలు రూ. 3,845 కోట్లకు చేరుకున్నాయి. అయితే ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ సేల్స్ మాత్రం స్వల్పంగా తగ్గాయి. గత ఏడాది మార్చిలో 31.46 లక్షల కేసులు అమ్ముడుపోగా ఈ సారి 30.67 లక్షల కేసులకు చేరుకున్నాయి. గత ఏడాదితో పోలిస్తే 2.5 శాతం తగ్గుదల నమోదైందని తెలుస్తోంది. ఇక ఈ ఏడాది మార్చిలో రూ.3,485 కోట్ల ఆదాయం మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వానికి రాగా గత ఏడాది రూ.3126 కోట్ల ఆదాయం వచ్చింది. ఏకంగా 11.49 శాతం వృద్ధి నమోదైంది.

# మెడికల్ టూరిజం హబ్‌గా హైదరాబాద్

### ఫోర్త్ సిటీలో అంతర్జాతీయ స్థాయిలో హెల్త్ సిటీ ఏర్పాటు

### ది హాస్పిటల్ ఆఫ్ గ్రాటిట్యూడ్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్27:** హైదరాబాద్‌లో మెడికల్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వైద్యం కోసం వచ్చే వారికోసం మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి డైరెక్ట్ గా విమానాలు హైదరాబాద్ వచ్చేలా కేంద్రాన్ని కోరామని పేర్కొన్నారు. అంతర్జాతీ స్థాయిలో హెల్త్ సీటీని ఫోర్త్ సీటీలో ఏర్పాటు చేయబోతున్నాం.. గ్రీన్ ఛానల్ ద్వారా ఆస్పత్రులకు పేషెంట్లను తీసుకువచ్చేలా ఎయిర్ పోర్టు అథారిటీతో మాట్లాడుతున్నామని తెలిపారు.సోమవారం సాయంత్రం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అపోలో హాస్పిటల్స్ 'ది హాస్పిటల్ ఆఫ్ గ్రాటిట్యూడ్' ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అపోలో హాస్పిటల్స్ యాజమాన్యం. 46 యేళ్ల క్రితం చెన్నైలో అపోలో మొదటి ఆస్పత్రి ని ప్రారంభించారు.. ప్రతాప్ రెడ్డి దేశంలో అనేక ఆస్పత్రుల ప్రారంభానికి మార్గదర్శి అయ్యారు అని చెప్పారు. అపోలో అనే పదం కోట్లాది మంది ప్రజల గుండె ధైర్యం.. సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఆపోలో యాజమాన్యాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. కోవిడ్ వ్యాక్సిన్ లు హైదరాబాద్ నుంచే ఉత్పత్తి అయ్యాయి.. 40 శాతం బల్క్ డ్రగ్స్ ను హైదరాబాద్ లో ఉత్పత్తి అవుతున్నాయన్నారు. మా మంత్రి దామోదర రాజనర్సింహా ఒక సోషల్ డాక్టర్..ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. ప్రభుత్వం పెట్టుబడులకు భద్రత కల్పిస్తుంది.. తెలంగాణ అంటే వ్యాపారం.. వచ్చి పెట్టుబడులు పెట్టండి ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహా కూడా పాల్గొన్నారు.

# భారత నావికులున్న ట్యాంకర్‌పై ఐఆర్జీసీ కాల్పులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** ఒమన్‌లోని షినాస్ ఓడరేవు సమీపంలో భారతీయ నావికులున్న ఒక రసాయన ట్యాంకర్‌పై ఇరాన్ కోస్ట్ గార్డ్ కాల్పులు జరపడంతో మరోసారి పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగాయి. టోగో దేశ జెండాతో ప్రయాణిస్తున్న ఎంటీ సైరన్ అనే ఈ ట్యాంకర్‌లోకి కొందరు వ్యక్తులు ప్రవేశించినట్లు కేంద్ర నౌకాయానశాఖ తెలిపింది. ఈనెల 25న ఈ ఘటన జరిగిందని, ఆ సమయంలో ఆ నౌక సమీపంలో ఇతర నౌకలు కూడా ఉన్నాయని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మందీప్ సింగ్ రణధావా తెలిపారు. పశ్చిమాసియాలో తాజా పరిణామాలపై జరిగిన అంతర్‌మంత్రిత్వ శాఖల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ఇరాన్ కోస్ట్ గార్డ్ హెచ్చరికగా ఈ కాల్పులు జరిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో భారత నావికుల భద్రత, నౌకల కార్యకలాపాల కొనసాగింపు కోసం విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో కలిసి నిరంతరం సమన్వయం చేసుకుంటున్నామని రణధావా వివరించారు. డీజీ షిప్పింగ్ కంట్రోల్ రూమ్ ఇప్పటివరకు 7,780 కాల్స్, 16,650 ఈమెయిళ్లను స్వీకరించిందని, 2,770 భారత నౌకలతో సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. "ప్రస్తుతానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో ఇరాన్ నుంచి ఇటువంటి దాడులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఈనెల 22న భారత్‌లోని ముంద్రా పోర్టుకు వస్తున్న ఒక నౌకపైనా, అలాగే 18న హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు భారత నౌకలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. ఈ ఘటనలపై భారత్ అప్పట్లోనే ఇరాన్‌కు తీవ్ర నిరసన తెలిపింది.

# బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా ఎన్.రాంచందర్‌రావు జన్మదిన వేడుకలు

**హైదరాబాద్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు జన్మదిన వేడుకలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ప్రజా సేవే లక్ష్యంగా సాగుతున్న ఆయన ప్రస్థానంలో భాగంగా, ఈ పుట్టినరోజును పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు మరియు పార్టీ శ్రేణుల మధ్య సంబరాలు మిన్నంటాయి. సికింద్రాబాద్‌లోని తార్నాక ప్రాంతంలోని వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరం పార్టీ శ్రేణుల సమన్వయంతో విజయవంతంగా జరిగింది. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు మరియు ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎన్.గౌతం రావు, రాష్ట్ర కార్యదర్శులు ఓ.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులు, బిజెపి సీనియర్ నాయకులు మనోహర్ రెడ్డి, ఇతర నాయకులు, పార్టీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తిరుమల పర్యటనలో ఉన్న రాంచందర్ రావు తన జన్మదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శుభాకాంక్షలు తెలిపిన వారికి, సేవా కార్యక్రమాలు నిర్వహించిన కార్యకర్తలకు, వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# టెన్త్ బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన వైస్‌ప్రిన్సిపల్‌కు రిమాండ్

**హైదరాబాద్ (సికిందరాబాద్), ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** పదవ తరగతి చదువుతున్నమైనర్ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పాఠశాల వైస్ ప్రిన్సిపల్‌పై వారాసిగూడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు తరలించారు. రాంనగర్‌లోని గౌతమి హైస్కూల్లో తొమ్మిదవ తరగతి పూర్తి చేసుకుని పదవ తరగతికి చేరుకున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. ప్రత్యేక తరగతులు తీసుకుంటున్న సమయంలో ఓ మైనర్ విద్యార్థిని పట్ల వైస్ ప్రిన్సిపల్ సాయి ఏప్రిల్ 24న అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక ఈ విషయాన్ని తోటి విద్యార్థికి వాట్సప్ ద్వారా తెలియజేసింది. బాలిక సోదరుడు ఆమె ఫోన్ ను పరిశీలించగా విషయం బయటపడింది. విద్యార్థిని తల్లితండ్రులు బంధువులతో పాటు పాఠశాలకు వెళ్లి వైస్ ప్రిన్సిపల్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వారాసిగూడ పోలీసులు విచారణ జరిపి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు తరలించారు.

# రాష్ట్రంలో బంకుల ఎదుట భారీ క్యూలు

- వాహనాలతో గంటల తరబడి పడిగాపులు
- చాలాచోట్ల నో స్టాక్ బోర్డుతో హడావిడి కొనుగోళ్లు
- ఫుల్ ట్యాంకుతోపాటు క్యాన్లలో అదనంగా కూడా..
- తెలంగాణలోనూ ఎపి తరహా ఇంధన కొరత పరిస్థితులు

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెట్రో, డిజిల్ కొరతపై పౌరసరఫరాలశాఖ చేస్తున్న ప్రకటనలకు పూర్తి విరుద్ధంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు నెలకొంటున్నాయి. పెట్రో, డిజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని పౌరసరఫరాలశాఖ వరుసగా రెండోరోజు స్పష్టత ఇచ్చినా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో పెట్రోల్ బంకుల్లో మాత్రం సోమవారం కూడా నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇప్పటి వరకు పొరుగు రాష్ట్రం ఏపిలోనే పెట్రో, డిజిల్ కొరత సమస్య ఉండగా తాజాగా తెలంగాణలోనూ క్షేత్రస్థాయిలో అదే పరిస్థితి కనిపిస్తుండటం వాహనదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పెట్రోల్ బంక్‌ల వద్ద నో స్టాక్ అనే బోర్డులు ఏర్పాటు దర్శనమిస్తుండడంతో స్టాక్ ఉన్న బంక్‌ల వద్ద వాహనదారులు కిలోమీటర్ల మేర బారులు తీరుతున్నారు. పలు పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తుండడంతోపాటు సోషల్ మీడియాలో వదంతులతో హైదరాబాద్ నగరంతోపాటు పలు జిల్లాల్లోనూ వాహనదారులు ఒకేసారి బంకుల వద్దకు రావడంతో "ప్యానిక్ బయింగ్" (భయంతో కొనుగోలు చేయడం) పరిస్థితులు నెలకొన్నాయి. రానున్న రోజుల్లో పెట్రోల్, డీజిల్ దొరకదనే వదంతులతో వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో డబ్బాలు, డ్రమ్ముల్లో బంక్‌ల నుంచి ఇందనం తీసుకువెళ్తున్న వారి సంఖ్య పెరిగిపోయింది. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ఇందన సరఫరా నిలిచిపోనుందన్న ఆందోళనతో చాలా మంది వాహనదారులు తమ బైకుల్లో 200 నుంచి 300 రూపాయల పెట్రోల్‌కు బదులు ఫుల్ ట్యాంక్ చేయించుకుంటున్నారు. ప్రజలు పనులు మానుకుని మరి భవిష్యత్ అవసరాల కోసం పెద్ద ఎత్తున ఇందనాన్ని కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెట్రోల్ బంకుల్లో స్టాక్ ఒక్కసారిగా ఖాళీ అవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఏపిలో మాదిరిగానే తెలంగాణలోనూ ఇందన కొరత పరిస్థితులు కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌తోపాటు జిల్లాల్లో ఏ బంకుకు వెళ్లినా కిలోమీటర్ మేర క్యూలు , గంటలకొద్దీ పడిగాపులు వాహనదారులకు తప్పడం లేదు. పెట్రోల్ బంకుల వద్ద పెద్ద సంఖ్యలో వాహనదారుల రద్దీ పెరగడంతో కొన్ని చోట్ల పోలీసుల బందోబస్తు మధ్య పెట్రో, డిజిల్ పోస్తుండడం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్రంలో పెట్రోల్‌తో పోలిస్తే డీజిల్ కొరత ఎక్కువగా కనిపిస్తోంది. చాలా చోట్ల కేవలం పెట్రోల్ మాత్రమే అందుబాటులో ఉందని డీజిల్ స్టాక్ లేదని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో డీజిల్ స్టాక్ ఉన్న బంకుల ఎదుట వినియోగదారులు వాహనాలతో క్యూ కడుతున్నారు.

### తెలంగాణ సరిహద్దు జిల్లాల బంకుల్లో ఏపి వాహనదారులు క్యూ

ఏపిలో పెట్రోల్, డిజిల్ కొరతతో సరిహద్దుల్లోని తెలంగాణ పెట్రోల్ బంకుల్లో ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. అక్కడి వినియోగదారులు తెలంగాణలోని బంకుల్లో ఇందన కొనుగోళ్లకు క్యూ కడుతున్నారు. ఏపితో సరిహద్దు పంచుకుంటున్న తెలంగాణ జిల్లాల్లోని పెట్రోల్ బంకుల్లో చోట్ల ఇందన నిల్వలు ఒక్కపూటలోనే అయిపోతున్నాయి. ఇదే అదనుగా సూర్యాపేట, నల్గొండ, గద్వాల్, వనపర్తి, ఖమ్మం, కొత్తగూడెం తదితర జిలాల్లో కొందరు బంకు యజమానులు రేట్లు పెంచి సొమ్ము చేసుకంటున్నారు. భారీగా కొనుగోళ్లు జరుగుతుండడంతో పలు పెట్రోల్ బంకుల్లో నోస్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి.

### రేషన్ పద్ధతిలో పెట్రోల్, డిజిల్ విక్రయాలు..

పెట్రోల్ బంకుల్లో ఇంధన లభ్యత తక్కువగా ఉండటంతో యాజమాన్యాలు వాహనాల రకాన్ని బట్టి రేషన్ పద్ధతిని అమలు చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు, బైక్‌లు, స్కూటర్లకు కేవలం రూ. 200 విలువైన పెట్రోల్‌ను మాత్రమే పోస్తున్నారు. నాలుగు చక్రాల వాహనాలకు గరిష్టంగా రూ. 1,000 వరకు మాత్రమే ఇంధనాన్ని నింపుతున్నారు. ప్లాస్టిక్ బాటిళ్లు, పెద్ద డబ్బాలు లేదా క్యాన్లలో పెట్రోల్ నింపడాన్ని పూర్తిగా నిషేధించారు. అత్యవసర పరిస్థితుల పేరుతో వచ్చే వారికి కూడా ఇంధనం నింపే ప్రసక్తే లేదని బంకు యజమానులు కరాఖండీగా చెబుతున్నారు.హైదరాబాద్‌లో మళ్లీ పెట్రోల్, డీజిల్ కొరతపై పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేంద్రం చెప్పినా ఆయిల్ కంపెనీలు క్రెడిట్ ఫెసిలిటీ ఇవ్వడం లేదన్నారు.



### సమృద్ధిగా ఇందన నిల్వలు : పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని, రాష్ట్ర వ్యాప్తంగా చమురు, ఎల్పీజీ గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని పౌర సరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దన్నారు. ప్రస్తుతం తెలంగాణలో మరో 70 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని, కేవలం పెట్రోల్, డీజిల్‌తోపాటు వంట గ్యాస్ సరఫరాలో కూడా ఎటువంటి అంతరాయం లేదని వివరించారు. సోషల్ మీడియాలో తప్పుడు వదంతులను నమ్మొద్దని, పెట్రోల్ నిల్వలను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయించే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అగ్ని ప్రమాదాల దృష్ట్యా బాటిళ్లలో పెట్రోల్ విక్రయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.

# వెనుకబడిన రూఫ్‌టాప్ సోలార్

### ఇప్పటి వరకూ 800 మెగావాట్లకే పరిమితం

### కేవలం 32,600 మాత్రమే ఇన్‌స్టాలేషన్‌లు

### అడ్డుపడుతున్న విద్యుత్ పంపిణీ సంస్థలు

### రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల గ్రిడ్‌కనెక్టెడ్ లక్ష్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** రూఫ్‌టాప్ సోలార్ వినియోగాన్ని అందుబాటులోకి తేవడంలో తెలంగాణ వెనుకబడిపోయింది. రాష్ట్రంలో తమ ఆదాయం పడిపోతుందనే ఉద్దేశ్యంతో విద్యుత్ పంపిణీ సంస్థలు అడ్డుపుల్లలు వేయడం, బ్యాంకులు రుణాలు మంజూరు చేయకపోవడంతో పాటు, సౌర విద్యుత్ పట్ల తగినంత ప్రచారం లేకపోవడం, ప్రజల్లో అవగాహన కల్పించడంలో వైఫల్యం చెందడం తదితర కారణాలతో రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ల ఏర్పాటు పట్ల ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు బాధ్యతలను తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (రెడ్కో)కు ప్రభుత్వం అప్పగించింది. రాష్ట్ర అధికారవర్గాల వివరాల ప్రకారం పీఎంకుసుమ్ పథకం కింద, తెలంగాణలో 500 కిలోవాట్ల నుండి 2 మెగావాట్ల వరకు సామర్థ్యం గల 4,000 మెగావాట్ల గ్రిడ్‌కనెక్టెడ్ సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే రాష్ట్రంలో ఇప్పటివరకు 800 మెగావాట్లకు పైగా రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను మాత్రమే ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ముందుకు సాగడం లేదు. రూఫ్‌టాప్ సోలార్‌ను ప్రోత్సహించడానికి ఫిబ్రవరి 2024లో ప్రారంభించిన ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం కింద తెలంగాణలో ఇంత వరకూ కేవలం 32,600 ఇన్‌స్టాలేషన్‌లు మాత్రమే నమోదయ్యాయి. దీనికి భిన్నంగా, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో 1.1 లక్షలకు పైగా సోలార్ రూఫ్ టాప్ ఇన్‌స్టాలేషన్లు చేయగా, బెంగళూరు, చెన్నైలలో చెరో నాలుగు లక్షలకు పైగా ఇన్‌స్టాలేషన్‌లు జరిగాయి. ?ఇతర రాష్ట్రాల్లో కొత్త సౌరశక్తి డిమాండ్‌లో 50 నుండి 60 శాతం వరకు ఇప్పుడు నివాస గృహాల విభాగం నుండే వస్తోంది. వాణిజ్య సంస్థల వాటా 25 నుండి 30 శాతం వరకు ఉండగా, పెద్ద సిస్టమ్ సామర్థ్యాలతో కూడిన పారిశ్రామిక సంస్థలు 10 నుండి 15 శాతం వరకు వాటాను అందిస్తున్నాయి.

రూఫ్ టాప్ సోలార్‌తో ఆర్థిక ప్రయోజనాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, ప్రచారం లేకపోవడం ఒక ప్రధాన లోపంగా మిగిలిపోయిందని చెబుతున్నారు. 3 కిలోవాట్ల రూఫ్‌టాప్ సిస్టమ్ రోజుకు సుమారు 15 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలదు. దీనివల్ల ఏసీ ఉన్న గృహాలకు వేసవిలో విద్యుత్ బిల్లులు రూ.1,800 నుండి రూ.2,000 వరకు, ఇతర సీజన్లలో రూ.200 నుండి రూ.500కు తగ్గుతాయి. అంతే కాకుండా గృహాల్లో వినియోగించే సోలార్ విద్యుత్ పోను మిగిలిన దానిని అమ్ముకోవడం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది. గ్రిడ్‌కు ఎగుమతి చేసే అదనపు విద్యుత్‌పై యూనిట్‌కు 58 పైసల చొప్పున ఆదాయం వస్తుంది. దీనివల్ల సోలార్ కేవలం పర్యావరణానికే కాకుండా ఆర్థికంగా కూడా ప్రయోజనకరంగా ఉంటుందని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇక రూఫ్ టాప్ సోలార్ ప్యానల్ ఏర్పాటుకు కేంద్రం గణనీయ సబ్సిడీని అందిస్తోంది.

నివాస గృహాలకు 2 కిలోవాట్ వరకూ రూ.30 వేలు, అదనపు సామర్థ్యంపై కిలో వాట్‌కు రూ.18 వేల చొప్పున గరిష్టంగా రూ.78 వేల వరకూ సబ్సిడీని ఇస్తోంది. సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు విద్యుత్ పంపిణీ సంస్థలు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కరెంట్ వినియోగం ద్వారా బిల్లుల కింద వచ్చే ఆదాయం కోల్పోతామనే ఉద్దేశ్యంతో పంపిణీ సంస్థలు అడ్డుపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

# మే 1 నుంచి థియేటర్ల మూసివేత

### మరోసారి ఎగ్జిబిటర్ల అల్టిమేటం

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లలో పర్సంటేజీ విధానం అమలు చేయాలని, లేదంటే మే 1 నుంచి థియేటర్లు మూసివేస్తామని ఎగ్జిబిటర్లు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లకు మరోసారి అల్టిమేటం ఇచ్చారు. ప్రస్తుతం రెంటల్ విధానంతో నష్టపోతున్నామని, మల్టీప్లెక్సుల్లో అమలు చేస్తున్నట్లే తమకూ పర్సంటేజీ విధానం వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏప్రిల్ 30 లోగా నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు నిలిపివేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని టికెట్ ధరల నియంత్రణ, పన్నులు, విద్యుత్ చార్జీలపై సడలింపు ఇవ్వాలని కోరుతున్నారు. కాగా హైదరాబాద్‌లోని 23 థియేటర్లలో పర్సెంటేజీ విధానాన్ని ప్రయోగాత్మకంగా ఎగ్జిబిటర్ల సంఘం అమలు చేస్తోంది.

ఈ ప్రతిపాదన ప్రకారం సినిమా విడుదలైన తొలి వారం వసూళ్లు అయిన ఆదాయంలో 60 శాతం, రెండో వారం 50 శాతం, మూడో వారం 40 శాతం చొప్పున థియేటర్లకు వాటా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం థియేటర్లకు ఉన్న ఫిక్స్‌డ్ అద్దె విధానం వల్ల సింగిల్ స్క్రీన్ థియేటర్లు తీవ్రంగా నష్టపోతున్నాయని ఎగ్జిబిటర్లు అంటున్నారు. పెద్ద సినిమాలు ఆడినా, ఆడకపోయినా నిర్వహణ ఖర్చులు భారం అవుతున్నాయని, అందుకే మల్టీప్లెక్స్ తరహా షేరింగ్ పద్ధతే మంచిదని తేల్చిచెబుతున్నారు. అయితే ఎగ్జిబిటర్లు చేసిన పర్సంటేజ్ ప్రతిపాదనలను ప్రొడ్యూసర్స్ గిల్డ్ ససేమిరా అంటోంది. థియేటర్లకు భారీగా పర్సెంటేజీలు ఇవ్వడం కుదరదని, ఇది నిర్మాతలపై అదనపు భారం మోపడమేనని నిర్మాతల గిల్డ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

# పద్మపురస్కారాల దరఖాస్తుల గడువుతేదీ జూలై 31

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** దేశంలో అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డులకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖగడువుతేదీని ప్రకటించింది. 2027 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రదానం చేసే పద్మ అవార్డుల కోసం నామినేషన్లు లేదా సిఫార్సులు పంపేందుకు జూలై 31వ తేదీని తుది గడువుగా సోమవారం వెల్లడించింది. ఈ ఏడాది మార్చి 15న ప్రారంభమైన ఈ ప్రక్రియలో భాగంగా, నామినేషన్లను కేవలం రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించనున్నట్లు స్పష్టం చేసింది. దేశంలో పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అత్యంత గౌరవప్రదమైన పురస్కారాలుగా గుర్తింపు పొందాయి. నామినేషన్లు పంపేవారు సంబంధిత వ్యక్తి సాధించిన అసాధారణ విజయాలు, సేవలను



వివరిస్తూ గరిష్ఠంగా 800 పదాలకు మించకుండా ఒక సైటేషన్ జతచేయాలని హోం శాఖ సూచించింది. పద్మ అవార్డులను 'ప్రజల పద్మ' (పీపుల్స్ పద్మ)గా మార్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని, కాబట్టి పౌరులందరూ తమను తాము నామినేట్ చేసుకోవడంతో పాటు ఇతరులను కూడా సిఫార్సు చేయవచ్చని తెలిపింది. సమాజంలో నిస్వార్థ సేవ చేస్తున్న మహిళలు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులు వంటి వారిని గుర్తించి నామినేట్ చేయాలని ప్రభుత్వం కోరింది. ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు సహా ప్రభుత్వ సేవకులు ఈ అవార్డులకు అర్హులు కారని, వైద్యులు, శాస్త్రవేత్తలకు దీని నుంచి మినహాయింపు ఉందని స్పష్టం చేసింది. 1954లో ప్రారంభమైన ఈ పురస్కా రాలను ఏటా గణతంత్ర దినోత్సవం నాడు ప్రకటిస్తారు.

బొగ్గు బకాయిలు రూ.46 వేల కోట్లకై..

# సంస్థను కాపాడుకోవడమే ప్రధాన లక్ష్యం

### నేడు విద్యుత్ ట్రాన్స్‌కో వద్ద సింగరేణి కార్మికుల ఆందోళన

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త** సింగరేణిని పరిరక్షించుకోవడం అనే విషయంపై కార్మికులు దృష్టిసారించారు. ఇప్పటికే ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ప్రతిష్టాత్మక సింగరేణి కాలరీస్ దాని మనుగడపై నీలి నీడలు వ్యాపించాయి. ?ఇందుకు ప్రధానంగా సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు విద్యుత్ ఉత్పాదక సంస్థ (జెన్కో), విద్యుత్ ట్రాన్స్‌మిన్ కార్పొరేషన్ (ట్రాన్స్కో)లు బొగ్గు వినియోగించుకున్నందుకు గాను బిల్లులు చెల్లించకపోవడంతో అవి కోట్లాది రూపాయల మేర మొండి బకాయిలుగా ఏటా పేరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే డిసెంబర్ 2025వరకే తెలంగాణ విద్యుత్ సంస్థలు రూ.46వేల కోట్లకు పైగా బాకాయిపడ్డట్టు సింగరేణి అధికారికంగా ప్రకటించింది. ఇందులో జెన్కో నుంచి రూ.18,828కోట్లు, ట్రాన్స్కో నుండి రూ.27,378 కోట్లు సింగరేణికి బకాయి పడ్డాయి. ఈ మొత్తం రూ.46వేల కోట్లతో పాటు, ప్రస్తుత ఏడాది జనవరి నుండి ఇంత వరకూ బకాయిలు రూ.50వేల కోట్ల మేరకు చేరుకున్నాయి. మరోపక్క సింగరేణి సంస్థ నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వ చేతులో ఉండడం మూలంగా సింగరేణి అధికారులు విద్యుత్ సంస్థలను ఒత్తిడి చేయలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ బకాయిలు వసూలు కాని కారణంగా సింగరేణి ప్రతి నెల బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే అప్పుల కోసం ప్రయత్నాలు చేస్తున్న సింగరేణి ఈ పరిస్థితులు కొనసాగించే క్రమంలో సంస్థ మనుగడనే ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని కార్మికవర్గం ఆందోళనకు గురవుతున్నది. ఈ క్రమంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఈనెల 28న హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు పిలుపునిచ్చింది. సింగరేణిలోని 11డివిజన్ల నుంచి ఈ నిరసనకు కార్మికవర్గం హాజరు కావాలని కోరింది. సింగరేణి సంస్థకు సంబంధించిన రూ.50వేల కోట్ల బాకాయిలను వసూలు చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతమాత్రం శ్రద్ధ చూపకపోవడం, కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించకపోవడం కూడా సింగరేణికి నష్టం కలిగించే విధంగా పరిణమించినట్లు కార్మికులు చెబుతున్నారు.

# మిజోరం అభివృద్ధిపై ప్రతిపాదనలు పంపండి

### సరిహద్దుల వద్ద నిఘాను మరింత కట్టుదిట్టం చేయండి

### డ్రగ్స్, ఆయుధ అక్రమ రవాణాను పూర్తిగా నియంత్రించండి

### ఆయిల్ పాం, టూరిజం రంగాలపై దృష్టి సారించండి

### మిజోరంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ సమీక్ష

**హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** పర్వత వాసుల నిలయమైన మిజోరాం రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కేంద్ర బడ్జెట్ లో 10 శాతం నిధులను ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా రోడ్డు, రైల్వే, ఎయిర్, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదనలు పంపాలని కోరారు. ముఖ్యంగా బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలతో మిజోరాం 722 కి.మీల సరిహద్దు కలిగి ఉన్నందున, ఆయా దేశాల సరిహద్దుల నుండి మిజోరాం మీదుగా డ్రగ్స్, అక్రమ ఆయుధాల సరఫరా జరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. డ్రగ్స్, అక్రమ ఆయుధాలు దేశం లోపలికి రాకుండా ఉక్కుపాదం మోపేలా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా మిజోరాం విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తొలుత మిజోరాం రాష్ట్ర సచివాలయానికి వెళ్లి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డిజిపితోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో హోంసహా కేంద్ర మంత్రిత్వ శాఖలకు సంబంధించి అమలవుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్య పథకాల అమలు తీరు, ఎదురవుతున్న అడ్డంకులు, అధిగమించేందుకు కేంద్రం పక్షాన చేపట్టాల్సిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. 10 లక్షలకుపైగా జనాభా కలిగిన మిజోరాం స్థూల జాతీయోత్పత్తిలో 0.1 శాతం మాత్రమే వాటా కలిగి ఉందని, రాష్ట్రంలో 85.41 శాతం అటవీ భూమితో దేశంలో అత్యధిక అటవీ కలిగిన ప్రాంతమని, రాష్ట్ర భౌగోళిక ప్రాంతంలో 57 శాతం వెదురు అడవులతో కప్పబడి ఉందని అధికారులు తెలిపారు.

98.02 శాతం అక్షరాస్యతతో ముందంజలో ఉందన్నారు. రోడ్డు, రైలు కనెక్టివిటీ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, పర్యాటకుల రాక ఇబ్బందిగా మారిందని తెలిపారు. ప్రకృతి అందాలు, సాంస్కృతిక మిజోరాం సొంతమని, రోడ్డు, రవాణా సౌకర్యాలు మెరుగుపరిస్తే పర్యాటక రంగం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా ద్వారా ఆదాయాన్ని సమకూర్చవచ్చని వివరించారు. ఆయిల్ పాం, సరిహద్దు గ్రామాల అభివృద్ధి, విద్య, వైద్యం, హోం శాఖలపై కేంద్ర మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. 2026 నాటికి మొత్తం 3.28 లక్షల హెక్టార్లలో ఆయిల్ పాంను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ నేటి వరకు 2400 హెక్టార్లలో మాత్రమే సాగవుతుండటంపట్ల కేంద్ర మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెదురు, ఆయిల్ పాం, హ్యాండ్లూం ఉత్పత్తులతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని ఎంతో మందికి ఉపాధి కల్పించడంతోపాటు రాష్ట్రానికి ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలున్నప్పటికీ... ఆ దిశగా ఆశించిన స్థాయిలో పురోగతి కన్పించడం లేదని తెలిపారు.

అధికారుల విజ్ఞప్తి మేరకు మిజోరాంలో రోడ్డు, రైలు, ఎయిర్, టెలికమ్యూనికేషన్ కనెక్టివిటీ పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని చెప్పిన కేంద్ర మంత్రి అందుకోసం శాస్త్రీయ ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు. సమీక్ష అనంతరం మిజోరాం గవర్నర్ లెఫ్టినెంట్ కల్నల్ వికె సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. మిజోరాం అభివృద్ధి, కేంద్ర పథకాల అమలు తీరుపై కాసేపు చర్చించారు. అంతకుముందు మిజోరాం రాష్ట్ర పోలీసులకు డిజిపి ఇచ్చిన తేనీటి విందులో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు మంజూరు నిరంతర ప్రక్రియ

### నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ప్రతినిధులతో మంత్రి పొంగులేటి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఏప్రిల్27:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని మరింత వేగవంతంగా , పారదర్శకంగా అమలు చేయడానికి అధికార వికేంద్రీకరణ చేసి జిల్లా కలెక్టర్లకు మరిన్ని బాధ్యతలు అప్పగిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా హౌసింగ్ అధికారులతో ప్రతి వారం సమీక్షించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని, ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా చూడటానికి ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు వెల్లడించారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై సోమవారం నాడు హైదరాబాద్ లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల జిల్లాల ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా హౌసింగ్ , రెవెన్యూ అంశాలపై లోతైన సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు ప్రస్తావించిన అంశాలపై అక్కడికక్కడే స్పందించి తగిన ఆదేశాలు ఇచ్చారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణం నిరంతరం ప్రక్రియ.




# శతకొట్టేదెవరు?

## నేడు పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ ఢీ

**ఢిల్లీ క్యాపిటల్స్ 265 రన్స్**
**సన్‌రైజర్స్ హైదరాబాద్ 220 రన్స్**
**చెన్నై సూపర్ కింగ్స్ 210 రన్స్**
**ముంబై ఇండియన్స్ 196 రన్స్**
**గుజరాత్ టైటాన్స్ 166 రన్స్**
**లక్నో ముందు 255 రన్స్**

పైవన్నీ స్కోర్లన్నీ పంజాబ్ కింగ్స్ ముందు ఆయా జట్లు ఉంచిన టార్గెట్‌లు. వీటన్నింటిని శ్రేయాస్‌సేన ఉఫ్ మనిపించింది.ఇక ఢిల్లీ క్యాపిటల్స్ ఉంచిన 265 రన్స్ లక్ష్యాన్ని కూడా ఊదేసి రికార్డు సృష్టించింది. ఈ ఐపీఎల్ సీజన్‌లో చేజింగ్ టీమ్‌గా పంజాబ్ కింగ్స్ అవతరించింది. పోనీ మేమే టార్గెట్ నిర్ణయిస్తాం మీరు ఊదేయండి అన్న తరహాలో లక్నో జూపర్ జెయింట్స్ ముందు ఏకంగా 255 రన్స్ లక్ష్యం నిర్దేశించింది. దీన్ని చేధించడంలో లక్నో చతికిలపడింది. ఇపుడు రాజస్థాన్ రాయల్స్ వంతు. పంజాబ్‌కు కళ్లెం వేస్తుందా?



**చండీఘడ్:** మొత్తానికి ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ అద్భుతమైన ఫామ్‌తో దూసుకుపోతోంది. ప్రస్తుతానికి ఆ జట్టును ఆపడం ఇతర జట్లకు కష్టంగా మారింది.ఈసీజన్‌లో పంజాబ్ కింగ్స్ ఇప్పటివరకు ఆడిన మ్యాచ్‌ల్లో ఓటమి ఎరగకుండా దూసుకుపోతోంది. 6 మ్యాచ్‌ల్లో గెలుపొందగా, ఒక మ్యాచ్ వర్షార్పణం అయింది. 13 పాయింట్లతో టాప్ పొజిషన్‌లో ఉంది. గత ఏడాది తృటిలో చేజారిన ఐపీఎల్ ట్రోఫీని ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ అందుకోవడమే లక్ష్యంగా దూసుకుపోతోంది.

ఆర్సీబీ, ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ వంటి బలమైన జట్లపై కూడా పంజాబ్ సులభంగా విజయం సాధించింది. శ్రేయాస్ కెప్టెన్సీలో పంజాబ్ కింగ్స్ జట్టులో సరికొతనత ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. సర్పంచ్ సాబ్‌గా జట్టును విజయపథంలో నడిపిస్తున్నాడు. జట్టులోని వనరులను చక్కగా ఉపయోగించుకుంటున్నాడు. ముఖ్యంగా ఓపెనర్లు ప్రభ్‌సిమ్రాన్ సింగ్, ప్రియాన్ష్ ఆర్య అందిస్తున్న విధ్వంసకర ఆరంభాలే జట్టు విజయాల్లో కీ రోల్ పోషిస్తున్నాయి. ఎంతలా అంటే డీసీపై పవర్ ప్లే ఆరు ఓవర్లలోనే 116 రన్స్ సాధించారు. ఆతర్వాత వచ్చే కూపర్ కానోలీ, శ్రేయాస్ అయ్యర్, నేహాల్ వదేరా, స్టోయినోస్ వరకు అందరూ విధ్వంకరంగా ఆడుడూ భారీ స్కోర్లు సాధిస్తున్నారు.

ఈ క్రమంలో నేడు పంజాబ్ కింగ్స్‌తో రాజస్థాన్ రాయల్స్ తలపడుతోంది. శ్రేయాస్ సేనను రాయల్స్ అడ్డుకుంటుందా? పంజాబ్ కు తొలి ఓటమి రుచి చూపిస్తుందా? లేదా యాధావిధిగా పంజాబ్ ఖాతాలో ఏడో విజయం చేరుతుందా? అన్నది ఆసక్తిగా మారింది. తమ విజయ పరంపరను



కొనసాగించి, ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత పటిష్టం చేసుకోవడంపై పంజాబ్ కింగ్స్ ఫోకస్ పెట్టింది. మరోవైపు, ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో ఐదు విజయాలతో నాలుగో స్థానంలో ఉన్న రాజస్థాన్ రాయల్స్... పుంజుకుని విజయాల బాట పట్టాలని ఉవ్విళ్లూరుతోంది.

పంజాబ్ ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్... రాజస్థాన్ ఓపెనర్లు సెంచరీ హీరో వైభవ్ సూర్యవంశీ, యశస్వీ జైసాల్ పోరు ఆసక్తి రేపుతోంది. ఈ నలుగురిపైనే మ్యాచ్ ఫోకస్ అంతా. ఇక ఈ పోరులో పేసర్ జోఫ్రా ఆర్చర్ కీలక బౌలర్ కావచ్చు. అతను ఎనిమిది మ్యాచ్‌లలో 17.92 అద్భుతమైన సగటుతో 13 వికెట్లు పడగొట్టి, ఈ సీజన్‌లో తన ప్రభావాన్ని చాటుకున్నాడు. అతని బౌలింగ్, ముఖ్యంగా పవర్‌ప్లే సమయంలో, ఆట గమనాన్ని మార్చడంలో కీలకం కానుంది. ఒకవేళ ఆర్చర్ ఆరంభంలోనే వికెట్లు తీస్తే, అతను పంజాబ్ కింగ్స్‌పై ఒత్తిడి పెంచి, రాజస్థాన్ రాయల్స్‌కు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించగలడు.

**హెడ్ టు హెడ్ రికార్డ్ :** ఇరుజట్లు 30 మ్యాచ్‌ల్లో తలపడగా, రాజస్థాన్ రాయల్స్ ఆధిక్యం చాటింది. పంజాబ్ కింగ్స్ 13 మ్యాచ్‌ల్లో, రాజస్థాన్ రాయల్స్ 17 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. చివరి సారి తలపడినపుడు పంజాబ్ కింగ్స్ నెగ్గింది.

**తుది జట్లు(అంచనా) : పంజాబ్ కింగ్స్:** ప్రభ్‌సిమ్రాన్ సింగ్, ప్రియాంష్ ఆర్య, కూపర్ కానోలీ, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), శశాంక్ సింగ్, మార్కస్ స్టోయినిస్, మార్కో జాన్సెన్, జేవియర్ బార్ట్‌లెట్, విజయ్‌కుమార్ వైషాక్, అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్; **ఇంపాక్ట్ ప్లేయర్:** నేహాల్ వధేరా

**రాజస్థాన్ రాయల్స్:** యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్ (కెప్టెన్), హెట్మెయర్, ఫెరీరా, రవీంద్ర జడేజా, ఆర్చర్, దేశ్‌పాండే, బర్గర్, బ్రిజేష్ శర్మ, బిష్ణోయ్; **ఇంపాక్ట్ ప్లేయర్:** సూర్యవంశీ.




# ఢిల్లీని కుప్పకూల్చిన హాజిల్, భువీ

**ఢిల్లీ:**శనివారం బౌలర్లకు బ్లాక్ డేగా నిలిస్తే... సోమవారం బ్యాట్స్‌మెన్‌వంతయింది. తమ సొంత మైదానంలోనే గత మ్యాచ్‌లో 264పరుగులు కొట్టిన ఢిల్లీ క్యాపిటల్... సోమవారం మాత్రం బ్యాటింగే చేతకాదన్నట్టు పెవిలియన్‌కు క్యూ కట్టారు. భువనేశ్వర్, హాజిల్‌వుడ్ ఫాస్ట్ బౌలింగ్‌కు 75 పరుగులకు కుప్పకూలింది.ఈస్వల్ప లక్ష్యాన్ని ఆర్సీబీ ఒక వికెట్ కోల్పొయి 6.3 ఓవర్లలోనే చేధించింది. తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం అందుకుంది. జాకెబ్ బెతెల్(20) అవుటైనా... విరాట్ కోహ్లి(15 బంతుల్లో 23), దేవదత్ పడిక్కల్(13 బంతుల్లో 34) అజేయంగా నిలిచి ఆర్సీబీకి మరో విజయాన్ని ఖాయం చేశారు.




టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఆర్సీబీ ఆరంభ పేస్ అటాక్ భువనేశ్వర్, హాజిల్ వుడ్ వణికించారు. ఇన్నింగ్స్ రెండో బంతికే సాహిల్(0)ను భువీ క్లీన్ బౌల్డ్ చేసి వికెట్ల పతనానికి నాంది పలికాడు.ఫ్రెష్ ఓవర్‌తో వచ్చిన హాజిల్‌వుడ్ ...తొలి బంతికే గత మ్యాచ్ సెంచరీ హీరో రాహుల్(1)ను,రెండో బంతికి రిజ్వీ(0)ని పెవిలియన్‌కు పంపాడు.ఇకమూడో ఓవర్ తొలి బంతికి స్టబ్స్(5)ను, నాలుగో బంతికి అక్షర్‌పటేల్(0)ను వెంట వెంటనే అవుట్ చేశాడు. మరో ఎండ్‌లో హాజిల్ వుడ్... నితీష్ రాణా(1) పనిపట్టడంతో నాలుగో ఓవర్‌కే ఢిల్లీ క్యాపిటల్స్ 8 రన్స్‌కే 6 వికెట్లు కోల్పోయింది. కాసేపు వికెట్ల పతనాన్ని అభిషేక్(30),డేవిడ్ మిల్లర్(19) అడ్డుకున్నారు. ఏడో వికెట్‌కు 35 రన్స్ జోడించారు. అయితే మిల్లర్‌ను రసిఖ్ అవుట్ చేయడంతో మరోసారి వికెట్లపతనం వేగమందుకుంది. జెమిసన్(12)ను కృనాల్, కుల్‌దీప్(3)ను సుయాష్ అవుట్ చేశారు. మరోసారి బౌలింగ్‌కు వచ్చిన హేజిల్‌వుడ్.. చక్కని ఇన్ స్వింగ్‌తో అభిషేక్‌ను బౌల్డ్ చేయడంతో ఢిల్లీ 75 పరుగులకే ఆలౌటైంది. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఇదే అత్యల్ప స్కోరు. ఆర్సీబీ బౌలర్లలో హేజిల్ వుడ్ నాలుగు, భువనేశ్వర్ మూడు వికెట్లు పడగొట్టారు.



# థామస్ కప్ క్వార్టర్‌లో భారత్

**హార్సెన్స్:** థామస్ కప్ బ్యాడ్మింటన్‌లో భారత షట్లర్లు అదరగొడుతున్నారు. పురుషుల సింగిల్స్ లో ఆయుష్ షెట్టి, డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ రాణించడంతో ఆస్ట్రేలియాపై క్లీన్ స్వీప్ చేసి క్వార్టర్ ఫైనల్ స్థానం ఖాయం చేసుకుంది. 2022 ఛాంపియన్ కెనడాపై4-1 తేడాతో నెగ్గి థామస్ కప్ పోరును గ్రాండ్‌గా ఆరంభించిన భారత్.. రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను 5-0తో చిత్తుచేసింది. పురుషుల సింగిల్స్‌లో పారిస్ ఒలింపిక్స్ మెడలిస్ట్ లక్ష్యసేన్21-14, 21-16తో స్టీఫెన్ సామ్‌పై, సూపర్ ఫామ్‌లో ఉన్న యువ కెరటం ఆయుష్ షెట్టి 21-18, 21-16తో శ్రేయ్ ధాండ్‌పై నెగ్గి 2-0ఆధిక్యం అందించారు. డబుల్స్‌లో సాత్విక్ -చిరాగ్ జోడీ 21-14, 21-16తో రిజ్కీ హిదా యత్, జాక్ యూ జోడీపై సునాయాసంగా నెగ్గి ఆధిక్యాన్ని 3-0కు పెంచారు. రివర్స్ సింగిల్స్‌లో ప్రణయ్ సైతం జోరు చూపిస్తూ 21-11, 21-17తో రిషి హోండాపై విజయం సాధించాడు.

రెండో డబుల్స్‌లో హరిహరన్, అర్జున్ జోడీ.. 21-12, 21-10తో స్టీఫెన్ ఫామ్, అండికా జోడీపై గెలు పొందారు. దీంతో 5మ్యాచ్‌ల్లోనూ భారత్ నెగ్గి ఆస్ట్రేలియాను క్లీన్‌స్వీప్ చేసింది. గ్రూప్-ఏ లో రెండేసి విజయాలతో భారత్, చైనా సమవుజ్జీలుగా ఉన్నాయి. తర్వాతి మ్యాచ్‌లో భారత్- చైనాతో తలపడనుంది. గత ఏడాది పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తోంది. మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండానే గ్రూప్-ఎ నుంచి చైనా, భారత్ జట్లు క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి.

# నష్టాలనుంచి లాభాల్లోకి సెన్సెక్స్, నిఫ్టీ

## ఫార్మా, ఆయిల్,బ్యాంకింగ్‌ల మద్దతు




**ముంబయి, ఏప్రిల్ 27:**మూడురోజుల నష్టాల ర్యాలీనుంచి దేశీయ ఈక్విటీ సూచీలు లాభాల్లోకి మళ్లాయి. భౌగోళిక ఉద్రిక్తతల్లో సడలింపులు కనిపించడం, నాలుగోత్రైమాసికంలో స్థిరమైన ఫలితాలు కార్పొరేట్లుప్రకటించడం వంటివి మార్కెట్లకు కలిసొచ్చాయి. దీనికితోడు ఇరాన్ హార్ముజ్‌ను తెరుస్తామన్న ప్రతిపాదన తీసుకురావడం మార్కెట్లకు ఊతం ఇచ్చింది. బిఎస్ఇ సెన్సెక్స్ 639.42 పాయింట్లు పెరిగి 77,303.63 పాయింట్ల వద్ద ట్రేడింగ్ ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 194.75 పాయింట్లు పెరిగి 24,092.70 పాయింట్లకు చేరింది. గత సెషన్లలో సెన్సెక్స్ నిఫ్టీలు వరుసగా 3.29శాతం, 2.76శాతం క్షీణించాయి సన్‌ఫార్మా భారీగా లాభపడింది. 7.03శాతం సన్ పెరిగితే రిలయన్స్ 2.88శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.64శాతంపెరిగాయి.మార్కెట్లలో బిఎస్ఇ మిడ్ క్యాప్‌సూచీ 1.38శాతం,స్మాల్‌క్యాప్‌సూచీ 1.98 శాతం పెరిగాయి. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 3075 షేర్లుపెరిగితే 1288 షేర్లు క్షీణించాయి. 208 కంపెనీలషేర్లు నిలకడగా కొనసాగాయి.

భారత్‌పదేళ్ల బాండ్లు 0.27శాతంపెరిగి 6.952గా కొనసాగింది. విదేశీ కరెన్సీ మార్పిడి కౌంటర్లలో భారత్ రూపాయి స్వల్పంగా పెరిగింది. 94.14 వద్ద కొనసాగింది. గత ముగింపులో 94.16గా ఉన్నసంగతి తెలిసిందే. వారం ప్రారంభంలో మెరుగయింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదునాటికి 0.43శాతంపెరిగి రూ.1,52,050గా కొనసాగింది. కమోడిటీ మారెనకట్లలో బ్రెంట్‌ముడిచమురు జూన్ సెటిల్ మెంట్లు 2.47డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 107.80 డాలర్లుగా కొనసాగాయి. ఆర్గానన్ అండ్‌కంపెనీని కొనుగోలుచేసినట్లుప్రకటించడంతోకంపెనీ షేర్లు ఒక్కసారిగా పెరిగాయి. 7.03శాతంపెరిగింది.రిలయన్స్ కూడా 2.88శాతంపెరిగింది. నికరలాభాల్లో వృద్ధి ప్రధానకారణం. వన్ మొబిక్విక్ సిస్టమ్స్ 10.98శాతం పెరిగితే వన్ 97 కమ్యూనికేషన్స్ 1.48శాతం దిగజారింది. పేటిఎంపేమెంట్స్ బ్యాంకు లైసెన్సు రద్దుచేయడంతో షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. వరుణ్ బేవరేజెస్ 5.79శాతంపెరిగింది.యాక్సిస్‌బ్యాంకు మాత్రం 3.05శాం క్షీణించింది. నికరలాభాల్లో క్షీణత ఎఫెక్ట్ చూపించింది. ఇక శ్రీరామ్‌ఫైనాన్స్ కూడా 3.61శాతం పతనం అయింది. మహీంద్ర ఫైనాన్షియల్ సర్వీసెస్ 7.71శాతం పెరిగాయి. కంపెనీ లాభాలు 55.02శాతం పెరగడమే ఇందుకు కారణం. ఎల్‌అండ్‌టి ఫైనాన్స్ 0.86శాతం క్షీణించింది. ఇక ఇండస్‌ఇండ్ బ్యాంకు షేర్లు 6.09శాతం పెరిగాయి. ఐడిఎఫ్‌సిఫస్ట్‌బ్యాంకు 4.57శాతం, అవంటెల్ 1.52శాతంపెరిగితే మంగళూరు రిఫైనరీ పెట్రోకెమికల్స్ 7.59శాతం పతనం అయ్యాయి.ఇండియా సిమెంట్స్ మాత్రం7.25శాతం ర్యాలీతీసింది.డిసిబి బ్యాంకు కూడా త్రైమాసిక ఫలితాలు ఆశించినట్లు లేకపోవడంతోషేర్లు 1.12శాతం క్షీణించాయి.లోధా డెవలపర్స్ 4.64శాతం నికరలాభాలు ప్రకటించడంతోకంపెనీ షేర్లు కూడాపెరిగాయి.సుప్రీం పెట్రోకెమ్ 5.41శాం క్షీణించాయి. తాన్లా ప్లాట్‌ఫామ్స్ 20శాతం ఎగువ సర్క్యూట్‌లోముగిసాయి. కంపెనీ నికరలాభా లు పెరగడం, రెండోతాత్కాలిక డివిడెండ్ 6రూపాయల చొప్పున ప్రకటించడం షేర్లు ర్యాలీకి దారితీసాయి.

## 609 కోట్లకు ఎస్‌బిఐ కార్డ్ లాభాలు

**ముంబయి, ఏప్రిల్ 27:** స్టేట్‌బ్యాంక్ కార్డ్ సంస్థ నాలుగోత్రైమాసికంలో నికరలాభాలు 14శాతంపెరిగి 609 కోట్లకు చేరినట్లు సంస్థ ప్రకటించింది. ఎస్‌బిఐ కార్డ్స్ అండ్‌పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్ పేరుతో ఉన్న ఈ ఎస్‌బిఐ అనుబంధ సంస్థ అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ.534 కోట్లు సాధించింది. మొత్తం రాబడులు కూడా 4832 కోట్లనుంచి రూ.5187 కోట్లకు పెంచుకోగలిగింది. వడ్డీ ఆదాయం మాత్రం గతత్రైమాసికంలో రూ.2415 కోట్లనుంచి రూ.2382 కోట్లకు తగ్గింది. ఈ త్రైమాసికంలో స్థూల నిరర్థక ఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 2.41శాతంగా ఉన్నాయి. ఇక నికర నిరర్థక ఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 1.04శాతానికి దిగివచ్చాయి.రానిబకాయిలు కూడా 1245 కోట్లనుంచి రూ.1097 కోట్లకు తగ్గాయి. పూర్తి ఆర్థికసంవత్సరానికి లాభం 13శాతంపెరిగి రూ.2167 కోట్లుగా ఉంది. మొత్తం రాండులు కూడా రూ.20,708 కోట్లుగా ఉంది. కంపెనీ బ్యాలెన్స్ షీట్‌కూడా 65,546 కోట్లనుంచి రూ.66,328 కోట్లకు పెరిగింది. ఏడాదిక్రితం ఎస్‌బిఐ కార్డ్స్ రూ.534 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం రాబడులు కూడా 4832 కోట్లనుంచి రూ.5187 కోట్లకు పెంచుకోగలిగింది. స్థిరాస్తిప్రమాణాలను గణనీయంగా పెంచుకోగలిగామని, రానున్న కాలంలో మరింతగా ఆర్థికపరిపుష్టి పెరుగుతుందని ఎస్‌బిఐ కార్డ్ సంస్థ ధీమా ప్రకటించింది.




BAJAJ HOUSING FINANCE

## 14శాతం పెరిగిన లాభాలు

**ముంబయి, ఏప్రిల్ 27:** నాన్‌బ్యాంకింగ్ బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ త్రైమాసిక లాభాలు 14శాతంపెరిగాయి. రుణావృద్ధి పటిష్టంగా ఉంది. మార్జిన్లను తగ్గించుకుంటూ హోమ్‌లోన్ మార్కెట్‌లో తన స్థానం నిలబెట్టుకుంటూ వస్తోంది. భారత్ రుణాల డిమాండ్ ఈ ఆర్థిక సంవత్సరం రెండో అర్థభాగంలో పెరుగుతూ వచ్చింది.

ద్రవ్యోల్బణ సడలింపులు, తక్కువ పన్నులు వంటివి గృహవాసుల వ్యయానికి మద్దతిచ్చాయి.కార్పొరేట్ రుణాలుకూడా విస్తృతం అయ్యాయి. ఇపుడు బజాజ్ కంపెనీ నిర్వహణ ఆస్తులు 23శాతంపెరిగి 1.41 లక్షల కోట్లుగా ఉన్నాయి. రుణాల పంపిణీ కూడా 23శాతంపెరిగి 17,506 కోట్లవరకూ ఉన్నాయి. నికరవడ్డీ ఆదాయం 945 కోట్లుగా ఉంది. రుణ ఆస్తులు వంటివి 5.5శాతం పెరిగినట్లు కంపెనీ ఎక్స్ఛేంజిలకు నివేదికిచ్చింది. మార్చి త్రైమాసికంలో 9.1శాతం ఉంది. నికరలాభాలు 587 నుంచి 699 కోట్లకు పెరిగినట్లుప్రకటించింది. ఇక లీజు రెంటల్ డిస్కౌంటింగ్ పోర్టుఫోలియో, కమర్షియల్ రెంటల్ ఆదాయం వంటివి శరవేగంగా పెరుగుతున్న విభాగంగా మారాయి. వార్షికపద్ధతిలో 44శాతంపెరిగినట్లు కంపెనీ ప్రకటించింది.కంపెనీ ప్రమాణాల్లో మొత్తం 44శాతం వాటా కమర్షియల్ అద్దె రాబడులే ఉన్నాయి.

గృహ మంత్రాలయ భారత సరకార

మన జనాభా లెక్కలు మన అభివృద్ధి

(జనాభా గణన 2027 మొదటి దశ)
స్వీయ గణన (SE) పై సాధారణ ప్రశ్నలు మరియు వాటి సమాధానాలు (భాగం-1)

స్వీయ గణన అంటే ఏమిటి?
స్వీయ గణన అనేది ఒక ఆన్‌లైన్ ప్రక్రియ. దీనిలో మీరు గణన అధికారి కోసం వేచి ఉండకుండా, SE పోర్టల్ (se.census.gov.in)లో మీ కుటుంబ వివరాలను మీరే స్వయంగా పూరించి సమర్పించాలి.



- స్వీయ గణన తప్పనిసరా?
  లేదు, ఇది ఒక అదనపు సౌకర్యం. మీరు దీన్ని చేయకపోతే, క్షేత్ర పర్యటన సమయంలో ఒక గణన అధికారి డేటాను సేకరిస్తారు.
- నేను ఏ భాషలోనైనా స్వీయ గణన చేయగలనా?
  ఈ సౌకర్యం హిందీ, ఇంగ్లీష్ మరియు 14 భారతీయ భాషలలో అందుబాటులో ఉంది.
- స్వీయ గణన కోసం ఇంటర్నెట్ అవసరమా?
  అవును, పోర్టల్‌ను యాక్సెస్ చేయడానికి ఇంటర్నెట్ అవసరం.
- నా సమాచారం సురక్షితమేనా?
  అవును, డేటా అంతా సురక్షితంగా, ఎన్‌క్రిప్ట్ చేయబడి ప్రభుత్వ సర్వర్‌లలో నిల్వ చేయబడుతుంది.
- SE ID అంటే ఏమిటి మరియు దాని ఉపయోగం ఏమిటి?
  సమాచారాన్ని సమర్పించిన తర్వాత, మీకు ఒక ప్రత్యేకమైన 11 అంకెల SE ID (SMS/ఇమెయిల్ ద్వారా కూడా) లభిస్తుంది, దీనిని మీ ఇంటికి వచ్చే ఆమె/అతని గణన అధికారికి తప్పనిసరిగా చూపించాలి.
- SE IDని మర్చిపోతే ఏమవుతుంది?
  పోర్టల్‌లో నమోదు చేసుకున్న మొబైల్ నంబర్‌ను ఉపయోగించి దీనిని పొందవచ్చు.
- స్వీయ గణన తర్వాత గణన అధికారి వస్తారా?
  అవును, గణన అధికారి మీ ఇంటికి వచ్చి SE IDని ఉపయోగించి మీ వివరాలను ధృవీకరిస్తారు.
- నేను ఏవైనా డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలా?
  ఏ డాక్యుమెంట్లనూ అప్‌లోడ్ చేయవలసిన అవసరం లేదు
- పోర్టల్‌లో సహాయం అందుబాటులో ఉందా?
  పోర్టల్‌లో యూజర్ గైడ్, ఫ్లోచార్ట్‌లు, ట్యుటోరియల్ వీడియోలు, FAQs మరియు టూల్‌టిప్‌లు ఉన్నాయి.

టోల్ ఫ్రీ - 1855

CBC 19108/13/0043/2627

మన బాధ్యతను నెరవేరుద్దాం, జనాభా గణనలో పాల్గొందాం CensusIndia2027

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.